మన రాష్ట్రం మన పత్రిక

నమస్తే తెలంగాణ

NAMASTE TELANGANA

PUBLISHED FROM: HYDERABAD • KARIMNAGAR • WARANGAL • KHAMMAM • NALGONDA • MAHABUBNAGAR • NIZAMABAD

www.ntnews.com ntdailyonline

సోమవారం MONDAY 1.7.2024 | హైదరాబాద్ HYDERABAD | పేజీలు: 12+4 Pages: 12+4 | సంపుటి (Volume): 14 | సంచిక (Issue): 26 | వెల (Price) రూ.6.50

పోటీ పరీక్షలు, అకడమిక్‌కు సంబంధించిన మెటీరియల్ నేటి 'నిపుణ' ఈ పేపర్‌లో..





గాంధీ దవాఖానలో చికిత్స పొందుతున్న విద్యార్థి నాయకుడు మోతీలాల్‌ను పరామర్శిస్తున్న బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే హరీశ్‌రావు. చిత్రంలో దేవీప్రసాద్ శ్రీనివాస్ తదితరులు

క్యాబినెట్‌లో వివక్ష!

ఉత్తర తెలంగాణ మంత్రులకు అప్రాధాన్య శాఖలు

- మంత్రివర్గంలో అత్యధికులు దక్షిణ తెలంగాణవారే
- సీఎం, డిప్యూటీ సీఎం, స్పీకర్ అందరూ అక్కడివారే
- బీఆర్‌ఎస్ హయాంలో అన్ని జిల్లాలకు సమప్రాధాన్యం
- ప్రభుత్వం, పార్టీ తీరుపై సీనియర్ నాయకుల కినుక
- రాష్ట్ర క్యాబినెట్‌లో పలు జిల్లాలకు లభించని చోటు
- జీర్ణించుకోలేకపోతున్న నేతలు.. పెద్ద ఎత్తున విమర్శలు
- మిగిలిన ఆరు మంత్రి పదవుల్లో దక్కేవి ఎన్ననే చర్చ



హైదరాబాద్, జూన్ 30 (నమస్తే తెలంగాణ): అధికార కాంగ్రెస్ పార్టీలో ఉత్తర తెలంగాణ పట్ల వివక్ష చూపుతున్నారన్న విమర్శ, వాదన చర్చనీయాంశంగా మారింది. రాష్ట్ర మంత్రివర్గ కూర్పులో ప్రస్తుతం దక్షిణ తెలంగాణవారిదే అధిపత్యం కాగా, ఉత్తర తెలంగాణవారికి నామమాత్రపు శాఖలు దక్కినట్టు వాదనలు వినిపిస్తున్నాయి. తాజా మంత్రివర్గ విస్తరణ, పీసీసీ అధ్యక్ష పదవి కేటాయింపులోనైనా ఉత్తర తెలంగాణవారికి అవకాశం దక్కుతుందా? అని ఆ ప్రాంత నాయకులు ఆశగా ఎదురుచూస్తున్నారు. ప్రస్తుతం ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి, స్పీకర్ వంటి కీలక పదవులు, కీలక శాఖలు దక్షిణ తెలంగాణకు చెందిన నాయకులకే దక్కాయి. ఉత్తర తెలంగాణలోని ఆదిలాబాద్, నిజామాబాద్‌తోపాటు రంగారెడ్డి, హైదరాబాద్ ఉమ్మడి జిల్లాలకు కూడా ఇప్పటివరకు ప్రాతినిధ్యమే లేకుండాపోయింది. త్వరలో జరుగనున్న మంత్రివర్గ విస్తరణలోనైనా ఈ రెండు జిల్లాలకు ప్రాతినిధ్యం లభిస్తుందా?, పీసీసీ పీఠం అయినా ఇస్తారా? అన్న సందేహాలు వ్యక్తమవుతున్నాయి. రాష్ట్ర అసెంబ్లీ సీట్ల సంఖ్యను బట్టి 18 మందికి మంత్రి పదవులు ఇవ్వవచ్చు. ప్రస్తుతం సీఎం రేవంత్‌రెడ్డితో కలిపి 12 మంది మంత్రులుండగా.. మరో ఆరు ఖాళీలు ఉన్నాయి. అయితే నాలుగింటిని మాత్రమే భర్తీ చేయాలని సీఎం రేవంత్‌రెడ్డి భావిస్తున్నట్టు తాజా సమాచారం. ప్రభుత్వంలో సీఎం, డిప్యూటీ సీఎం పదవులతో పాటు కీలక శాఖలన్నీ దక్షిణ తెలంగాణకే దక్కాయన్నది ఉత్తర తెలంగాణ నేతల ఆరోపణ. గతంలో ఉమ్మడి రాష్ట్రంలోనూ, తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత కూడా › 5వ పేజీలో

పీసీసీ పీఠమైనా దక్కేనా?

కనీసం పీసీసీ అధ్యక్ష పదవి అయినా ఉత్తర తెలంగాణకు దక్కుతుందా? అని ఆ ప్రాంత కాంగ్రెస్ శ్రేణులు గంపెడాశతో ఎదురుచూస్తున్నారు. నిజామాబాద్ జిల్లాకు చెందిన పీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్, ఎమ్మెల్సీ మహేశ్ కుమార్‌గౌడ్ పీసీసీ అధ్యక్ష పదవి రేసులో ఉన్నట్టు మొదటి నుంచి ప్రచారం జరుగుతున్నది. ఉత్తర తెలంగాణకు కనీసం పార్టీ పదవిలోనైనా ప్రాధాన్యం కల్పిస్తారా? లేదా? అన్నది త్వరలో తేలనున్నది.

టీ20లకు గుడ్‌బై

వీడ్కోలు పలికిన విరాట్, రోహిత్, జడేజా

టీ20 ప్రపంచకప్ కల సాకారంతో రిటైర్మెంట్

టోర్నీ గెలిచిన టీమ్‌ఇండియాకు 125 కోట్లు

బంపర్ బొనాంజా ప్రకటించిన బీసీసీఐ

సుదీర్ఘ భారత క్రికెట్‌లో ఒక శకం ముగిసింది! తమ అద్భుత ఆటతీరుతో కోట్లాది మంది భారతీయులను అలరించిన విరాట్‌కోహ్లీ, రోహిత్‌శర్మ, రవీంద్ర జడేజా అంతర్జాతీయ టీ20లకు మనస్ఫూర్తిగా ముగింపు పలికారు. వెస్టిండీస్ వేదికగా దక్షిణాఫ్రికాతో జరిగిన ఉత్కంఠభరిత ఫైనల్లో టీ20 ప్రపంచకప్ గెలిచిన తర్వాత ఈ ముగ్గురు పొట్టి ఫార్మాట్‌కు వీడ్కోలు పలుకుతున్నట్టు ప్రకటించారు. యువతరానికి తమ మనస్ఫూర్తిగా వారసత్వాన్ని అందిస్తూ భారత్ తరఫున వచ్చేటు, టెస్టుల్లో కొనసాగుతామని పేర్కొన్నారు.

› 12 17 ఏండ్ల ప్రపంచకప్ కలను సాకారం చేసిన టీమ్‌ఇండియాకు బీసీసీఐ 125 కోట్ల బంపర్ ప్రైజ్‌మనీ ప్రకటించింది.

అసెంబ్లీలో నిలదీస్తం

- మోతీలాల్‌కు హాని జరిగితే సర్కారుదే బాధ్యత
- ఆయనతో నిరాహార దీక్షను విరమింపజేయాలి
- నిరుద్యోగులతో సీఎం రేవంత్ చర్చలు జరపాలి
- రాసిచ్చిన బాండ్ పేపర్ సంగతేం చేశారు?
- నాడు రెచ్చగొట్టిన కోదండరాం ఏమైపోయారు
- మోతీలాల్‌ను పరామర్శించిన హరీశ్‌రావు
- విద్యార్థి నేతకు భారీగా పెరుగుతున్న మద్దతు

హైదరాబాద్, జూన్ 30 (నమస్తే తెలంగాణ)/బన్సీలాల్‌పేట్: రాష్ట్ర ప్రభుత్వం దిగొచ్చి వెంటనే నిరుద్యోగులతో చర్చలు జరపాలని, మోతీలాల్ నాయక్ ఆమరణ నిరాహారదీక్షను విరమింపజేయాలని మాజీ మంత్రి, ఎమ్మెల్యే టీ హరీశ్‌రావు డిమాండ్ చేశారు. వారం రోజులుగా నిరుద్యోగుల తరఫున ఆమరణ దీక్ష చేస్తున్న మోతీలాల్‌నాయక్‌ను ఆదివారం సికింద్రాబాద్ గాంధీ దవాఖానలో పరామర్శించిన అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. వచ్చే అసెంబ్లీ › 3వ పేజీలో

రాహుల్‌గాంధీ.. 2 లక్షల ఉద్యోగాలేవీ?

జాబ్ క్యాలెండర్ హామీ ఏమైంది?

బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ › 3

కాంగ్రెస్ నేతల అడ్డగింత

- గాంధీలో ఎమ్మెల్సీ బల్మూరికి చుక్కెదురు
- విద్యార్థి నేతలు, నిరుద్యోగుల నిరసన
- చర్చలు విఫలం.. మెత్తబడని మోతీలాల్
- సీఎంతో భేటీకి ఒప్పించాలని డిమాండ్

రేవంత్‌రెడ్డికి ముకుతాడు!



- ఏకపక్ష నిర్ణయాలకు బ్రేక్.. నెగ్గిన సీనియర్ల మాట
- వలస నేతలకు మంత్రి పదవులు వద్దన్న అధిష్ఠానం
- నామినేటెడ్‌లోనూ సొంత నిర్ణయాలు ఇక చెల్లవు
- ఓడిపోయిన వారికి పదవులు ఇవ్వడం ఉండదు › 5
- పీసీసీ, మంత్రివర్గ విస్తరణలోనూ సీనియర్ల ముద్ర

ప్రైవేటుకు ఢిల్లీ తెలంగాణ టవర్!

24 అంతస్తుల నిర్మాణానికి రూ.500 కోట్ల ఖర్చు

ప్రైవేటు డెవలపర్‌కు అప్పగింతే అంశం పరిశీలన

స్టార్ హోటళ్లతో ప్రభుత్వం సంప్రదింపులు › 3


7న క్లాట్ నోటిఫికేషన్

డిసెంబర్ 1న పరీక్ష › 7

ఆన్‌లైన్ మాధ్యమంలో నీట్ యూజీ!

వచ్చే ఏడాది నుంచి అమలు

కేంద్ర ప్రభుత్వం యోచన › 7



అందని భరోసా.. రైతు ఆత్మహత్య

దాటిపోతున్న సాగు సీజన్

పెట్టుబడికి పుట్టని అప్పులు

పురుగుల మందుతాగి రైతు దస్రు బలవన్మరణం › 5

ఆటో యాప్ ఇంకెప్పుడు?

టీ హబ్ ద్వారా ప్రత్యేకంగా రూపొందిస్తామన్న సీఎం రేవంత్

- 6 నెలలు గడుస్తున్నా ఇంకా మొదలుకాని కసరత్తు
- డ్రైవర్లను ఆదుకుంటామన్న హామీ అమలుకాని వైనం
- రాష్ట్రవ్యాప్త నిరసనలకు సిద్ధమైన వివిధ సంఘాల డ్రైవర్లు



హైదరాబాద్ సిటీబ్యూరో, జూన్ 30 (నమస్తే తెలంగాణ): కాంగ్రెస్ సర్కారు రాకతో డ్రైవర్ల ఉపాధికి తొలి దెబ్బపడింది. ఆ పార్టీ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ఆటో, క్యాబ్ డ్రైవర్ల కుటుంబాలు కష్టంతో కాలం వెళ్లదీస్తున్నాయి. ఆటో డ్రైవర్లను ఆదుకుంటామని, డ్రైవర్ల సంక్షేమానికి టీహబ్ ద్వారా ప్రత్యేక యాప్‌ను తీసుకొస్తామన్న సీఎం రేవంత్‌రెడ్డి హామీలు నీటి మూటలుగానే మిగిలాయి. ఫలితంగా వివిధ డ్రైవర్ల సంఘాల నేతలు రగిలిపోతున్నారు. ఐదు నెలలైనా › 2వ పేజీలో

ఓలా, ఉబర్, ర్యాపిడో తదితర యాప్‌లతో డ్రైవర్లు కమీషన్ల రూపంలో నష్టం చేకూరుతున్నది. ఉచిత బస్సుతో ఆటో, క్యాబ్‌లకు గిరాకీ లేదు. ఈ విషయాలను సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లాం. డ్రైవర్ల సంక్షేమ బోర్డు, ప్రత్యేక యాప్ ఏర్పాటుపై దీపిందిరలో నాంపల్లిలో జరిగిన ఓ కార్యక్రమంలో డ్రైవర్ల సంఘాల నేతల సమక్షంలో హామీ ఇచ్చారు. ప్రత్యేక యాప్ అమలు విషయం అడుగులే వేయలేదు. ఇప్పటికైనా అమలు చేయకపోతే రాష్ట్రవ్యాప్త ఆందోళనకు దిగుతాం.



-సతీశ్, బీఆర్‌ఎస్‌కేవీ ట్యాక్సీ, సిక్కార్ యూనియన్ అధ్యక్షుడు




హైదరాబాద్‌లో గవర్నర్ రాధాకృష్ణన్‌ను కలిసి వినతిపత్రం అందిస్తున్న రాష్ట్ర సర్పంచుల సంఘం అధ్యక్షుడు జే లక్ష్మీనర్సింహారెడ్డి తదితరులు

బిల్లులు ఇవ్వకుంటే ఉద్యమం

- రాష్ట్రవ్యాప్తంగా రూ. 1,200 కోట్లు రావాలి
- అప్పులు తెచ్చి అభివృద్ధి పనులు చేసినం
- సర్కారు స్పందన లేక గవర్నర్‌కు వినతి › 3
- మీడియాతో సర్పంచ్‌ల సంఘం ప్రతినిధులు

యూఎస్‌కు వరంగల్ వస్త్రాలు

- బీఆర్‌ఎస్ హయాంలో రాష్ట్రానికి కిటెక్స్
- 12 రాష్ట్రాలను కాదని ఇక్కడే పెట్టుబడి
- వరంగల్‌లో ఈ నెలలో ట్రయల్ రన్
- ఇక్కడ తయారయ్యే దుస్తులు అమెరికాకు
- తొలి దశలో 12 వేల మందికి ఉద్యోగాలు
- సీతారాంపూర్‌లో శరవేగంగా పనులు
- మొత్తం 50 వేల ఉద్యోగాలు లక్ష్యం



హైదరాబాద్, జూన్ 30 (నమస్తే తెలంగాణ): విన్న పార్క్‌గాన్.. నేడు కిటెక్స్.. బీఆర్‌ఎస్ హయాంలో ఏర్పాటైన పరిశ్రమలు క్రమంగా ఉత్పత్తికి సిద్ధమవుతున్నాయి. ఆగస్టు నుంచి ఉత్పత్తి ప్రారంభించేందుకు పార్క్‌గాన్ ఏర్పాట్లు చేస్తుండగా, జూలై చివర్లో ట్రయల్ రన్ నిర్వహించేందుకు కిటెక్స్ సంస్థ సన్నాహాలు చేస్తున్నది. ట్రయల్ రన్ విజయవంతమైతే ఉత్పత్తి ప్రారంభిస్తారు. చిన్న పిల్లల బట్టల తయారీకి ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన › 2వ పేజీలో



రహస్య విచారణలో లీకులెట్ల ఇస్తరు?

- జస్టిస్ నర్సింహారెడ్డి మీడియాతో ఎలా మాట్లాడారు?
- దర్యాప్తు సంస్థలను కాదని కమిషన్లపై కాలయాపన › 2
- గ్యారెంటీల అమలు దృష్టిని మరల్చేందుకే ఈ డ్రామా
- కుంగిన పిల్లర్లు సరిచేయకుండా రైతులకు రేవంత్ అన్యాయం
- నిరుద్యోగులే కాంగ్రెస్ పాలకుల అధికార మదాన్ని దింపుతరు
- కాంగ్రెస్ సర్కారుపై విరుచుకుపడిన ప్రొఫెసర్ వినోద్‌కుమార్

రాష్ట్రానికి పొంచి ఉన్న డెంగ్యూ ముప్పు

ప్రపంచ ఆరోగ్య సంస్థ హెచ్చరిక

- రాష్ట్రవ్యాప్తంగా ఇప్పటికే పెరుగుతున్న కేసులు
- దోమల నివారణను పట్టించుకోని ప్రభుత్వం
- గ్రామాలు, పట్టణాల్లో పడకేసిన పారిశుధ్యం
- గతంలో ఏటా జూన్‌లో పల్లె, పట్టణ ప్రగతి
- దోమల నివారణతో రాష్ట్రంలో తగ్గిన కేసులు



డెంగ్యూ లక్షణాలు


- తీవ్రజ్వరం, తలనొప్పి, కండ్ల మంట
- వళ్లంతా దద్దుర్లు, కండరాలు, కీళ్ల నొప్పులు
- అధిక దాహం, బీపీ పడిపోవడం
- ముక్కు, నోరు, మలం ద్వారా రక్తస్రావం

హైదరాబాద్, జూన్ 30 (నమస్తే తెలంగాణ): తెలంగాణకు డెంగ్యూ ముప్పు పొంచి ఉన్నది. ఈసారి ఎక్కువ సంఖ్యలో కేసులు నమోదు కావొచ్చు.. స్వయంగా ప్రపంచ ఆరోగ్య సంస్థ ఈ హెచ్చరిక జారీ చేసింది. దేశంలో ఎక్కువ డెంగ్యూ కేసులు నమోదయ్యే అవకాశం ఉన్న రాష్ట్రాల్లో తెలంగాణ ఉన్నట్టు వెల్లడించింది. డెంగ్యూలోని నాలుగు ప్రధాన వేరియంట్లు డీఈఎన్వీ-1, డీఈఎన్వీ-2, డీఈఎన్వీ-3, డీఈఎన్వీ-4 తెలంగాణలో కనిపిస్తున్నాయని తెలిపింది. ఇందులో రెండు, మూడు వేరియంట్లు ఒకేసారి దాడి చేసే ప్రమాదం పొంచి ఉన్నదని హెచ్చరించింది. ప్రభుత్వం ముందస్తు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని సూచించింది. దవాఖానల్లో అవసరమైన కిట్లు, మౌలిక సదుపాయాలు › 9వ పేజీలో

ఆర్మీ, నేవీ చీఫ్‌లుగా క్లాస్‌మేట్స్!

దేశ మిలిటరీ చరిత్రలో ఇదే తొలిసారి

సైనిక్ స్కూల్‌లో కలిసి చదువుకున్న ఉపేంద్ర ద్వివేది, దినేశ్ త్రిపాఠి › 7



నేటి నుంచే అమల్లోకి కొత్త న్యాయ చట్టాలు

- ఐపీసీ, సీఆర్‌పీసీ, ఎవిడెన్స్ యాక్ట్‌కు చెల్లు
- ఇక జీరో ఎఫ్‌ఐఆర్.. ఆన్‌లైన్ ఫిర్యాదులు
- ఎలక్ట్రానిక్ మాధ్యమంలోనూ సమన్లు జారీ
- హేయమైన నేరాలకు సంబంధించిన క్రైమ్ సీన్లకు తప్పనిసరిగా వీడియోగ్రఫీ
- కేసు విచారణలో జాప్యం నివారణకు కోర్టులో రెండు వాయిదాలకే అవకాశం › 7

సదరం.. దారుణం

- అడ్డగోలుగా వైకల్య నిర్ధారణ పత్రాలు జారీ
- మెడికల్ బోర్డుల పరీక్షల్లో వెలుగుచూస్తున్న వైనం
- హెచ్‌హెచ్ క్యాటగిరీ దెబ్బలోనే మరీ అధ్వానం
- నగానికి పైగా తిరస్కరణకు గురవుతున్న అభ్యర్థులు



హైదరాబాద్, జూన్ 30 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో దివ్యాంగుల కోసం ఉద్దేశించిన సదరం సర్టిఫికెట్ల జారీ ఎంత దారుణంగా ఉన్నదో ఇప్పుడిప్పుడే బయటకొస్తున్నది. తప్పుడు ధ్రువీకరణ పత్రాలు పదుల సంఖ్యలో బయటపడుతున్నాయి. సర్టిఫికెట్ల జారీలో క్షేత్రస్థాయి అధికారుల ఏమాత్రం పారదర్శకత పాటించడం లేదని తేటతెల్లమవుతున్నది. మరోవైపు ఈ తప్పుడు సర్టిఫికెట్ల జారీతో అర్హులకు తీవ్ర నష్టం వాటిల్లుతున్నదని దివ్యాంగుల హక్కుల సంఘాల నేతలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రాష్ట్రంలో ప్రభుత్వ పథకాలు, ఉన్నత విద్య, ఉద్యోగాల్లో దివ్యాంగులకు ప్రభుత్వం నాలుగు శాతం రిజర్వేషన్ › 9వ పేజీలో

రహస్య విచారణలో లీకులెట్ల ఇస్తరు?

జస్టిస్ నర్సింహారెడ్డి మీడియాతో ఎలా మాట్లాడారు?

- దర్యాప్తు సంస్థలను కాదని కమిషనంటే కాలయాపనే
- ఉమ్మడి ఏపీలో వేసిన 70 కమిషన్లు ఏమీ తేల్చలేదు
- గ్యారెంటీల అమలు దృష్టిని మరల్చేందుకే ఈ డ్రామా
- కుంగిన పిల్లర్లు సరిచేయకుండా రైతులకు రేవంత్ అన్యాయం
- నిరుద్యోగులను బస్సుల్లో తిప్పి ఎమ్మెల్సీలైన కోదండరాం, వెంకట్
- నిరుద్యోగులే కాంగ్రెస్ పాలకుల అధికార మదాన్ని దింపుతరు
- కాంగ్రెస్ సర్కారుపై విరుచుకుపడిన ప్రొఫెసర్ వినోద్‌కుమార్

హైదరాబాద్ సిటీబ్యూరో/ ప్రధాన ప్రతినిధి, జూన్ 30 (నమస్తే తెలంగాణ)/ఉస్మానియా యూనివర్సిటీ: రహస్యంగా చేయాల్సిన విచారణపై ముందుగానే తీర్పు ఎలా ఇస్తారు? మీడియాతో మాట్లాడుతూ లీకులిస్తున్నారు.. అసలు ఆ అధికారం ఎవరిచ్చారు? కాళేశ్వరంలో ఏం జరిగిందో, లోపాలు ఏమున్నాయో? అనేది మాత్రమే కమిషన్ తేల్చాలి. ఆ తర్వాత ప్రభుత్వానికి నివేదిక ఇవ్వాలి.. అంతేకాని, ముందే తీర్పు ఇస్తే ఎట్ల? అని విద్యుత్తు కొనుగోళ్లపై రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం నియమించిన జస్టిస్ నర్సింహారెడ్డి కమిషన్ తీరుపై ఉస్మానియా యూనివర్సిటీ లా కళాశాల ప్రొఫెసర్ గాలి వినోద్‌కుమార్ ధ్వజమెత్తారు. ఈ కమిషన్ నిబంధనలకు భిన్నంగా వ్యవహరిస్తుందని ఆక్షేపించారు. వాస్తవానికి వ్యక్తుల మధ్య ఒప్పందాలు జరిగితే అవినీతికి తావుండే అవకాశం ఉంటుందని, కానీ రెండు రాష్ట్ర ప్రభుత్వాల మధ్య జరిగిన కొనుగోళ్ల ఒప్పందంలో అక్రమాలు ఎలా జరుగుతాయని ప్రశ్నించారు. ఇదంతా కేవలం కేసీఆర్ ప్రభుత్వాన్ని బదనాం చేయడంతోపాటు ఎన్నికల్లో ఇచ్చిన ఆరు గ్యారెంటీల అమలు నుంచి ప్రజల దృష్టిని మళ్లించేందుకు సీఎం రేవంత్‌రెడ్డి చేస్తున్న ప్రయత్నమని విమర్శించారు. ఏడు నెలల కాంగ్రెస్ పాలనపై తీవ్రస్థాయిలో అసంతృప్తి వ్యక్తంచేసిన గాలి వినోద్‌కుమార్.. చాకిర్యం అంశంతోపాటు ప్రస్తుతం రాష్ట్రంలో నిరుద్యోగులు పడుతున్న ఇబ్బందులు, వారి ఆవేదనను 'నమస్తే తెలంగాణ'తో పంచుకున్నారు. వినోద్‌కుమార్ వెల్లడించిన అభిప్రాయాలు ఆయన మాటల్లోనే..



ఉమ్మడి ఏపీలో వేసిన 70 కమిషన్లు ఏం తేల్చాయి?

వ్యక్తుల మధ్య ఒప్పందాలు జరిగితే అక్రమాలు జరిగే ఆస్కారం ఉంటుంది. రెండు రాష్ట్ర ప్రభుత్వాల మధ్య జరిగిన ఒప్పందంలో ఇతర లావాదేవీలకు తావే ఉండదు. కొన్ని మార్గదర్శకాలు, నిబంధనలు ఉంటాయి. అదే రీతిన ఛత్తీస్‌గఢ్-తెలంగాణ రాష్ట్రాల మధ్య విద్యుత్తు కొనుగోళ్ల ఒప్పందం జరిగింది. అదేమీ కేసీఆర్ సొంత వ్యవహారం కాదు. సీఎం హోదాలో కేసీఆర్ ఆదేశాలు ఇస్తారు గానీ, నిబంధనల ప్రకారం కొనుగోళ్ల.. ఒప్పందాల ప్రక్రియ పూర్తిచేసేది అధికారులు మాత్రమే. ఒకవేళ అధికారులు అవినీతికి పాల్పడితే, ఇప్పుడు రేవంత్‌రెడ్డి ప్రభుత్వంలో ఉన్న ఆ అధికారులపై ఎందుకు చర్యలు తీసుకోవడం లేదు? ఆ అధికారులను వదిలిపెట్టి కాని మొత్తం కేసీఆర్ తప్పు చేశారు, కింది నుంచి పైదాకా అంతా కేసీఆర్ సంతకాలు చేశారు అన్నట్టుగా సీఎం రేవంత్ బదనాం చేస్తున్నారు. రెండు రాష్ట్ర ప్రభుత్వాల మధ్య జరిగిన ఒప్పందాల్లో అక్రమాలు జరిగాయనుకుంటే విచారణకు కేంద్ర ప్రభుత్వ అధీనంలోని ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్, సీబీఐ ఉన్నాయి. రాష్ట్ర ప్రభుత్వ అధీనంలోని దర్యాప్తు సంస్థలతోనైనా విచారణ చేపట్టవచ్చు. కానీ, న్యాయ విచారణ పేరిట కాలయాపనకు దిగారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో వివిధ అంశాలపై వేసిన 70 కమిషన్లు కిందిస్థాయి తేల్చలేకపోయాయి. ఇప్పుడు నర్సింహారెడ్డి కమిషన్ కూడా తేల్చేది ఏమీ ఉండదు. కేవలం కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో ఇచ్చిన ఆరు గ్యారెంటీల అమలుపై ప్రజల్లో చర్చ జరగకుండా, వారి దృష్టిని మరల్చేందుకు మాత్రమే ఈ కమిషన్ వేశారనేది అందరికీ అర్థమవుతుంది. విచారణను రహస్యంగా చేపట్టకుండా, ముందుగానే తీర్పు ఇస్తున్నారు. మీడియాకు లీకులు ఇస్తున్నారు. అసలు మీడియాతో మాట్లాడే అధికారం ఆయనకు ఎవరిచ్చారు? కొనుగోళ్లలో ఏం జరిగిందో, అందులో ఏమైనా లోపాలు ఉన్నాయా అనేది మాత్రమే కమిషన్ తేల్చాలి. ప్రభుత్వానికి నివేదిక ఇవ్వాలి గానీ తీర్పు ఇస్తే ఎట్ల? తీర్పులు ఇచ్చేందుకు న్యాయస్థానాలు ఉన్నాయి కదా.

అసమర్థతను కప్పిపుచ్చుకునేందుకే ఈ డ్రామాలు

మనం ఒక ఇల్లు కట్టుకునేందుకు బిల్డర్‌కు కాంట్రాక్టు ఇస్తం. అందులో ఒక పిల్లర్ కుంగిపోతే బాధ్యత యజమానిదా? బిల్డర్‌దా? కాళేశ్వరం ప్రాజెక్టులో రెండు పిల్లర్లు కుంగిపోయాయి. కానీ అదేదో అంతా కేసీఆర్ చేయడం వల్లే అయిందంటూ రాజకీయంగా బదనాం చేసేందుకు సీఎం రేవంత్‌రెడ్డి ప్రయత్నిస్తున్నారు. వారు సీఎంగా కేసీఆర్ తానే పట్టి బరాజ్ నిర్మించారా? నేడు కాంగ్రెస్ అధికారంలోనే ఉన్నది కదా.. వెంటనే విచారణ చేసి బాధ్యులైన ఇంజినీర్లపై ఎందుకు చర్యలు తీసుకోవడం లేదు? కాళేశ్వరం ప్రాజెక్టులోని ఒక బరాజ్‌లో రెండు పిల్లర్లు కుంగిపోతే, మొత్తం ప్రాజెక్టు వృథా అయినట్టుగా చిత్రీకరిస్తున్నారు. రుణమాఫీ, రైతుభరోసా, కౌలు రైతులు, వ్యవసాయ కూలీలకు ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా పొద్దున లేస్తే కాళేశ్వరంలో అవినీతి అంటూ ఈ ప్రభుత్వం కాలయాపన చేస్తున్నది. రాష్ట్రంలో రైతాంగానికి సాగునీరు ఇవ్వకుండా పంటలను ఎండబెడుతుంది. తన అసమర్థతను కప్పిపుచ్చుకునేందుకే ఈ డ్రామాలన్నీ ఆడుతున్నది. ఒకవైపు నేషనల్ డ్యాం సేఫ్టీ అథారిటీ సాంకేతికంగా అన్వరాలుగా పరిశీలించి, ప్రస్తుతం మరమ్మతులు చేయాలని ఆదేశించింది. దాని మీద దృష్టి పెట్టకుండా, రూ.98 వేల కోట్లు ఖర్చయిన ప్రాజెక్టులో లక్ష కోట్లు అవినీతి జరిగిందంటూ రాజకీయంగా కేసీఆర్‌ను బదనాం చేసేందుకే సీఎం రేవంత్‌రెడ్డి తన సమయమంతా కేటాయిస్తున్నారు. నిజంగా కాళేశ్వరంలో అవినీతి జరిగితే రాష్ట్ర ప్రభుత్వం ఈడీ, సీబీఐకి ఎందుకు ఫిర్యాదు చేయడం లేదు? మళ్లీ ఇందులో కూడా న్యాయ విచారణ అంటూ కాలయాపన చేయడానికే కాంగ్రెస్ ప్రభుత్వం డైవర్షన్ పాలిటిక్స్ చేస్తున్నది.

అధికారంలోకి రాగానే నిరుద్యోగులు పలుచనయ్యారా?

ఎన్నికల ముందు కోదండరాంరెడ్డి, బల్మూరి వెంకట్, రియాజ్ వంటి వాళ్లు నిరుద్యోగులను బస్సుల్లో తిప్పి రాజకీయంగా వాడుకున్నరు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే కోదండరాంరెడ్డి, బల్మూరి వెంకట్ ఎమ్మెల్సీలయ్యారు. రియాజ్ గ్రంథాలయ సంస్థ చైర్మన్ అయ్యారు. ఆకునూరి మురళికి కూడా ఏదో పదవి ఇస్తున్నారని మీడియాలో వార్తలు వస్తున్నాయి. వంద రోజుల్లో జాబ్ క్యాలెండర్ ప్రకటించి, అమలులోకి తీసుకొచ్చి నిరుద్యోగులకు న్యాయం చేస్తామని 2023 అక్టోబర్ 1న సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో హామీ ఇచ్చిన రేవంత్‌రెడ్డి ముఖ్యమంత్రి అయ్యారు. అధికారంలోకి రాగానే గ్రూప్-1లో 1:100 నిష్పత్తిలో మెయిన్స్‌కు ఎంపిక చేస్తామని అసెంబ్లీ వేదికగా చెప్పిన భట్టి విక్రమార్క డిప్యూటీ సీఎం అయ్యారు. ఇప్పుడు అన్ని శాఖల్లో 2,67,032 ఉద్యోగాల ఖాళీలు ఉన్నాయి. ఏడాదిలోపు రెండు లక్షల ఉద్యోగాలు నింపుతామన్న కాంగ్రెస్ పార్టీ ఇప్పటివరకు కనీసం జాబ్ క్యాలెండర్ ప్రకటించలేదు. నిరుద్యోగులకు సంబంధించిన ఏ ఒక్క హామీనీ నెరవేర్చలేదు. పైగా ప్రశ్నిస్తే అరెస్టు చేస్తూ, జైళ్లలో పెడుతున్నారు. మొన్నటిదాకా 30 లక్షల మంది నిరుద్యోగులను వాడుకున్న రియాజ్ అధికారంలోకి రాగానే హోలాగాళ్లు, పొగరిగాళ్లు.. అని తిడతారా! ఇంత అహంకారమా? అధికారం అప్పగించిన వాళ్లు ఇంత పలుచనగా కనబడుతున్నారా? అధికారానికి ఎక్కించినవాళ్లే స్థానిక సంస్థల్లో వీళ్లను జీరో చేస్తరు. అధికార మదాన్ని దింపుతరు.

> ### విఫలమైనందునే ఎంపీ సీట్లు తగ్గినయ్!
>
> రాష్ట్రంలో ఎనిమిది మంది ఎమ్మెల్యేలున్న బీజేపీకి ఎనిమిది ఎంపీ సీట్లు వచ్చాయి. అదే 64 సీట్లు ఉన్న కాంగ్రెస్‌కు కూడా ఎనిమిది ఎంపీ సీట్లే వచ్చాయి. అంటే కాంగ్రెస్ ప్రభుత్వం వైఫల్యం చెందిందనేందుకు ఇదే ఉదాహరణ. ఏ ఒక్క వర్గానికీ కాంగ్రెస్ ప్రభుత్వం న్యాయం చేయడం లేదు. ఉద్యోగులకు ఇచ్చిన హామీలను తుంగలో తొక్కుతున్నరు. పదోన్నతులు ఇచ్చి ఇదేదో తమ ఘనతగా చెప్పుకుంటున్నరు. గత ప్రభుత్వం ఇచ్చిన నోటిఫికేషన్ల ద్వారా అన్ని ప్రక్రియలు పూర్తయితే వారికి అపాయింట్‌మెంట్ ఆర్డర్లు ఇచ్చి మేమిచ్చినం అని చెప్తున్నరు. గత ప్రభుత్వంలో 10 మంది మాదిగ సామాజికవర్గ ఎమ్మెల్యేలు ఉంటే ఇప్పుడు ఐదుగురికి పడిపోయారు. బీసీలు గతంలో 21 మంది ఎమ్మెల్యేలు ఉంటే ఇప్పుడు 17 మందే ఉన్నరు. కుల గణన చేస్తామని చెప్పి అది చేపట్టకుండానే స్థానిక సంస్థల ఎన్నికలకు సిద్ధమవుతున్నరు. ఇలా ఏ ఒక్క వర్గానికీ న్యాయం చేయకుండా, హామీల అమలుపై చర్చ జరగకుండా కాలయాపన చేస్తున్నారు. ఇప్పటికైనా కాంగ్రెస్ ప్రభుత్వం తాను నెరవేర్చాల్సిన బాధ్యతలను గుర్తుచేసుకోవాలి.

యూఎస్‌కు వరంగల్ వస్త్రాలు

> మొదటిపేజీ తరువాయి...

ఈ పరిశ్రమ.. బీఆర్‌ఎస్ ప్రభుత్వ పారిశ్రామిక, స్నేహపూర్వక విధానాలు, కేటీఆర్ పట్టుదలకు అద్దంపడుతూ రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టింది. దేశంలోని 12 రాష్ట్రాలు, శ్రీలంకను కాదని మన రాష్ట్రానికి రావటం విశేషం. 2021 జూలైలో కిటెక్స్ ఎండీ సాబూజాకబ్ వరంగల్, సీతారాంపూర్‌ను సందర్శించిన తర్వాత కేటీఆర్‌తో సమావేశమై రాష్ట్రంలో రూ.1,000 కోట్ల పెట్టుబడి పెడుతూ 4,000 ఉద్యోగాలు కల్పించనున్నట్టు ప్రకటించారు. దీంతో వారికోసం బీఆర్‌ఎస్ ప్రభుత్వం సీతారాంపూర్‌లో 250, వరంగల్‌లో 185 ఎకరాలు కేటాయించింది. నీరు, విద్యుత్తు తదితర మౌలిక సదుపాయాలను కల్పించింది. 2021, సెప్టెంబర్‌లో భూమి పూజ సందర్భంగా తన పెట్టుబడిని రూ.3,000 కోట్లకు పెంచడమే కాకుండా 50వేల ఉద్యోగాలు కల్పిస్తామని కిటెక్స్ ఎండీ వెల్లడించారు. వరంగల్‌లో ఏర్పాటు చేస్తున్న పరిశ్రమ జూలై చివర్లో ట్రయల్‌రన్‌కు సిద్ధమవుతుండగా, సీతారాంపూర్‌లో నిర్మాణ పనులు వేగంగా సాగుతున్నాయి. మొదటి దశలో 12,000 మందికి ఉద్యోగాలు లభించే అవకాశం ఉన్నది. ఈ ఏడాది చివరికల్లా సీతారాంపూర్‌లో ఉత్పత్తి ప్రారంభించాలని కిటెక్స్ లక్ష్యంగా పెట్టుకున్నది. వరంగల్ పరిశ్రమలో ఈ ఏడాది మార్చిలోనే ఉత్పత్తి మొదలుపెట్టాలని నిర్ణయించినప్పటికీ విదేశాల నుంచి యంత్రసామగ్రి రావటంలో జాప్యం వల్ల ఆలస్యమైందని పరిశ్రమవర్గాలు తెలిపాయి.

గిట్టుబాటు ధర, ఉద్యోగాల కల్పన

కాటన్ ఉత్పత్తిలో తెలంగాణ మూడో స్థానంలో ఉన్నది. ఇక్కడి కాటన్ మేలి రకమైనది. మన రాష్ట్రంలో గుజరాత్, తమిళనాడు తరహాలో చెప్పుకోదగ్గ వస్త్ర పరిశ్రమలు, స్పిన్నింగ్ మిల్లులు లేకపోవటం వల్ల ఇక్కడి కాటన్‌కు తగిన గుర్తింపు రావటం లేదు. ప్రస్తుతం కిటెక్స్ సంస్థ కాటన్ ప్రాసెస్ మెకానైజ్ చేస్తున్నది. దీంతో పత్తి రైతులకు గిట్టుబాటు ధర లభిస్తుందని పరిశ్రమ వర్గాలు చెప్తున్నాయి. వరంగల్, సీతారాంపూర్‌లో పరిశ్రమలు ఉత్పత్తి మొదలుపెడితే రోజుకు 2.2 మిలియన్ల దుస్తులు తయారవుతాయి. ఇవన్నీ అమెరికా మార్కెట్‌కు ఎగుమతి చేయాలని సంస్థ నిర్ణయించింది. దీంతో రూ.4,000 కోట్ల విదేశీ మారక ద్రవ్యం రాష్ట్రానికి వచ్చే వస్తుంది. 50 వేల మంది ఉద్యోగాల్లో దాదాపు 30 వేల ఉద్యోగాలు ప్రత్యక్ష ఉద్యోగాలు కాగా, మిగిలినవి పరోక్ష ఉద్యోగాలు. మొత్తం ఉద్యోగాల్లో 85 శాతం మహిళలనే నియమించాలని సంస్థ నిర్ణయించింది. అలాగే, రైతులు పండించిన కాటన్‌లో 12-15 శాతం తీసుకోనున్నది.

సీతారాంపూర్‌లో అతి పొడవైన తయారీ పరిశ్రమ

సీతారాంపూర్‌లో ప్రపంచంలోనే అతి పొడవైన తయారీ పరిశ్రమ భవనాన్ని నిర్మిస్తున్నారు. 1,350 మీటర్ల పొడవైన మూడు భవనాలు నిర్మిస్తున్నారు. ప్రస్తుతం అమెరికాలోని టెక్సాస్‌లో టెస్లా కంపెనీ ప్రపంచంలో అతి పొడవైన భవనంగా ఉన్నది. టెస్లా భవనం పొడవు 1,160మీటర్లు. అంటే టెస్లా బిల్డింగ్ కన్నా సుమారు 190 మీటర్లు అధిక పొడవైన భవనాన్ని కిటెక్స్ నిర్మిస్తున్నది.

కిటెక్స్ తెలంగాణకు రాక వెనుక

2021లో పరిశ్రమను కేరళ నుంచి బయటకు తరలించాలని కిటెక్స్ సంస్థ నిర్ణయించింది. దీంతో దేశంలోని ఢిల్లీ, మధ్యప్రదేశ్, ఆంధ్రప్రదేశ్, ఉత్తరప్రదేశ్, మహారాష్ట్ర, జార్ఖండ్, ఒడిశా తదితర 12 రాష్ట్రాలతోపాటు శ్రీలంక కూడా సదరు పరిశ్రమను తమ ప్రాంతంలో ఏర్పాటు చేయాలని ఆహ్వానించాయి. వారి ఆహ్వానంపై సంస్థ ఎండీ సాబూజాకబ్ ఆయా రాష్ట్రాలను సందర్శించారు. ఈ క్రమంలోనే జూలై 2021లో అప్పటి పరిశ్రమలశాఖ మంత్రిగా ఉన్న కేటీఆర్ కూడా వారిని తెలంగాణకు ఆహ్వానించారు. కరోనా లాక్‌డౌన్ ఉన్నందున తాను రాలేనని చెప్పడంతో ప్రత్యేక ఫ్లైట్‌ను కేరళకు పంపి ఆయనను రాష్ట్రానికి రప్పించారు.

విద్యుత్తు ప్రైవేటీకరణకు కాంగ్రెస్ కుట్ర

- అందుకే బిల్లుల వసూలు కాంట్రాక్ట్ అదానీ కంపెనీకి
- ఇది పాతబస్తీకే పరిమితం కాదు.. రాష్ట్రమంతా ఉంటది
- సబ్సిడీలు, ఉచిత కరెంటు బంద్
- మోటర్లకు మీటర్లు పెడుతరు
- ప్రైవేట్ వ్యక్తులకు అప్పగిస్తే విద్యుత్తు వ్యవస్థ నాశనం
- మోదీ కనుసన్నల్లోనే సీఎం రేవంత్‌రెడ్డి వ్యవహారం
- జగదీశ్‌రెడ్డి మండిపాటు



హైదరాబాద్, జూన్ 30 (నమస్తే తెలంగాణ): విద్యుత్తు రంగాన్ని ప్రైవేటీకరించేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం కుట్ర చేస్తున్నదని బీఆర్‌ఎస్ నేత, మాజీ మంత్రి జీ జగదీశ్‌రెడ్డి విమర్శించారు. పైలట్ ప్రాజెక్టుగా ఓల్డ్‌సిటీలో విద్యుత్తు బిల్లుల వసూళ్లను అదానీ కంపెనీకి అప్పగిస్తామని లీకులివ్వడం తొలిమెట్టని, అది పాతబస్తీకే పరిమితం కాదని, రాష్ట్రమంతా అమలవుతుందని చెప్పారు. ఇక విద్యుత్తు ఉద్యోగుల పాత్ర నామమాత్రమవుతుందని, వ్యవస్థ మొత్తం నాశనమవుతుందని ఆందోళన వ్యక్తంచేశారు. దీనిపై విద్యుత్తు ఉద్యోగులు, వినియోగదారులు ఉద్యమించాల్సిన సమయం వచ్చిందని చెప్పారు. విద్యుత్తు బిల్లుల వసూలు కాంట్రాక్ట్ అంశంపై ప్రభుత్వం స్పష్టమైన వైఖరి తెలపాలని డిమాండ్ చేశారు. తెలంగాణభవన్‌లో ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ విద్యుత్తు వ్యవస్థ ప్రైవేట్‌కు వెళ్తే సబ్సిడీలు, రైతులకు ఉచిత కరెంటు ఇక అమలు కాదని, వ్యవసాయ మోటర్లకు మీటర్లు పెడతారని హెచ్చరించారు. గతంలో కేసీఆర్ ప్రభుత్వంపై ఒత్తిడి వచ్చినా విద్యుత్తు రంగాన్ని ప్రైవేట్‌కు అప్పగించడానికి కేసీఆర్ అంగీకరించలేదని గుర్తుచేశారు. ప్రధాని మోదీ కనుసన్నల్లోనే రేవంత్‌రెడ్డి వ్యవహరిస్తున్నారని, అందుకే మోదీ, అదానీ విధానాలను తెలంగాణలో రేవంత్‌రెడ్డి అమలు చేస్తున్నారని విమర్శించారు.

పాతబస్తీ ప్రజలను అవమానిస్తున్న రేవంత్

ఓల్డ్‌సిటీలో 45 శాతమే కరెంటు బిల్లులు వసూలవుతున్నాయని, అందుకే వసూలు బాధ్యతను అదానీ కంపెనీకి అప్పగిస్తున్నట్టు ఢిల్లీలో రేవంత్‌రెడ్డి చెప్పినట్టు మీడియాలో వార్తలు వచ్చాయని జగదీశ్‌రెడ్డి గుర్తుచేశారు. రేవంత్ మాటలు పూర్తి అబద్ధమని, పదేండ్ల బీఆర్‌ఎస్ పాలనలో ఓల్డ్‌సిటీ నుంచి 97-98 శాతం వసూలయ్యాయని తెలిపారు. రేవంత్‌రెడ్డి చర్యలు ఓల్డ్‌సిటీ ప్రజలను అవమానించేలా ఉన్నాయని మండిపడ్డారు. 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్తు ఇస్తామని కాంగ్రెస్ ప్రభుత్వం చెప్పిందని, ఓల్డ్‌సిటీలో 200 యూనిట్లలోపే కరెంటు బిల్లు వచ్చే కుటుంబాలు ఎక్కువ ఉన్నాయని పేర్కొన్నారు. అలాంటప్పుడు బిల్లుల వసూలు ప్రైవేట్ వ్యక్తులకు ఇవ్వడం ఎందుకని ప్రశ్నించారు. బిల్లుల వసూలు పేరుతో ప్రైవేట్ వ్యక్తులకు ఇస్తున్నారా? లేక విద్యుత్తు రంగాన్ని ప్రైవేటుపరం చేయాలని చూస్తున్నారా? అని నిలదీశారు. సింగరేణి బొగ్గు గనుల వేలంలో డిప్యూటీ సీఎం భట్టి పాల్గొన్నారని, శ్రావణపల్లి బొగ్గు గని వేలాన్ని ఎందుకు ఆపలేదని నిలదీశారు. బీఆర్‌ఎస్ హయాంలో ఎప్పుడూ వేలంలో పాల్గొనలేదని స్పష్టంచేశారు. బొగ్గు గనులను లీజుకు తీసుకున్న కంపెనీలను తాము అనుమతించబోమని అప్పటికే బీఆర్‌ఎస్ స్పష్టంచేసిందని పేర్కొన్నారు. సమావేశంలో మాజీ ఎంపీ బడుగుల లింగయ్యయాదవ్, బీఆర్‌ఎస్ నేతలు క్యామ మల్లేశ్, వెంకటరెడ్డి పాల్గొన్నారు.

> ### ఆటో యాప్ ఇంకెప్పుడు?
>
> మొదటిపేజీ తరువాయి...
>
> తమను ఆదుకోకపోవడంతో రాష్ట్రవ్యాప్త నిరసనలకు దిగేందుకు సిద్ధమయ్యారు. ఉచిత బస్సు స్కీంతో ఆటో, క్యాబ్ డ్రైవర్లకు గిరాకీ లేక తొలి నుంచి ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఫైనాన్స్ కిస్తీలు చెల్లించలేక, కుటుంబాలను పోషించుకోలేక నానా యాతన పడుతున్నారు. ఇలాంటి దుస్థితిలో కొందరు ఆటో డ్రైవర్లు బలవన్మరణాలకు పాల్పడ్డారు. అయినా ప్రభుత్వం కనికరం చూపడం లేదని డ్రైవర్ల కుటుంబాలు ఆవేదన చెందుతున్నాయి. మరోవైపు ఇతర రాష్ట్రాల వాహనాలు సైతం నగరంలో నిబంధనలకు విరుద్ధంగా కార్యకలాపాలు సాగిస్తున్నాయి. ఈ పరిస్థితుల్లో తమకు న్యాయం చేయాలని తొలుత డ్రైవర్లు పోరుబాట పట్టినా, కాంగ్రెస్ ప్రభుత్వానికి చీమకుట్టినట్టు కూడా లేదని యూనియన్ నాయకులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. డ్రైవర్ల సంక్షేమం కోసం టీహబ్ ద్వారా ప్రత్యేక యాప్ తీసుకొస్తామన్న సీఎం రేవంత్‌రెడ్డి హామీ ఇచ్చి 5 నెలలు గడుస్తున్నా ఇంకా అమలుకాలేదని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. తమ కుటుంబాలను ఆదుకుంటామన్న మాటలు కూడా నీటిమూటలుగానే మిగిలిపోయాయని ఆవేదన చెందుతున్నారు. తక్షణమే డ్రైవర్లను ఆదుకోవాలని, ప్రభుత్వమే యాప్ రూపొందించి అండగా నిలవాలని వివిధ వాహన సంఘాల నాయకులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. లేదంటే రాష్ట్రవ్యాప్త నిరసనలకు దిగుతామని వారు స్పష్టం చేస్తున్నారు.

> ### బొగ్గు బ్లాకులపై కిషన్‌రెడ్డి చెప్పేవన్నీ అబద్ధాలే
>
> సీపీఐ ఎమ్మెల్యే కూనంనేని
>
> ఖమ్మం కమాన్‌బజార్, జూన్ 30: బొగ్గు బ్లాకుల విషయంలో కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి అబద్ధాలు చెబుతున్నారని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు విమర్శించారు. ఖమ్మంలో ఆదివారం జరిగిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఇతర రాష్ట్రాల్లో ప్రభుత్వరంగ సంస్థలకు బొగ్గు గనులను కేటాయించినప్పుడు తెలంగాణలో ఎందుకు కేటాయించరని ప్రశ్నించారు. బొగ్గు గనుల వేలాన్ని నిరసిస్తూ ఈ నెల 5 నుంచి రాష్ట్రవ్యాప్తంగా కలెక్టరేట్ల వద్ద తమ పార్టీ ఆధ్వర్యంలో ఆందోళనలు చేస్తామని తెలిపారు. బొగ్గు గనుల వేలాన్ని ఉపసంహరించుకునే వరకు తమ ఆందోళనలు కొనసాగిస్తామని హెచ్చరించారు.

కొత్త చట్టాలతో న్యాయ వ్యవస్థ నిర్వీర్యం

- దేశ రక్షణ కవచంపై మోదీ దెబ్బ
- ఎఫ్‌ఐఆర్ నమోదుకు 15 రోజులు
- బార్ కౌన్సిల్‌ను సంప్రదించలే
- సుప్రీంకోర్టులో సవాల్ చేస్తాం
- మాజీ ఎంపీ వినోద్‌కుమార్



ఆదివారం తెలంగాణభవన్‌లో మీడియాతో మాట్లాడుతున్న బోయినపల్లి వినోద్‌కుమార్

హైదరాబాద్, జూన్ 30 (నమస్తే తెలంగాణ): నేటినుంచి అమలుకానున్న మూడు కొత్త చట్టాలు దేశ ప్రజాస్వామ్య వ్యవస్థకు గొడ్డలిపెట్టుగా మారనున్నాయని బీఆర్‌ఎస్ నేత, మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్‌కుమార్ ఆందోళన వ్యక్తంచేశారు. కేంద్రం తెచ్చిన ఈ చట్టాలతో ప్రజల ప్రాథమిక హక్కులకు విఘాతం కలుగుతుందని మండిపడ్డారు. ఎఫ్‌ఐఆర్ నమోదుకు 15 రోజులు, పోలీస్ కస్టడీకి 14 రోజులకు బదులు 90రోజుల దాకా అవకాశమిచ్చారని, తద్వారా బాధితుడికి అన్యాయం జరుగుతదని ఆగ్రహం వ్యక్తంచేశారు. బార్ కౌన్సిల్, బార్ అసోసియేషన్ల అభిప్రాయం తీసుకోకుండా ఏకపక్షంగా తెచ్చిన చట్టాలను తక్షణమే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. తెలంగాణభవన్‌లో బీఆర్‌ఎస్ లీగల్‌సెల్ ఇన్‌చార్జి సోమభరత్‌కుమార్‌తో కలిసి ఆయన సోమవారం మీడియాతో మాట్లాడారు. క్రిమినల్ ప్రొసీజర్ కోడ్, ఇండియన్ పీనల్ కోడ్, ఇండియన్ ఎవిడెన్స్ యాక్ట్‌లను కేంద్రం రద్దు చేసి కొత్తగా భారతీయ నాగరిక సురక్ష సంహిత, భారతీయ న్యాయ సంహిత, భారతీయ సాక్ష్య అధినియమ్ పేర్లతో కొత్త చట్టాలు తెచ్చిందని, హిందీ, సంస్కృతంలో పెట్టిన ఈ పేర్లు దక్షిణ భారత రాష్ట్రాల భాషకు వ్యతిరేకంగా ఉన్నాయని చెప్పారు. తమపై బలవంతంగా హిందీని రుద్దడం ఏమిటని ప్రశ్నించారు. చట్టాల మార్పు బిల్లులను నిరుడు ఆగస్టులో మోదీ సర్కారు ప్రవేశపెట్టిందని గుర్తుచేశారు. పార్లమెంట్ స్టాండింగ్ కమిటీ కొత్త చట్టాలపై విస్తృతంగా పరిశీలించి అనేక మంది సూచనలు చేసినా కేంద్రం పట్టించుకోలేదని విమర్శించారు. దాదాపు 160 మంది పార్లమెంట్ సభ్యులను బయటకు పంపి బిల్లును కేంద్రం పాస్ చేయించుకున్నదని మండిపడ్డారు. దేశవ్యాప్తంగా ఉన్న సీనియర్ న్యాయవాదులు, మేధావులు, సుప్రీంకోర్టు, హైకోర్టు మాజీ న్యాయమూర్తులు కొత్త చట్టాలను వ్యతిరేకిస్తున్నారని తెలిపారు.

ఆందోళనలతో రైతు చట్టాలు రద్దు

మోదీ తెచ్చిన వ్యవసాయ నల్ల చట్టాలతో అనేక మంది రైతులు చనిపోయారని, నెలల తరబడి ఆందోళన చేయడం వల్ల వాటిని రద్దు చేసి మోదీ క్షమాపణ చెప్పారని వినోద్‌కుమార్ గుర్తుచేశారు. ఈ కొత్త చట్టాల అమలును కూడా వాయిదా వేయాలని డిమాండ్ చేశారు. 15 రోజులపాటు ఎఫ్‌ఐఆర్ రిజిస్టర్ చేయకుండా క్రిమినల్ ఎంక్వైరీ చేసేలా మార్పులు చేశారని, పోలీసుల చేతికే న్యాయ వ్యవస్థను అప్పగించారని ఆందోళన వ్యక్తంచేశారు. ఇప్పటికే స్టేషన్ బెయిల్‌ను కొందరు స్టేషన్ హౌస్ ఆఫీసర్లు దుర్వినియోగం చేస్తున్నారని, బాధితులే హింసకు గురవుతున్నారని మండిపడ్డారు. కొత్త చట్టాలపై తెలంగాణ బీజేపీ ఎంపీలు స్పందించాలని డిమాండ్ చేశారు. వాటికి వ్యతిరేకంగా సుప్రీంకోర్టులో రిట్ పిటిషన్ దాఖలుచేస్తామని చెప్పారు.

బ్రిటీష్ వాళ్లకంటే దారుణం

కొత్త చట్టాలతో దేశం తిరోగమనంలోకి వెళ్తుందని బీఆర్‌ఎస్ రాష్ట్ర కార్యదర్శి, పార్టీ లీగల్ సెల్ ఇన్‌చార్జి సోమ భరత్‌కుమార్ ఆందోళన వ్యక్తంచేశారు. అమలులో ఉన్న చట్టాలను మార్చాలంటే బార్ కౌన్సిల్, బార్ అసోసియేషన్స్, మేధావుల అభిప్రాయాలు తీసుకోవాలని చెప్పారు. బ్రిటీష్ వాళ్లు సైతం చట్టం చేసే ముందు బార్ అసోసియేషన్లతోపాటు వర్తక సంఘాల అభిప్రాయాలు తీసుకున్నారని, మోదీ పాలన బ్రిటీష్‌వాళ్ల కంటే దారుణంగా తయారైందని విమర్శించారు. దేశ రక్షణ కవచాన్ని బలహీనపర్చేలా చట్టాలున్నాయని, ఐదు దశాబ్దాల అనుభవం ఉన్న న్యాయవాదులకు సైతం అర్థం కావడం లేదని చెప్పారు. వీటి అమలుద్వారా ఈస్ట్ ఇండియా కంపెనీ, బ్రిటీష్ కాలం నాటి పరిస్థితులు పునరావృతమవుతాయన్నారు. ఇప్పటికే కోటిన్నరగా కేసులు దేశవ్యాప్తంగా పెండింగ్‌లో ఉన్నాయని, కొత్త చట్టాలతో మరో కోటి కేసులు పెరిగే ప్రమాదమున్నదని ఆందోళన వ్యక్తంచేశారు. వందల సంఖ్యలో క్రైమ్‌లు పెంచినా ఐపీసీ సరిపోదని పేర్కొన్నారు. సమావేశంలో బీఆర్‌ఎస్వీ రాష్ట్ర అధ్యక్షుడు గెల్లు శ్రీనివాస్‌యాదవ్, బీఆర్‌ఎస్ లీగల్ సెల్ నాయకులు ఎస్ లలితారెడ్డి పాల్గొన్నారు.



హనుమకొండ జిల్లా బీఆర్‌ఎస్ కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతున్న పార్టీ జిల్లా అధ్యక్షుడు దాస్యం. చిత్రంలో మాజీ ఎమ్మెల్యేలు పెద్ది సుదర్శన్‌రెడ్డి, చల్లా ధర్మారెడ్డి

వరంగల్ అభివృద్ధికి నిధులేవి రేవంత్?

- సీఎం పర్యటనతో నగరానికి ఒరిగిందేమీలేదు
- బీఆర్‌ఎస్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు దాస్యం
- రేవంత్‌కు 38 మంది కాంగ్రెస్ ఎమ్మెల్యేల వ్యతిరేకం
- నర్సంపేట మాజీ పెద్ది సుదర్శన్‌రెడ్డి ఆరోపణ

హనుమకొండ, జూన్ 30: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి శనివారం వరంగల్, హనుమకొండ జిల్లాల పర్యటనను చర్చి వరంగల్ నగర అభివృద్ధికి నిధులు ఇవ్వలేదని, ఆయన పర్యటనతో నగరానికి ఒరిగిందేమీ లేదని బీఆర్‌ఎస్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయ్ భాస్కర్ ఎద్దేవా చేశారు. నగర అభివృద్ధికి రూ.6 వేల కోట్లు కావాలని సీఎంను మంత్రులు, ఎమ్మెల్యేలు అడిగితే కనీసం ప్రకటన చేయకుండా వెళ్లిపోయారని విమర్శించారు. ఆదివారం హనుమకొండ బీఆర్‌ఎస్ కార్యాలయంలో మాజీ ఎమ్మెల్యేలు పెద్ది సుదర్శన్‌రెడ్డి, చల్లా ధర్మారెడ్డితో కలిసి ఆయన మీడియా సమావేశంలో మాట్లాడారు. సీఎం రేవంత్‌రెడ్డి చరిత్రాత్మక నగరానికి కేవలం ప్రైవేట్ దవాఖాన ప్రారంభానికే మాత్రమే వచ్చారని, ఆయనకు పేదల వైద్యం మీద ఉన్న శ్రద్ధ పేదల వైద్యం మీద లేదని ఆరోపించారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వంలో కేసీఆర్ విద్య, వైద్యంపై ప్రత్యేక దృష్టి పెట్టి పెద్ద మొత్తంలో నిధులు మంజూరు చేసి.. సర్కారు దవాఖానలను కార్పొరేట్ దవాఖానలకు దీటుగా తీర్చిదిద్ది వైద్యం అందించినట్టు గుర్తుచేశారు.

రేవంత్‌ను వ్యతిరేకిస్తున్న 38 మంది కాంగ్రెస్ ఎమ్మెల్యేలు

రేవంత్‌రెడ్డి పర్యటనను కాంగ్రెస్ పార్టీ శ్రేణులే హర్షించడం లేదని, ఆ పార్టీ ఎమ్మెల్యేలకు సీఎం రేవంత్‌రెడ్డి పనితీరుపై విశ్వాసం తగ్గిందని నర్సంపేట మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి ఆరోపించారు. రేవంత్‌రెడ్డిని 38 మంది కాంగ్రెస్ ఎమ్మెల్యేలు వ్యతిరేకిస్తుండగా కేవలం 26 మంది మాత్రమే బలపరుస్తున్నట్టు తెలిపారు. అధికారంపై సీఎంకు పట్టు లేదని, క్యాబినెట్‌పై విశ్వాసం లేదని చెప్పారు. రేవంత్‌రెడ్డి వరంగల్, హనుమకొండ పర్యటనతో వరంగల్‌కు ప్రయోజనం చేకూరలేదన్నారు. రూ.3 కోట్ల ప్రజాధనం వృథా అయిందని విమర్శించారు. సీఎం రేవంత్‌రెడ్డి హడావిడి చూసి ఢిల్లీ నుంచి నేరుగా వరంగల్‌కు వచ్చే ఏదో జరుగుతుందని అనుకున్నామని, కానీ.. ఆయన వచ్చింది ప్రైవేట్ దవాఖాన ప్రారంభోత్సవానికని తేలిందని మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి మండిపడ్డారు.



కాంగ్రెస్ జెండాలపై రగడ

రెబ్బెన, జూన్ 30: కుమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లా రెబ్బెన మండలంలో పలు అభివృద్ధి పనుల ప్రారంభోత్సవంలో కాంగ్రెస్ పార్టీ జెండాలు కట్టడం, పార్టీ నాయకులతో కూడిన ఫ్లెక్సీలు ఏర్పాటు చేయడంపై రగడ జరిగింది. నంబాలలో నిర్మించిన పల్లె దవాఖాన ప్రారంభోత్సవానికి ముఖ్యఅతిథిగా జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్క హాజరవుతుండగా, ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మి అక్కడికి చేరుకున్నారు. అధికారిక కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జెండాలు, ఫ్లెక్సీలు కనిపించడంతో ఆగ్రహించిన ఎమ్మెల్యే, కలెక్టర్‌తో మాట్లాడి కార్యక్రమంలో పాల్గొనకుండానే వెళ్లిపోయారు. బీఆర్‌ఎస్‌కు చెందిన ఎమ్మెల్యే పట్ల కావాలనే వివక్ష చూపుతున్నారని బీఆర్‌ఎస్ ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు.

కొత్తచట్టాలపై అవగాహన కల్పించాలి

- హైకోర్టు న్యాయమూర్తి, జస్టిస్ సురేందర్ సూచన
- సాంకేతికాంశాలతోనే చట్టాలు : జస్టిస్ మాధవి
- కాలానుగుణంగా చట్టాలు రావాలి: ఎంపీ రఘునందన్‌రావు



కొత్తచట్టాలపై పుస్తకాలను ఆవిష్కరిస్తున్న న్యాయమూర్తులు, ఎంపీ

హైదరాబాద్, జూన్ 30 (నమస్తే తెలంగాణ): జూలై 1 నుంచి అమల్లోకొస్తున్న కొత్త క్రిమినల్ చట్టాలపై ప్రజల్లో విస్తృతంగా అవగాహన కల్పించాలని హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ కే సురేందర్ అభిప్రాయపడ్డారు. భారతీయ న్యాయ సంహిత, భారతీయ నాగరిక్ సురక్ష సంహిత, భారతీయ సాక్ష్య అధినియమ్‌లోని దేశ్యులను, పాత చట్టాల్లో ఉండిన సెక్షన్లను యువ న్యాయవాదులు పూర్తిగా అవగాహన చేసుకోవాలని చెప్పారు. కొత్త క్రిమినల్ చట్టాలపై నారాయణగూడలోని కేశవ్ మెమోరియల్ లా కాలేజీలో ఆదివారం ఏర్పాటు చేసిన వర్క్‌షాపులో ఆయన ప్రసంగించారు. బాధితుల హక్కుల పరిరక్షణ, సమర్థవంతంగా విచారణ నిర్వహణకు కొత్తచట్టాలు ఉపయోగపడుతాయని తెలిపారు. 150 ఏండ్ల నాటి చట్టాలు నేటితో కనుమరుగు కానున్నాయని, సాంకేతిక అంశాలతో కొత్త చట్టాలు రూపకల్పన అభినందనీయమని హైకోర్టు జస్టిస్ మాధవి పేర్కొన్నారు. ఎక్కడ నేరం జరిగితే నిరూపించేందుకు, వాదించేందుకు, తీర్పులు చెప్పేందుకు నిర్ణీత సమయం ఇవ్వాలని, తప్పనిసరిగా ఆ సమయంలో సంబంధిత విభాగం స్పందించాల్సిందేనని చెప్పారు. మెదక్ ఎంపీ రఘునందన్‌రావు మాట్లాడుతూ దేశ పరిస్థితులు, కాలానికి అనుగుణంగా కొత్త చట్టాలు రావాల్సిన అవశ్యకత ఉందని, ఆ నేపథ్యంలోనే ప్రస్తుతం మూడు కొత్త చట్టాలను కేంద్రం తీసుకొచ్చిందని చెప్పారు. పాత చట్టాల్లోని మంచిని స్వీకరిస్తూనే, మన దేశ పరిస్థితులకు అనుగుణంగా కొత్తవి రూపొందించుకోవడం గొప్ప విషయమని తెలిపారు. యువ న్యాయవాదులకు ఉపయోగపడేలా వర్క్‌షాప్ నిర్వహించిన ఫో రం ఫర్ నేషనలిస్ట్ థింకర్స్‌ను అభినందించారు. ఈ సందర్భంగా కొత్త చట్టాలపై రూపొందించిన పుస్తకాలను ఎంపీ ఆవిష్కరించారు. కార్యక్రమంలో హైకోర్టు న్యాయమూర్తి లక్ష్మీనారాయణ, బార్ కౌన్సిల్ ప్రెసిడెంట్ ఏ నర్సింహారెడ్డి, మాజీ ఎమ్మెల్సీ, సీనియర్ అడ్వకేట్ ఎన్ రామచందర్‌రావు, సీనియర్ అడ్వకేట్లు బీ నారాయణరెడ్డి, బీ నర్సింహాశర్మ, జే ప్రభాకర్, ఆశోక్ ఆనంద్‌కుమార్, దీపక్ రెడ్డి రాజేశ్వరం, కేశవ్ లా కాలేజీ ప్రిన్సిపాల్ వాణి, ఓయూ లా కాలేజీ సీనియర్ ప్రొఫెసర్ జీబీ రెడ్డి ప్రసంగించారు.

అసెంబ్లీలో నిలదీస్తం

> మొదటిరోజే తరువాయి...

సమావేశాల్లో నిరుద్యోగుల సమస్యలపై ప్రభుత్వాన్ని నిలదీస్తామని, అసెంబ్లీని స్తంభింపజేస్తామని స్పష్టం చేశారు. మోతీలాల్ ఆమరణ నిరాహార దీక్ష చేస్తున్నా ప్రభుత్వానికి చీమకుట్టినట్టు లేకపోవడం దురదృష్టకరమని పేర్కొన్నారు. దీక్ష విరమించాలని అందరి తరఫున మోతీలాల్‌కు తాము విజ్ఞప్తి చేశామని, కానీ, లక్షలాదిమంది నిరుద్యోగుల జీవితాలతో ఆడుకుంటున్న ప్రభుత్వం దిగి వచ్చే వరకు తన దీక్ష కొనసాగుతుందని ఆయన తమతో చెప్పారని హరీశ్‌రావు వివరించారు. మోతీలాల్‌కు ఆరోగ్యం క్షీణిస్తున్నదని, ఆయనకు హాని జరిగితే ప్రభుత్వమే బాధ్యత వహించాలని హెచ్చరించారు. సీఎం రేవంత్‌రెడ్డి స్వయంగా వచ్చి మోతీలాల్‌నాయక్‌తో మాట్లాడి నిరుద్యోగుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం రెండు లక్షల ఉద్యోగాలను ఇస్తామని ఇచ్చిన మాటను నిలబెట్టుకునే వరకు నిరుద్యోగుల తరఫున బీఆర్‌ఎస్ పోరాడుతుందని తేల్చిచెప్పారు. జాబ్ క్యాలెండర్ విడుదల చేస్తామని రేవంత్‌రెడ్డి, భట్టి విక్రమార్క బాండ్ పేపర్ రాసిచ్చారని, ఇప్పుడు అధికారంలోకి వచ్చాక దానిని ఎందుకు విస్మరించారని హరీశ్‌రావు ప్రశ్నించారు. ఉద్యోగాల కోసం నిరుద్యోగులు ప్రజాభవన్‌కు వెళ్తే దిన్నా రెడ్డి కాళ్ళ పట్టుకోవాల్సిన దుస్థితి ఎందుకొచ్చిందని నిలదీశారు. నిరుద్యోగుల కోసం ఆనాడు ప్రొఫెసర్ కోదండరాం, రియాజ్, బల్మూరి వెంకట్, రేవంత్‌రెడ్డి అశోక్‌నగర్‌లోని కోచింగ్ సెంటర్లకు రాహుల్‌గాంధీని తీసుకొచ్చారని తెలిపారు. తాము అధికారంలోకి వస్తే ఏడాదిలో రెండు లక్షల ఉద్యోగాలను భర్తీ చేస్తామని హామీలు ఇప్పించారని, బస్సు యాత్రలు నిర్వహించారని తెలిపారు. అధికారంలోకి వచ్చి ఏడు నెలలైందని, జాబ్ నోటిఫికేషన్లు ఎందుకు ఇవ్వలేదని ప్రశ్నించారు. నిరుద్యోగులను నాడు రెచ్చగొట్టిన ప్రొఫెసర్ కోదండరాం ఇప్పుడెందుకు మాట్లాడటం లేదని నిలదీశారు. కార్యక్రమంలో ఉప్పల్ ఎమ్మెల్యే బీ లక్ష్మారెడ్డి, ఎమ్మెల్సీ దేశపతి శ్రీనివాస్, బీఆర్‌ఎస్ నాయకులు ఎర్రోళ్ల శ్రీనివాస్, గెల్లు శ్రీనివాస్‌యాదవ్, మఠం భిక్షపతి, మాజీ ఎమ్మెల్యే రవీందర్‌నాయక్, ప్రొఫెసర్ గాలి వినోద్‌కుమార్, బక్కా జడ్సన్, సేవాలాల్ సేన అధ్యక్షుడు సంజీవ్‌నాయక్, బంజారా సేవా సంఘం అధ్యక్షుడు ఇస్లావత్ రాంచందర్‌నాయక్, బీసీ జనసభ అధ్యక్షుడు రాజారాం యాదవ్, నిరుద్యోగ యువకులు పెద్ద ఎత్తున హాజరయ్యారు.



గాంధీ దవాఖానలో మీడియాతో మాట్లాడుతున్న మాజీ మంత్రి హరీశ్‌రావు. చిత్రంలో ఎమ్మెల్సీ దేశపతి శ్రీనివాస్, బీఆర్‌ఎస్వీ నాయకులు ఎర్రోళ్ల శ్రీనివాస్, గెల్లు శ్రీనివాస్, ప్రొఫెసర్ గాలి వినోద్

మోతీలాల్‌కు భారీ మద్దతు

నిరుద్యోగుల పక్షాన ఆమరణ నిరాహార దీక్ష చేస్తున్న ఉస్మానియా విద్యార్థి నేత మోతీలాల్ నాయక్‌కు బీఆర్‌ఎస్ సహా వివిధ పక్షాలు పెద్ద ఎత్తున మద్దతు ఇస్తున్నాయి. ఆదివారం గాంధీ దవాఖానకు వెళ్లిన ఎమ్మెల్యే హరీశ్‌రావు సహా పలువురు నేతలు మోతీలాల్ నాయక్‌ను పరామర్శించి, ఆయన ఆరోగ్య పరిస్థితిని వైద్యుల ద్వారా అడిగి తెలుసుకున్నారు. రాష్ట్రంలోని అన్ని విద్యార్థి, నిరుద్యోగ జేఏసీ, యువజన నేతలు, ఓయూ ప్రొఫెసర్లు నిరుద్యోగుల ఉద్యమానికి మద్దతుగా నిలుస్తున్నారు.

చర్చలు విఫలం

బన్సీలాల్‌పేట్, జూన్ 30: గాంధీ దవాఖానలో ఆమరణ నిరాహార దీక్ష చేస్తున్న నిరుద్యోగ జేఏసీ నాయకుడు మోతీలాల్‌తో ఆదివారం రాత్రి ఎమ్మెల్సీ బల్మూర్ వెంకట్ జరిపిన చర్చలు విఫలమయ్యాయి. తాను సీఎంతో మాట్లాడి నిరుద్యోగుల సమస్యలను పరిష్కరిస్తానని చెప్పినప్పటికీ మోతీలాల్ ససేమిరా అన్నారు. సీఎం స్పష్టమైన హామీ ఇస్తేనే దీక్ష విరమిస్తానని తేల్చి చెప్పడంతో వెంకట్ వెనుదిరిగారు. నిరుద్యోగులు ప్రధానద్వారం వద్ద బల్మూరిని ఘెరావ్ చేసేందుకు సిద్ధంగా ఉండటంతో పోలీసులు అతనిని వెనుక గేట్ నుంచి మరో వాహనంలో పంపించారు. మోతీలాల్‌ను కలవడానికి వచ్చిన నేతలు రియాజ్, మానవతారాయ్, చెరిగొండ వెంకటేశ్, వరిగాని దయాకర్, బాలలక్ష్మి, నిజాన రమేశ్ తదితరులనూ నిరుద్యోగులు అడ్డుకుని ప్రభుత్వం చేశారు. పోలీసులు నిరుద్యోగులను శాంతింపజేసి నేతలను లోపలికి పంపించారు. తక్షణమే నిరుద్యోగులతో సీఎం రేవంత్‌రెడ్డి చర్చలకు పిలువాలని విద్యార్థి నేతలు డిమాండ్ చేశారు. సీఎంతో చర్చించడానికి ప్రయత్నిస్తామని నేతలు వారికి హామీ ఇచ్చారు.

రాహుల్.. 2 లక్షల ఉద్యోగాలేవీ?

- జాబ్ క్యాలెండర్ ఎక్కడ?
- బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కే తారకరామారావు ప్రశ్న



హైదరాబాద్, జూన్ 30 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో రెండు లక్షల ఉద్యోగాలు భర్తీ చేస్తామన్న హామీ ఏమైందని బీఆర్‌ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కే తారకరామారావు కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీని ప్రశ్నించారు. ఎన్నికలకు ముందు రాహుల్‌గాంధీ స్వయంగా యువతకు, నిరుద్యోగులను కలిసి రెండు లక్షల ప్రభుత్వ ఉద్యోగాలను మొదటి ఏడాదిలోనే భర్తీ చేస్తామని హామీ ఇచ్చారని ఎక్స్‌వేదికగా కేటీఆర్ గుర్తుచేశారు. అన్ని ప్రధాన పత్రికల్లో పెద్ద ఎత్తున జాబ్ క్యాలెండర్ పేరుతో ప్రకటనలు సైతం విడుదల చేశారని పేర్కొన్నారు. జాబ్‌క్యాలెండర్, ఉద్యోగాల భర్తీని తేదీలతో సహా కాంగ్రెస్ పార్టీ ప్రకటించిందని గుర్తుచేశారు. ఇప్పటికే 7 నెలల సమయం గడిచిపోయిందని, కానీ ఒక్క కొత్త ప్రభుత్వ ఉద్యోగ నోటిఫికేషన్ కూడా జారీ కాలేదని విమర్శించారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ముందు హామీ ఇచ్చిన 10 నోటిఫికేషన్ తేదీల గడువు ముగిసిపోయిందని పేర్కొన్నారు. మిగిలిన ఐదు నెలల కాలంలో రెండు లక్షల ప్రభుత్వ ఉద్యోగాల భర్తీకి నోటిఫికేషన్లు ఏవిధంగా జారీ చేస్తారని ప్రశ్నించారు. కాంగ్రెస్ తరఫున ఎన్నికైన నాయకులు, రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగాల భర్తీ విషయంలో బాధ్యత తీసుకొని స్పందించకపోవడం వల్లనే రాహుల్‌గాంధీని ప్రశ్నిస్తున్నానని తెలిపారు. రాహుల్‌గాంధీ అయినా తక్షణం స్పందించాలని డిమాండ్ చేశారు.

సీఎస్ శెట్టికి కేటీఆర్ శుభాకాంక్షలు

స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్బీఐ) నూతన చైర్మన్‌గా నియామకం కానున్న తెలంగాణ బిడ్డ చల్లా శ్రీనివాసులు శెట్టికి బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కే తారకరామారావు ఆదివారం ఎక్స్ వేదిక హార్దిక శుభాకాంక్షలు తెలియజేశారు. తెలంగాణలోని జోగులాంబ గద్వాల జిల్లా మానవపాడు మండలం పెద్ద పోతులపాడు సీఎస్ శెట్టి స్వగ్రామం. ఎనిమిది నుంచి ఇంటర్ వరకు గద్వాలలో పూర్తిచేశారు.

25 వేల టీచర్ పోస్టులు భర్తీచేయాలి

- ఎంపీ, బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఆర్ కృష్ణయ్య



ముషీరాబాద్, జూన్ 30: నిరుద్యోగులకు ఇచ్చిన హామీలను అమలు చేయకుంటే ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని ఎంపీ, బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్ కృష్ణయ్య రాష్ట్ర ప్రభుత్వాన్ని హెచ్చరించారు. 25 వేల టీచర్ పోస్టులను ఒకే దఫాలో భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. ఇందిరాపార్కు వద్ద ఆదివారం నిరుద్యోగులు చేపట్టిన ధర్నాలో ఆర్ కృష్ణయ్య ప్రసంగించారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు రెండు లక్షల ఉద్యోగాలను భర్తీ చేయాల్సిందేనని డిమాండ్ చేశారు. టీఆర్‌టీ రాసిన వారే నాలుగు లక్షల మందికిపైగా ఉంటే స్కూల్ అసిస్టెంట్ పోస్టులు 2,200 నోటిఫికేషన్‌లో పేర్కొన్నారని తెలిపారు. ఎయిడెడ్ పాఠశాలల్లో ఖాళీగా ఉన్న 4 వేల పోస్టులను భర్తీ చేయాలని కోరారు. కార్యక్రమంలో బీసీ సంఘం నాయకులు నీల వెంకటేశ్, పవన్, సంగేశ్, అనంతయ్య, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలి : జాజుల

హైదరాబాద్, జూన్ 30 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో బీసీ విద్యార్థులకు సుమారు రూ.5వేల కోట్లకు పైగా ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు రావాల్సి ఉందని, ఆ నిధులను ప్రభుత్వం సత్వరమే విడుదల చేయాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్ కోరారు. ఈ మేరకు ఆదివారం సీఎం రేవంత్‌రెడ్డికి ఆయన ఒక లేఖ రాశారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల చేయకపోవడంతో లక్షల మంది విద్యార్థుల ఉన్నత చదువులు అగమ్యగోచరంగా మారాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో సీఎం విద్యార్థుల ఉన్నత చదువులకు భరోసా కల్పించాలని, బకాయిలను విడుదల చేయాలని విజ్ఞప్తి చేశారు. ఎన్నికల మ్యానిఫెస్టో ప్రకారం ర్యాంకుతో నిమిత్తం లేకుండా బీసీ విద్యార్థులకు పూర్తి రీయింబర్స్‌మెంట్‌ను అమలు చేయాలని కోరారు.

మాజీ సర్పంచ్‌లకు బిల్లులు ఇవ్వకుంటే ఉద్యమం

- 1,200 కోట్ల బకాయిలు రావాలి
- అప్పులు తెచ్చి పనులు చేసినం
- కట్టలేక కొందరు ఆత్మహత్యలు
- ప్రభుత్వానికి ఎన్నో వినతులు
- స్పందన లేక గవర్నర్‌ను కలిసినం
- సర్పంచ్‌ల సంఘం ప్రతినిధులు

హైదరాబాద్, జూన్ 30 (నమస్తే తెలంగాణ): అప్పులు చేసి గ్రామాల్లో అభివృద్ధి పనులు చేశామని, ఆ బిల్లులను ప్రభుత్వం వెంటనే చెల్లించాలని సర్పంచ్‌ల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జే లక్ష్మీనరసింహారెడ్డి, సర్పంచ్‌ల జేఏసీ అధ్యక్షుడు సుర్వి యాదయ్యగౌడ్, ఉపాధ్యక్షులు మధుసూదన్‌రెడ్డి, నెమలి సుభాష్ డిమాండ్ చేశారు. కాంగ్రెస్ సర్కారు స్పందించడం లేదని శనివారం హైదరాబాద్‌లో గవర్నర్ రాధాకృష్ణన్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. అనంతరం రాజ్‌భవన్ వద్ద మీడియాతో మాట్లాడుతూ 2019-24లో సర్పంచ్‌లుగా ఉండి గ్రామాల్లో వీధిలైట్ల నిర్వహణ, మురుగు కాలువల నిర్మాణం, పల్లె ప్రకృతి వనాలు, రైతు వేదికలు, వైకుంఠధామాలు, మనఊరు-మనబడి, పల్లెప్రగతి, మిషన్ భగీరథ వంటి అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టి, తెలంగాణ పంచాయతీలను దేశానికే ఆదర్శంగా తీర్చిదిద్దామని గుర్తుచేశారు. తమ పదవీకాలం ముగిసి ఐదు నెలలు కావస్తున్నా పెండింగ్ బిల్లులు అందక 12,769 పంచాయతీల తాజా మాజీ సర్పంచ్‌లు తీవ్ర ఆర్థికఇబ్బందులు ఎదుర్కొంటున్నారని చెప్పారు. బిల్లులు అందక, అప్పులు చెల్లించలేక పలువురు ఆత్మహత్య చేసుకున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. బిల్లులపై సీఎం రేవంత్‌రెడ్డి, పంచాయతీరాజ్‌శాఖ మంత్రి, ఉన్నతాధికారులకు వినతిపత్రాలు ఇచ్చామని, స్పందన రాకపోవడంతో గవర్నర్‌కు వినతిపత్రం ఇచ్చామని తెలిపారు. పెండింగ్ బిల్లులు చెల్లించాలని రాష్ట్ర ప్రభుత్వానికి సిఫారసు చేస్తామని గవర్నర్ హామీ ఇవ్వడం సంతోషంగా ఉన్నదని చెప్పారు. రాష్ట్రవ్యాప్తంగా రూ.1,200 కోట్లు పెండింగ్‌లో ఉన్నాయని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చి ఆరునెలలైనా బిల్లులు ఇవ్వడం లేదని వాపోయారు. పెండింగ్ బిల్లులు తక్షణమే ప్రభుత్వం ఇవ్వకుంటే రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర సర్పంచ్‌ల సంఘాల నేతలు సముద్రాల రమేశ్, ఆరుట్ల లక్ష్మీప్రసాద్‌రెడ్డి, రాజేందర్, గణేశ్ తదితరులు పాల్గొన్నారు.

30 లక్షల బకాయి



మా పంచాయతీకి 30 లక్షల బిల్లులు రావాలి. అప్పులు తెచ్చి అభివృద్ధి చేసినం. మా పంచాయతీకి కేంద్ర అవార్డు వచ్చింది. మా పదవీకాలం ముగిసినా బిల్లులు రావడంలేదు.

-లక్ష్మీప్రసాద్‌రెడ్డి, కొలనుపాక మాజీ సర్పంచ్, భువనగిరి జిల్లా

నెల ఖర్చు 11 లక్షలు



మాది మేజర్ పంచాయతీ. నిర్వహణకు నెలకు 11 లక్షలు ఖర్చవుతుంది. తొలుత చెక్ పవర్ లేనప్పుడు పంచాయతీ సిబ్బంది వేతనాలను కూడా జేబుల్లోంచి ఇచ్చినం. కొత్త ప్రభుత్వం వచ్చాక బకాయిలు ఇవ్వలేదు. నిధులు రాక ప్రత్యేకాధికారులు బిల్లు కూడా వేయలేకపోతున్నరు.

-రాజేందర్, ముథోల్ మాజీ సర్పంచ్, నిర్మల్ జిల్లా

బిల్లులు ఇచ్చే ఎన్నికలకు..



మా బాధలను రేవంత్‌రెడ్డి ప్రభుత్వం అర్థంచేసుకోవాలి. పెండింగ్ బిల్లులు చెల్లించిన తర్వాతే ఎన్నికలకు వెళ్లాలి. లేదంటే కొత్త సర్పంచ్‌లతో మాకు ఇబ్బందులు వస్తయ్. బకాయిలు ఇవ్వకుండా ఎన్నికలకు వెళ్తే ఆందోళన చేస్తం.

-నెమలి సుభాష్, ఇబ్రహీంనగర్ మాజీ సర్పంచ్, సిద్దిపేట జిల్లా

రూపాయి ఇవ్వలే..



మా పాలనలో అప్పు చేసి అభివృద్ధి పనులు చేసినం. మా పంచాయతీకి రూ.30 లక్షల బిల్లులు రావాలి. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చి ఆరునెలలవుతున్నా పంచాయతీలకు రూపాయి కూడా ఇవ్వలేదు.

-సముద్రాల రమేశ్, ఐన్వంపల్లి మాజీ సర్పంచ్, పెద్దపల్లి జిల్లా

7న ఎమ్మార్పీఎస్ నిరసన దీక్ష

- మాదిగలకు కేంద్రం తీరని అన్యాయం
- పార్లమెంట్‌లో వర్గీకరణ బిల్లు పెట్టాలి
- ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు వంగపల్లి



ముషీరాబాద్, జూన్ 30: ఎస్సీ వర్గీకరణ విషయంలో కేంద్రం జాప్యం చేయడాన్ని వ్యతిరేకిస్తూ ఈ నెల 7న ఇందిరాపార్కు వద్ద నిరసన దీక్ష చేపట్టనున్నట్టు ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు వంగపల్లి శ్రీనివాస్ మాదిగ తెలిపారు. ఎస్సీ వర్గీకరణ అంశాన్ని పరిష్కరించకుండా కేంద్రప్రభుత్వం మాదిగలకు తీరని అన్యాయం చేస్తున్నదని మండిపడ్డారు. ఆదివారం హైదరాబాద్ విద్యానగర్‌లోని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కార్యాలయంలో నిరసన దీక్షకు సంబంధించిన వాల్ పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించారు. అనంతరం వంగపల్లి శ్రీనివాస్ మాట్లాడుతూ.. గత మూడు దశాబ్దాలుగా బీజేపీ, కాంగ్రెస్‌లు వర్గీకరణ అంశాన్ని తేల్చకుండా మాదిగలను నిర్లక్ష్యం చేస్తున్నాయని ఆగ్రహం వ్యక్తంచేశారు. అన్ని పక్షాల మద్దతు, పలు కమిటీల నివేదికలు వర్గీకరణకు అనుకూలంగా ఉన్నా కేంద్రం పట్టించుకోకపోవడం శోచనీయమని పేర్కొన్నారు. కాంగ్రెస్, బీజేపీల మోసపూరిత వాగ్దానాలను నమ్మి గత మూడు దశాబ్దాలుగా మాదిగలు మోసపోతూనే ఉన్నారని తెలిపారు. ఇటీవల ఎన్నికల సభలో తాను మాదిగల పెద్దన్ననని చెప్పిన ప్రధాని మోదీ ప్రస్తుత పార్లమెంటు సమావేశాల్లో వర్గీకరణ బిల్లు పెట్టి తన చిత్తశుద్ధిని నిరూపించుకోవాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ కూడా ఎస్సీ వర్గీకరణ బిల్లుకోసం కేంద్రంపై ఒత్తిడి పెంచాలని కోరారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు పొట్టిమంజర రమేశ్, లింగమూర్తి గణేశ్, హరిశ్చంద్ర, చిన్న స్వామి, సారంగం, శ్రీనివాస్, యాదగిరి, మేడి మహేశ్ తదితరులు పాల్గొన్నారు.

మోతీలాల్‌కు ఏమైనా సర్కారుదే బాధ్యత

- బీఆర్‌ఎస్వీ నేత తుంగ బాలు

హైదరాబాద్, జూన్ 30 (నమస్తే తెలంగాణ): గాంధీ దవాఖానలో నిరాహార దీక్ష చేస్తున్న మోతీలాల్ ప్రాణానికి హాని జరిగితే ప్రభుత్వమే బాధ్యత వహించాలని బీఆర్‌ఎస్వీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు తుంగ బాలు ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. నిరుద్యోగుల న్యాయమైన డిమాండ్ల కోసం ఆయన చేస్తున్న దీక్షతో సీఎం రేవంత్‌రెడ్డి ఇప్పటికైనా కండ్లు తెరవాలని స్పష్టం చేశారు. వారం రోజులుగా దీక్షలో ఉన్న మోతీలాల్ ఆరోగ్య పరిస్థితి రోజురోజుకూ విషమిస్తున్నదని ఆందోళన వ్యక్తం చేశారు. మెరుగైన వైద్య సదుపాయం కల్పించాలని డిమాండ్ చేశారు. ఉపాధ్యాయుల పదోన్నతులతో ఏర్పాటైన ఖాళీలను ఆ నోటిఫికేషన్లో కలిపి మెగా డీఎస్సీగా మార్చాలన్నారు. ఇప్పటికైనా నిరుద్యోగుల డిమాండ్లను నెరవేర్చాలని, లేనిపక్షంలో భవిష్యత్తు పరిణామాలకు ప్రభుత్వమే బాధ్యత వహించాలని హెచ్చరించారు.

ప్రైవేటుకు ఢిల్లీ తెలంగాణ టవర్!

- 24 అంతస్తుల నిర్మాణానికి 500 కోట్ల ఖర్చు
- ప్రైవేటు డెవలపర్‌కు అప్పగింత?
- స్టార్ హోటళ్లతో సంప్రదింపులు

హైదరాబాద్, జూన్ 30 (నమస్తే తెలంగాణ): ఢిల్లీలో కొత్తగా నిర్మించనున్న తెలంగాణ భవన్‌ను 'ప్రైవేటు'కు అప్పగించాలని రాష్ట్ర ప్రభుత్వం యోచిస్తున్నట్టు తెలిసింది. ఢిల్లీలో బహుళ అంతస్తులతో నిర్మించనున్న తెలంగాణ భవన్‌లో వాణిజ్య కార్యకలాపాలను అనుమతించాలని ఆలోచిస్తున్నట్టు సమాచారం. రాష్ట్ర ప్రభుత్వ ఆర్థిక పరిస్థితి దృష్ట్యా నిర్మాణం, నిర్వహణ బాధ్యతలను ఓ ప్రైవేటు డెవలపర్‌కు అప్పగించాలని భావిస్తున్నట్టు ఉన్నత స్థాయివర్గాల ద్వారా తెలిసింది. రాష్ట్ర అవసరాలకు కావాల్సినన్ని గదులు రాష్ట్రానికి ఇచ్చి మిగిలిన వాటిల్లో వాణిజ్య కార్యకలాపాలు నిర్వహించుకునేలా అనుమతించాలని నిర్ణయించినట్టు సమాచారం. ఇందులో భాగంగా స్టార్ హోటళ్లతో సంప్రదింపులు జరుపుతున్నట్టు అధికారవర్గాలు తెలిపాయి. ఇదే జరిగితే ఎంతో ప్రతిష్ఠాత్మకంగా ఉండాల్సిన తెలంగాణ భవన్ ఏదో ఒక స్టార్ హోటల్ పేరుతో పిలువబడే పరిస్థితి ఏర్పడుతుందని పలువురు విమర్శిస్తున్నారు.

తెలంగాణ టవర్‌కు 500 కోట్లు ఖర్చు

ఢిల్లీలోని ఆంధ్రప్రదేశ్ భవన్‌ను ఏపీ, తెలంగాణల మధ్య గత మార్చిలో విభజించారు. మొత్తం 19.781 ఎకరాల విస్తీర్ణంలో ఏపీకి 11.536 ఎకరాలు, తెలంగాణకు 8.245 ఎకరాలు సమకూరాయి. ఈ మొత్తం ఆస్తి విలువ రూ.9,913.505 కోట్లుగా కేంద్ర హోంశాఖ ప్రకటించింది. తెలంగాణకు వచ్చిన వాటాకు వచ్చిన మూడెకరాల్లో శబరి బ్లాక్ ఉండగా, 5.245 ఎకరాల్లో పటౌడీ హౌస్ ఉంది. శబరి బ్లాక్ ఉన్న ప్రాంతంలో గవర్నర్, ముఖ్యమంత్రి, రాష్ట్ర క్యాబినెట్ మంత్రులకు విడివిడిగా బ్లాకులు నిర్మించాలని, మిగిలిన 5.245ఎకరాల్లో రాష్ట్ర ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఇతర నాయకులు, అధికారులు వెళ్లిన ప్పుడు ఉండేలా గదులు నిర్మించాలని రాష్ట్ర ప్రభుత్వం ప్రతిపాదిస్తున్నది. టౌన్‌ప్లానింగ్ నిబంధనల ప్రకారం ఇక్కడ బహుళ అంతస్తుల నిర్మించుకునే అవకాశం ఉంది. ఇప్పటికే ఆర్‌అండ్‌బీ అధికారులు రెండు-మూడు నమూనాలను రూపొందించారు. 24 అంతస్తులతో తెలంగాణ టవర్‌ను నిర్మించనున్నట్టు ఇటీవల రాష్ట్ర ఆర్‌అండ్‌బీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి ప్రకటించారు. అయితే ఈ భవనాల నిర్మాణానికి దాదాపు రూ. 500 కోట్లకుపైగా ఖర్చవుతుందని అంచనా.



ఢిల్లీలో తెలంగాణ భవన్ మ్యాపును పరిశీలిస్తున్న మంత్రి కోమటిరెడ్డి (ఫైల్)

ప్రైవేట్ డెవలపర్‌కు అప్పగింత?

ప్రస్తుతం రాష్ట్ర ఆర్థిక పరిస్థితి సరిగా లేకపోవడంతో ప్రైవేటు డెవలపర్ ద్వారా తెలంగాణ టవర్‌ను నిర్మించే అంశాన్ని పరిశీలించాలని ప్రభుత్వం ఓ నిర్ణయానికి వచ్చినట్టు సమాచారం. రాష్ట్ర అవసరాలకు ఎల్లప్పుడూ కనీసం 100 గదులను అందుబాటులో ఉంచి మిగిలిన అంతస్తుల్లో గదులను వాణిజ్య అవసరాలకు ఉపయోగించుకునేలా అనుమతించాలని నిర్ణయించినట్టు సమాచారం. దీని నిర్మాణానికి సంబంధించి రాష్ట్రానికి చెందిన ప్రతినిధులు ఇప్పటికే ఒకటి రెండు స్టార్ హోటళ్ల ప్రతినిధులతో సంప్రదింపులు జరిపినట్టు తెలిసింది. రాష్ట్ర అవసరాలకు కావాల్సిన గదులు, వాణిజ్యానికి ఉపయోగించుకునే గదులను విడివిడి బ్లాకులో నిర్మించాలా, లేక మొత్తం ఒకే టవర్‌ను నిర్మించి అందులోనే వేర్వేరు ప్రవేశాలు ఇవ్వాలా అనేది ఇంకా తేలలేదు.



ప్రెస్‌క్లబ్‌లో జ్ఞాపికలతో నమస్తే తెలంగాణ కార్టూనిస్టు మృత్యుంజయ, శంకర్ తదితరులు

సాంకేతికతతో సృజనాత్మకత తగ్గదు

- కార్టూనిస్టులు టెక్నాలజీని అందిపుచ్చుకోవాలి
- నమస్తే తెలంగాణ కార్టూనిస్టు మృత్యుంజయ


ఖైరతాబాద్, జూన్ 30: 'సంప్రదాయ కార్టూనిస్టు ఓ కాగితం మీద బొమ్మగీసి ప్రచురణకు పంపించే వారు.. ఇది గంటల సమయం పట్టేది.. ఇప్పుడు పదిహేను నిమిషాల్లోనే కార్టూన్లు గీయవచ్చు' అని నమస్తే తెలంగాణ కార్టూనిస్టు మృత్యుంజయ అన్నారు. హైదరాబాద్ ప్రెస్‌క్లబ్ సౌజన్యంతో సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో తెలుగు కార్టూనిస్ట్స్ మెగా వర్క్‌షాప్‌ను ప్రముఖ కార్టూనిస్టులు హరికృష్ణ, రాజశేఖర్ ఆధ్వర్యంలో జరిగింది. ఈ కార్యక్రమంలో మృత్యుంజయ మాట్లాడుతూ ఒకప్పుడు పొలిటికల్ కార్టూన్ పాఠకులకు వెళ్లాలంటే రెండు రోజులు పట్టేదని, నేడు వార్తలతో పాటు ఉత్తమమైన, సృజనాత్మకమైన కార్టూన్లనూ పాఠకులకు అందించవచ్చని అన్నారు. 2018లోనే ఫొటోషాప్‌లో కార్టూన్లు గీయడంపై తాను బెంగళూరులోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ కార్టూనిస్టు వర్క్‌షాప్‌లో డెమో ఇచ్చినట్టు గుర్తు చేశారు. ఐప్యాడ్‌లో ప్రొక్రియేట్ యాప్‌ను ఇన్‌స్టాల్ చేసుకుని డిజిటల్ కార్టూన్లు వేయవచ్చని చెప్పారు. టెక్నాలజీని అందిపుచ్చుకోవడం వల్ల వార్తలతో సమానంగా కార్టూన్లు పాఠకులకు చేర్చవచ్చని తెలిపారు. ప్రొఫెషనల్ ఆర్టిస్ట్ ఓ సెటప్ అవసరమని, కూర్చొని బొమ్మగీస్తారని, ఐప్యాడ్ వచ్చిన తర్వాత ఎక్కడైనా బొమ్మలు గీసి పంపించే వెసులుబాటు కలిగిందని చెప్పారు. కార్టూన్ల విషయంలో సాంకేతికత అనేది ఒక టూల్ టెక్నిక్ మాత్రమేనని, ఇందులో కార్టూనిస్టు సృజనాత్మకత ఏ మాత్రం తగ్గదని పేర్కొన్నారు. టెక్నికల్, ప్రొఫెషనల్ ఆర్ట్ మీద 80 మంది ఇంటర్నేషనల్ కార్టూనిస్టులను ఇంటర్వ్యూలు చేసి పుస్తకాన్ని తెచ్చే ప్రయత్నంలో ఉన్నానని తెలిపారు. ఇప్పటికే 40 వ్యాసాలు నమస్తే తెలంగాణలో అచ్చయ్యాయని, మరో 40 వ్యాసాలు రాసి పుస్తకాన్ని తీసుకువస్తానని తెలిపారు. అనంతరం ప్రొక్రియేట్ ద్వారా పొలిటికల్ కార్టూన్స్, అదే పొలిటికల్ కార్టూన్ యానిమేషన్ డెమో ప్రదర్శించారు. దక్కన్ క్రానికల్ కార్టూనిస్టు సుభాని సొహైల్, పొలిటికల్ కార్టూన్ల అంశంపై మాట్లాడారు. కార్టూనిస్టు వాటర్, పోస్టర్ కలర్స్‌తో పెయింటింగ్, డిష్ చూపించడం ఎలా అంశంపై కార్టూనిస్టు టేపీ, కార్టూన్ సిండికేషన్, ఉపయోగం, పరిధి విధానంపై కార్టూనిస్టు నర్సిం, కార్టూన్‌కు బొమ్మ లేక కాన్సెప్ట్ ముఖ్యమా, సైలెంట్ కార్టూన్ తదితర అంశాలపై కార్టూనిస్టు సురేంద్ర, క్యారికేచర్‌పై సాక్షి కార్టూనిస్టు శంకర్, యూత్ కార్టూన్స్‌పై కార్టూనిస్టు శంకు వివరించారు. అనంతరం ప్రముఖ యోగా ట్రైనర్ ఏ సంగీత అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా నిర్వహించిన కార్టూన్ పోటీల్లో గెలుపొందిన వారికి బహుమతులను అందజేశారు. ఈ సందర్భంగా యోగాకు సంబంధించిన కార్టూన్ల ప్రదర్శన ఏర్పాటు చేశారు.

తెలంగాణ పరిశ్రమలపై ఏపీ నజర్!

- విదేశీ పెట్టుబడులను మళ్లించుకొనే ఎత్తులు
- ఇంకా గ్రౌండ్ కాని కంపెనీలపై కన్నేసిన నేతలు
- విస్తరణ యోచనలో ఉన్న పరిశ్రమలకూ గాలం
- కంపెనీ వర్గాలతో ప్రముఖ ఏపీ మంత్రి సంప్రదింపులు
- తెలంగాణ కన్నా అధిక రాయితీలిస్తామని ఎర

హైదరాబాద్, జూన్ 30 (నమస్తే తెలంగాణ): ఏపీలో కొత్తగా ఏర్పడిన ప్రభుత్వం తెలంగాణలో పెట్టుబడులు పెడుతున్న పరిశ్రమలపై కన్నేసినట్టు తెలుస్తున్నది. తెలంగాణతో ఒప్పందాలు చేసుకొని ఇంకా పనులు ప్రారంభించని కంపెనీలు, విస్తరణ బాటలో ఉన్న పరిశ్రమలను తమవైపునకు తిప్పుకొనేందుకు పొరుగు రాష్ట్రం తీవ్రంగా కృషి చేస్తున్నట్టు పరిశ్రమ వర్గాలు పేర్కొంటున్నాయి. ఈ ప్రక్రియలో ఆ రాష్ట్రానికి చెందిన ఓ ప్రముఖ మంత్రి ఆయా పరిశ్రమ వర్గాలను సంప్రదిస్తున్నట్టు వెల్లడించాయి. తెలంగాణ ఆఫర్ చేస్తున్న రాయితీలకన్నా తాము అధికంగా ఇస్తామని పెట్టుబడులను తమవైపు తిప్పుకునేందుకు వారు ప్రయత్నిస్తున్నట్టు చెప్తున్నారు.

డిపార్ట్‌మెంట్ ఫర్ ది ప్రమోషన్ ఆఫ్ ఇండస్ట్రీ అండ్ ఇంటర్నల్ ట్రేడ్ (డీపీఐఐటీ) నివేదిక ప్రకారం 2024 ఆర్థిక సంవత్సరంలో ప్రస్తుతం మూడు బిలియన్ డాలర్ల ప్రత్యక్ష విదేశీ పెట్టుబడుల(ఎఫ్‌డీఐ)తో తెలంగాణ రాష్ట్రం గుజరాత్ తరువాత రెండో స్థానంలో నిలిచింది. 2023 ఆర్థిక సంవత్సరంలో 1.3 బిలియన్ డాలర్ల ఎఫ్‌డీఐలు రాగా, ఈసారి అంతకు రెట్టింపు పెట్టుబడులు వచ్చాయి. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో టీఎస్ ఐ-పాస్ విధానం ద్వారా 2014-23 మధ్య రూ. 2,60,028 కోట్ల విలువైన పెట్టుబడికి సంబంధించిన ఒప్పందాలు జరిగినట్టు, తద్వారా 17.54 లక్షల ఉద్యోగావకాశాలు లభించినట్టు 2023 ప్రభుత్వ ప్రగతి నివేదికలో వెల్లడించారు. ఈ ఏడాది జనవరిలో దావోస్‌లో జరిగిన ప్రపంచ ఆర్థిక సదస్సు (డబ్ల్యూఈఎఫ్)లో దాదాపు 45 వేల కోట్ల పెట్టుబడులకు సంబంధించిన ఒప్పందాలు జరిగాయి. రాష్ట్రానికి వచ్చిన పెట్టుబడుల్లో ఎక్కువగా ఐటీ, ఫార్మా రంగానికి చెందినవే ఉన్నాయి. ఇందులో కొన్ని కొత్త కంపెనీలు కాగా, మరికొన్ని ఇప్పటికే ఉన్న కంపెనీలు.. తమ విస్తరణ ప్రణాళికలను అమలు చేయాలని నిర్ణయించాయి. సహజంగా కంపెనీ పెట్టుబడి పెట్టే ముందు ఆర్థిక అంశాలతోపాటు ఇతరత్రా అనేక అంశాలను ఒకటికి రెండుసార్లు పరిశీలిస్తాయని అధికారులు చెబుతున్నారు. ముఖ్యంగా రాయితీలు, ఇతరత్రా ప్రోత్సాహకాల విషయంలో ప్రభుత్వంతో బేరసారాలు సాగించడం కంపెనీలకు అలవాటని, ఒక ప్రభుత్వంతో ఒప్పందం చేసుకున్నాక కూడా ఇతర రాష్ట్రాలు, ఇతర ప్రాంతాల్లో అవకాశాలను పరిశీలిస్తాయని వారు పేర్కొంటున్నారు. ఈ క్రమంలోనే మన రాష్ట్ర ప్రభుత్వంతో ఒప్పందం చేసుకున్న కంపెనీల్లో చాలా వరకు కంపెనీలు ఇంకా గ్రౌండ్ కావాల్సిఉందన్నారు. అయితే, ఒప్పందం చేసుకొని ఇంకా పనులు చేపట్టని కంపెనీల వివరాలను వెల్లడించేందుకు అధికారులు నిరాకరిస్తున్నారు.



కంపెనీల ప్రతినిధులతో చర్చలు

ఆంధ్రప్రదేశ్‌లో తెలుగుదేశం ప్రభుత్వం ఏర్పాటయ్యాక ప్రధానంగా ఐటీ, పారిశ్రామిక రంగంపై దృష్టి కేంద్రీకరించింది. వ్యవసాయం తరువాత పారిశ్రామికరంగంలోనే అత్యధికంగా ఉపాధి అవకాశాలు లభించే అవకాశం ఉండటంతో సాధ్యమైనన్ని ఎక్కువ కంపెనీలను తమ రాష్ట్రంలో ఏర్పాటు చేయించాలని అక్కడి ప్రభుత్వం పట్టుదలతో ఉంది. ఇందులో భాగంగా ప్రపంచ ప్రఖ్యాత కంపెనీలను ఆకర్షించే పని ప్రారంభించింది. ఈ ప్రక్రియలోనే తెలంగాణతో ఒప్పందం చేసుకున్న ఓ బడా కంపెనీ ప్రతినిధులతో ఏపీకి చెందిన ఓ ప్రముఖ మంత్రి చర్చలు జరిపినట్టు పరిశ్రమ వర్గాలు తెలిపాయి. సులభతర అనుమతులు ఇవ్వడమే కాకుండా తెలంగాణ ప్రభుత్వం ఇస్తున్న రాయితీలకన్నా ఎక్కువ రాయితీలు ఇచ్చేందుకు తాము సిద్ధంగా ఉన్నామని ఆఫర్ ఇచ్చినట్టు తెలిసింది.

కియాను చూపుతూ..

ఏపీలో ప్రముఖ కార్ల తయారీ సంస్థ కియా మోటర్స్ కార్పొరేషన్ తెలుగుదేశం హయాంలోనే తమ పరిశ్రమను నెలకొల్పింది. దక్షిణ కొరియాకు చెందిన కియా మోటర్స్ అదే దేశానికి చెందిన హ్యుందాయ్ మోటర్ కంపెనీకి అనుబంధ కంపెనీ. హ్యుందాయ్ కంపెనీ తెలంగాణలో టెస్టింగ్ ట్రాక్‌ను నిర్మిస్తున్నది. ప్రస్తుతం హ్యుందాయ్ కంపెనీ పెట్టుబడిపై ఎటువంటి అనుమానాలు లేనప్పటికీ ఇతర కంపెనీలు మన రాష్ట్రానికి రావాల్సినవి పొరుగు రాష్ట్రంతో కూడా చర్చలు జరుపుతున్నాయని అధికారులు చెబుతున్నారు. తెలంగాణలో ఇప్పటికే కార్యకలాపాలు సాగిస్తూ సమీప భవిష్యత్తులో విస్తరించాలని భావిస్తున్న కంపెనీలను తమ రాష్ట్రానికి రప్పించుకునేలా ఏపీ కృషి చేస్తున్నదని పేర్కొంటున్నారు. హైదరాబాద్‌కు ఇప్పటికే అంతర్జాతీయ స్థాయి వచ్చినప్పటికీ భారత్‌లో పెట్టుబడి పెట్టేందుకు వచ్చే విదేశీ కంపెనీలు ఇక్కడ లభించే సౌకర్యాలు, ప్రోత్సాహకాల ఆధారంగానే నిర్ణయం తీసుకుంటున్నాయి. రానున్న రోజుల్లో మన రాష్ట్రానికి ఏపీతో పోటీ ఏర్పడే అవకాశం ఉందని చెప్పవచ్చు.

దివ్యాంగుల సమస్యలు పరిష్కరించాలి

గవర్నర్‌కు అఖిల భారత దివ్యాంగుల హక్కుల వేదిక వినతి

హైదరాబాద్, జూన్ 30 (నమస్తే తెలంగాణ): దివ్యాంగుల సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేయాలని అఖిల భారత వికలాంగుల హక్కుల వేదిక జాతీయ అధ్యక్షుడు కొల్లి నాగేశ్వరరావు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు ఆదివారం గవర్నర్ సీపీ రాధాకృష్ణన్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. దివ్యాంగుల పెన్షన్ పెంపు, బ్యాక్‌లాగ్ ఉద్యోగాల భర్తీ, ప్రతి దివ్యాంగుడికి డబుల్ బెడ్ రూముల కేటాయింపు, స్వయం ఉపాధికి రుణాలు మంజూరు చేసేలా చర్యలు తీసుకోవాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం ఏర్పడి ఆరు నెలలు గడుస్తున్నా ఆసరా పెన్షన్ మొత్తాన్ని పెంచలేదని, ఎంతోమంది దివ్యాంగులు, వృద్ధులు తదితరులు ఆసరా పెన్షన్ కోసం ఎదురుచూస్తున్నారని వివరించారు.



ఆర్మీ, నేవీ చీఫ్‌లుగా క్లాస్‌మేట్స్!

- దేశ మిలిటరీ చరిత్రలో ఇదే తొలిసారి
- సైనిక్ స్కూల్‌లో కలిసి చదువుకున్న ఉపేంద్ర ద్వివేది, దినేశ్ త్రిపాఠి

న్యూఢిల్లీ: దేశ మిలిటరీ చరిత్రలో తొలిసారిగా ఇద్దరు క్లాస్‌మేట్స్ ఆర్మీ, నేవీ అధిపతులు అయ్యారు. ఆర్మీ చీఫ్ లెఫ్టినెంట్ జనరల్ ఉపేంద్ర ద్వివేది, నౌకాదళ అధిపతి అడ్మిరల్ దినేశ్ త్రిపాఠి 1970లో మధ్యప్రదేశ్‌లోని రేవాలో గల సైనిక్ స్కూల్లో కలిసి చదువుకున్నారు. రక్షణ శాఖ మంత్రి అధికార ప్రతినిధి భరత్ భూషణ్ ఈ విషయాన్ని ఎక్స్‌లో షేర్ చేశారు. '50 ఏండ్ల తర్వాత తాము పనిచేసే సర్వీసులను ముందుండి నడిపించే ఇద్దరు అద్భుతమైన విద్యార్థులను అందించిన అరుదైన గౌరవం రేవా సైనిక్ స్కూల్‌కు దక్కుతుంది' అని ఆయన పేర్కొన్నారు. ఆర్మీ చీఫ్ లెఫ్టినెంట్ జనరల్‌గా ఉపేంద్ర ద్వివేది ఆదివారం బాధ్యతలు స్వీకరించారు.

7న క్లాట్ నోటిఫికేషన్

డిసెంబర్ 1న పరీక్ష

న్యూఢిల్లీ, జూన్ 30: జాతీయ న్యాయ విశ్వవిద్యాలయాల కన్సార్టియం(ఎన్‌ఎల్‌యూ) 2025 సంవత్సరానికి గాను కామన్ లా అడ్మిషన్ టెస్ట్(క్లాట్) నోటిఫికేషన్‌ను ఈ నెల 7న విడుదల చేయనుంది. ఈ ఏడాది డిసెంబర్ 1న అడ్మిషన్ టెస్ట్ నిర్వహించనుంది. 22 జాతీయ న్యాయ విశ్వ విద్యాలయాలు, ఇతర సంబంధిత న్యాయ విద్యా సంస్థలు అందిస్తున్న యూజీ, పీజీ కోర్సుల్లో సీట్లు పొందాలనుకొనే విద్యార్థులు ఈ ప్రవేశ పరీక్ష రాసి ఉత్తీర్ణులు కావాల్సి ఉంటుంది. ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియాల్లో క్లాట్ నోటిఫికేషన్ విడుదల చేస్తామని ఎన్‌ఎల్‌యూ వెబ్‌సైట్ పేర్కొంది.

ఆన్‌లైన్ మాధ్యమంలో నీట్ యూజీ!

- కేంద్ర ప్రభుత్వం యోచన

న్యూఢిల్లీ: నీట్-యూజీ పరీక్షలో అక్రమాలపై దేశవ్యాప్తంగా నిరసనలు వ్యక్తమవుతున్న నేపథ్యంలో పరీక్ష నిర్వహణలో మార్పులు చేయాలని కేంద్రం భావిస్తున్నది. వచ్చే ఏడాది నుంచి నీట్-యూజీ పరీక్షను పెన్ అండ్ పేపర్ పద్ధతిలో కాకుండా, ఆన్‌లైన్ మోడ్‌లో నిర్వహించాలని కేంద్రం భావిస్తున్నదని అధికార వర్గాలు తాజాగా వెల్లడించాయి. కాగా, నీట్-పీజీ పరీక్ష తేదీలను నేషనల్ బోర్డ్ ఆఫ్ ఎగ్జామినేషన్ రీషెడ్యూల్ చేయనున్నది. ఒకటి రెండు రోజుల్లో పరీక్షకు సంబంధించి కొత్త తేదీలను ప్రకటించనున్నది.

ఏడాదిలో రెండుసార్లు నిర్వహించలేం!

వార్షిక పరీక్షలపై కేంద్రానికి తెలిపిన సీబీఎస్‌ఈ


న్యూఢిల్లీ: ప్రస్తుత అకడమిక్ షెడ్యూల్ ప్రకారం 10, 12 తరగతులకు ఒక ఏడాదిలో రెండుసార్లు వార్షిక బోర్డు పరీక్షలు నిర్వహించడం సాధ్యం కాదని సీబీఎస్‌ఈ కేంద్ర విద్యాశాఖకు స్పష్టం చేసింది. జూన్ 25న ఢిల్లీలో జాతీయ పాఠ్య ప్రణాళిక ఫ్రేమ్ వర్క్-2023పై జరిగిన సీబీఎస్‌ఈ, విద్యాశాఖ అధికారుల సమావేశంలో ఈ విషయాన్ని విద్యాశాఖకు వెల్లడించామని పేరు వెల్లడించడానికి ఇష్టపడని ఒక సీబీఎస్‌ఈ అధికారి తెలిపారు. ప్రపంచవ్యాప్తంగా ఉన్న సీబీఎస్‌ఈ స్కూళ్లలో బోర్డు పరీక్షలు నిర్వహించాలంటే 4 వేల ప్రశ్నాపత్రాలు, 20 వేల ప్రశ్నలు రూపొందించాలని... 2.5 కోట్ల సమాధానపత్రాలను దిద్దాలని ఆయన చెప్పారు. కొత్త జాతీయ విద్యా విధానం ప్రకారం విద్యార్థులపై భారం తగ్గించడానికి వీలైతే 2025-26 విద్యా సంవత్సరం లేదా ఆ తర్వాత ఏటా రెండు సార్లు బోర్డు పరీక్షలు నిర్వహించాలని కేంద్ర విద్యాశాఖ ఈ ఏడాది ఫిబ్రవరిలో సీబీఎస్‌ఈకి ప్రతిపాదించింది.

కొత్త న్యాయ చట్టాలు

నేటి నుంచే

ఐపీసీ, సీఆర్‌పీసీ, ఎవిడెన్స్ యాక్ట్‌ల స్థానంలో అమల్లోకి

- జీరో ఎఫ్‌ఐఆర్.. ఆన్‌లైన్‌లో ఫిర్యాదులు
- ఎలక్ట్రానిక్ మాధ్యమంలో సమన్లు
- హేయమైన నేరాల క్రైమ్ సీన్లకు వీడియోగ్రఫీ తప్పనిసరి
- విచారణలో జాప్యం నివారణకు రెండు వాయిదాలకే చాన్స్
- విచారణ పూర్తయిన తర్వాత 45 రోజుల్లోగా తీర్పు
- కొత్త చట్టాల్లో కీలక నిబంధనలు



న్యూఢిల్లీ, జూన్ 30: బ్రిటిష్ కాలం నాటి చట్టాలకు ముగింపు పలుకుతూ వాటి స్థానంలో కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన కొత్త నేర న్యాయ చట్టాలు జూలై 1(సోమవారం) నుంచి దేశవ్యాప్తంగా అమల్లోకి రానున్నాయి. ఇండియన్ పీనల్ కోడ్(ఐపీసీ), కోడ్ ఆఫ్ క్రిమినల్ ప్రొసీజర్(సీఆర్‌పీసీ), ఇండియన్ ఎవిడెన్స్ యాక్ట్‌ల స్థానంలో భారతీయ న్యాయ సంహిత(బీఎన్ఎస్), భారతీయ నాగరిక్ సురక్షా సంహిత(బీఎన్ఎస్ఎస్), భారతీయ సాక్ష్య అధినియం(బీఎస్) అమల్లోకి వస్తాయి. భారతదేశ నేర న్యాయ వ్యవస్థ, నేరాల దర్యాప్తు, విచారణ ప్రక్రియలో ఈ కొత్త చట్టాలు వేగం తీసుకురానున్నాయని, ఒక ఆధునిక న్యాయ వ్యవస్థను అందించనున్నాయని అధికారిక వర్గాలు చెబుతున్నాయి. కొత్త చట్టాల్లో జీరో ఎఫ్‌ఐఆర్, ఆన్‌లైన్‌లో పోలీసులకు ఫిర్యాదు, ఎంఎంఎస్ వంటి ఎలక్ట్రానిక్ మోడ్ విధానంలో సమన్ల జారీ, అతి క్రూరమైన నేరాల క్రైమ్ సీన్లను వీడియోగ్రఫీ చేయడం వంటి నిబంధనలు ఉన్నాయి. బ్రిటిష్ కాలం నాటి చట్టాల మాదిరిగా కాకుండా కొత్త చట్టాలు ప్రజలకు న్యాయం అందించేందుకు ప్రాధాన్యం ఇస్తాయని కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షా గతంలో చెప్పారు.

కొత్త చట్టాల్లోని కీలక నిబంధనలు ఇవే..

- మైనర్లపై సామూహిక లైంగిక దాడికి పాల్పడితే మరణ శిక్ష లేదా జీవిత ఖైదు నిబంధన. పిల్లలను అమ్మడం లేదా కొనడం క్రూరమైన నేరం.
- జీరో ఎఫ్‌ఐఆర్ విధానంతో ఒక వ్యక్తి పోలీసుస్టేషన్ పరిధితో సంబంధం లేకుండా ఏ స్టేషన్‌లో అయినా ఫిర్యాదు చేయవచ్చు. దీని ద్వారా ఏదైనా ఘటనను రిపోర్టు చేయడంలో లేదా చట్టపరమైన చర్యలు ప్రారంభించడంలో ఆలస్యాన్ని నివారించొచ్చు.
- ఏదైనా ఘటనను ఒక వ్యక్తి ఎలక్ట్రానిక్ కమ్యూనికేషన్ ద్వారా ఫిర్యాదు చేసేందుకు వీలుంది. పోలీసుస్టేషన్‌కు వ్యక్తిగతంగా వెళ్లాల్సిన అవసరం లేదు. దీని ద్వారా వేగవంతమైన ఫిర్యాదు ద్వారా అదే వేగంతో పోలీసులు తగిన చర్యలు తీసుకొనే వెసులుబాటు ఉంటుంది.
- ఎలక్ట్రానిక్ రూపంలో సమన్లు జారీ చేయవచ్చు. దీని ద్వారా చట్టపరమైన ప్రక్రియను వేగవంతం చేయడంతో పాటు పేపర్ వర్క్‌ను తగ్గిస్తుంది.
- లైంగిక దాడి బాధితురాలి స్టేట్‌మెంట్‌ను ఆమె సంరక్షకురాలు లేదా బంధువు సమక్షంలోనే ఒక మహిళా పోలీసు అధికారి రికార్డు చేయాలి. వారం రోజుల్లోగా వైద్య నివేదిక రావాలి.
- మహిళలపై కొన్ని నేరాలకు సంబంధించి.. బాధితురాలి వాంగ్మూలాన్ని మహిళా మేజిస్ట్రేట్ ముందు నమోదు చేయాల్సి ఉంటుంది. వారు లేనిపక్షంలో మహిళా సిబ్బంది సమక్షంలో పురుష మేజిస్ట్రేట్ ఎదుట హాజరు పరచాలి.
- ఏదైనా కేసులో నిందితులు, బాధితులు 14 రోజుల్లోగా ఎఫ్‌ఐఆర్, పోలీసు రిపోర్టు, చార్జిషీట్, స్టేట్‌మెంట్లు, ఇతర డాక్యుమెంట్ల కాపీలను పొందవచ్చు.
- క్రిమినల్ కేసుల్లో విచారణ పూర్తయిన తర్వాత 45 రోజుల్లోగా తీర్పు ఇవ్వాలి. విచారణ ప్రారంభమైన 60 రోజుల్లోగా అభియోగాలు నమోదు చేయాలి.
- కేసు విచారణలో అనవసర జాప్యాలను నివారించేందుకు, సకాలంలో న్యాయం అందించేందుకు న్యాయస్థానాలు కూడా గరిష్ఠంగా రెండు వాయిదాలు మాత్రమే మంజూరు చేస్తాయి.
- సాక్షుల భద్రతను, వారి సహకారాన్ని దృష్టిలో ఉంచుకొని సాక్షుల రక్షణ పథకాన్ని అన్ని రాష్ట్ర ప్రభుత్వాలు తప్పనిసరిగా అమలు చేయాలి.
- రాజద్రోహం స్థానంలో దేశద్రోహం అనే పదాన్ని చేర్చారు. వ్యవస్థీకృత నేరాలు, ఉగ్రవాద చర్యలను నిర్వచించారు. ఏదైనా కేసులో సోదాలు, తనిఖీలు, స్వాధీనాలను వీడియో రికార్డింగ్ చేయడం తప్పనిసరి.
- వివాహం పేరుతో మోసం చేయడం, మైనర్లపై సామూహిక లైంగిక దాడికి పాల్పడటం, మూక హత్యలు, చైన్ దొంగతనాలు వంటి ఘటనలకు పరిష్కరించేందుకు ప్రత్యేక నిబంధనలు.
- అరెస్టు సందర్భాల్లో బాధితులు తమ పరిస్థితి గురించి సమాచారాన్ని బంధువులకు లేదా స్నేహితులకు తెలియజేసే హక్కు ఉంటుంది. తద్వారా అరెస్టయిన వ్యక్తి తక్షణ సాయం పొందే వీలుంటుంది.
- అరెస్టు వివరాలను ప్రముఖంగా పోలీసు స్టేషన్లు, జిల్లా కేంద్రాల్లో డిస్‌ప్లే చేయాలి. దీని ద్వారా అరెస్టయిన వ్యక్తి బంధువులు, స్నేహితులు ముఖ్యమైన సమాచారాన్ని తెలుసుకోవచ్చు.
- దర్యాప్తును బలోపేతం చేయడంలో భాగంగా తీవ్రమైన నేరాల విషయంలో ఫోరెన్సిక్ నిపుణులు తప్పనిసరిగా ఘటనాస్థలికి వెళ్లి ఆధారాలు సేకరించాలి.
- మహిళలపై నేరాల కేసుల్లో బాధితులు తమ కేసు పురోగతిపై 90 రోజుల్లోపు ఎప్పటికప్పుడు సమాచారం పొందేందుకు అర్హులు.
- మహిళలు, చిన్నారులపై జరిగే నేరాల్లో బాధితులకు అన్ని దవాఖానల్లో ఉచితంగా ప్రథమ చికిత్స లేదా వైద్య చికిత్స.
- మరింత భద్రత కల్పించడం, దర్యాప్తులో పారదర్శకతను అమలు చేయడంలో భాగంగా లైంగిక దాడి కేసుల్లో బాధితురాలి స్టేట్‌మెంట్‌ను ఆడియో, వీడియో ద్వారా పోలీసులు నమోదు చేయాలి.
- మహిళలు, దివ్యాంగులు, దీర్ఘకాల వ్యాధిగ్రస్తులు, 15 ఏండ్లలోపు పిల్లలు, 60 ఏండ్ల పైబడిన వృద్ధులు పోలీసుస్టేషన్‌కు వెళ్లడం నుంచి మినహాయింపు ఉంటుంది. వారు నివాసం ఉంటున్న చోటే పోలీసుల సాయం పొందొచ్చు.

నీట్ కేసులో గుజరాత్ ప్రైవేట్ స్కూల్ యజమాని అరెస్ట్

గోద్రా: నీట్-యూజీ పరీక్షలో అక్రమాలకు సంబంధించిన కేసులో గుజరాత్‌లోని గోద్రాలో ఓ ప్రైవేట్ స్కూల్ యజమానిని సీబీఐ ఆదివారం అరెస్ట్ చేసింది. దీంతో ఈ కేసులో ఇప్పటివరకు మొత్తం ఆరుగురు అరెస్టయ్యారు. మే 5న జరిగిన నీట్-యూజీ పరీక్ష నిర్వహణకు ఎంపిక చేసిన కేంద్రాల్లో జై జలరామ్ స్కూల్ ఒకటి. ఇది పంచమహల్ జిల్లాలోని గోద్రా సమీపంలో ఉంది. దీని యజమాని దీక్షిత్ పటేల్‌ను సీబీఐ అరెస్ట్ చేసింది. ఆయన ఈ పరీక్షలో పాస్ చేయించడానికి సుమారు 27 మంది అభ్యర్థుల నుంచి రూ.10 లక్షలు చొప్పున డిమాండ్ చేసినట్టు ఆరోపణలు నమోదయ్యాయి. ఈ నిందితులకు లంచాలు ఇచ్చిన అభ్యర్థుల స్టేట్‌మెంట్లను గత వారం రికార్డు చేశారు.

అస్సాంలో 'క్యాష్ ఫర్ మార్క్స్' స్కామ్

న్యూఢిల్లీ: బీజేపీ పాలిత అస్సాంలో 'మార్కుల కోసం నగదు' కుంభకోణం బయటపడింది. మార్కుల జాబితాలను డిజిటల్ ట్యాంపరింగ్ చేస్తుండటాన్ని పోలీసులు గుర్తించారు. ఈ కేసులో తొమ్మిది మందిని అరెస్ట్ చేశారు. అజిజుల్ హక్ అనే విద్యార్థి మార్కుల జాబితాలో పొంతనలేని మార్కులపై గణేశ్ లాల్ చౌదరి కళాశాల అధికారులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ విద్యార్థి వాస్తవంగా పొందిన మార్కుల కన్నా మార్కుల జాబితాలో ఉన్న మార్కులు ఎక్కువగా ఉన్నట్టు తెలిపారు. దీనిపై సీఐడీ దర్యాప్తు జరుపుతున్నది. మరికొందరు అభ్యర్థులు అవకాశాలు ఉన్నాయని అధికారులు తెలిపారు. పోలీసులు ప్రశ్నించినపుడు ఈ విద్యార్థి నేరాన్ని అంగీకరించాడు.

ఎయిర్‌పోర్టుల్లో నాసిరకం నిర్మాణాలు!

- రాజధాని ఢిల్లీలో కూలిన ఎయిర్‌పోర్టు పైకప్పు
- లక్నో విమానాశ్రయంలో లీకేజీ
- మధ్యప్రదేశ్, గుజరాత్‌లో నూ పలు ఘటనలు
- మోదీ ప్రభుత్వ అవినీతి వల్లే
- కేంద్రంపై విపక్ష పార్టీల ధ్వజం



లక్నో ఎయిర్‌పోర్టులో నీళ్ల లీకేజీ

తాజాగా ఉత్తరప్రదేశ్‌లో అదానీ గ్రూపు నిర్వహిస్తున్న లక్నో ఎయిర్‌పోర్టు టెర్మినల్-3 పైకప్పు నుంచి నీళ్లు లీకేజీ అవుతున్న వీడియో శనివారం సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారింది. ఈ కొత్త టెర్మినల్‌ను కూడా మూడు నెలల క్రితమే ప్రారంభించారు. నీళ్ల లీకేజీ ఘటనపై ప్రయాణికులు భయాందోళన, తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. 'ఒక అంతర్జాతీయ విమానాశ్రయం పైకప్పు నుంచి నీరు కారడం మంచి సంకేతం కాదు. ఇది నాసిరకపు పనిని ప్రతిబింబిస్తుంది' అని శరద్ కుమార్ అనే వ్యక్తి పేర్కొన్నారు.

న్యూఢిల్లీ, జూన్ 30: దేశంలోని విమానాశ్రయాల్లో నాసిరకం నిర్మాణాలపై ఆందోళన వ్యక్తమవుతున్నది. ఇటీవల చోటుచేసుకున్న వరుస ప్రమాద ఘటనలపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. గత నాలుగు రోజుల వ్యవధిలో దేశ రాజధాని ఢిల్లీ ఎయిర్‌పోర్టుతో సహా బీజేపీ పాలిత రాష్ట్రాలైన మధ్యప్రదేశ్‌లోని జబల్‌పూర్, గుజరాత్‌లోని రాజ్‌కోట్, యూపీలోని లక్నో విమానాశ్రయాల్లో పైకప్పులు కూలడం, వర్షాలకు నీళ్ల లీకేజీ వంటి ఘటనలు జరిగాయి. కేంద్రంలో నరేంద్ర మోదీ ప్రభుత్వ అవినీతి, నిర్లక్ష్యం వల్లే నాసిరకంగా మౌలిక సదుపాయాలు కూలిపోతున్నాయని విపక్షాలు విమర్శిస్తున్నాయి.

కీలకమైన ఢిల్లీ ఎయిర్‌పోర్టులోనే..

ఢిల్లీలోని ఇందిరా గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయంలో గత శుక్రవారం టెర్మినల్-1 వద్ద పైకప్పు కుప్పకూలింది. ఈ ప్రమాదంలో క్యాబ్ డ్రైవర్ మరణించగా, మరో ఎనిమిది మందికి గాయాలయ్యాయి. విమానాశ్రయంలో ప్రయాణికుల సామర్థ్యాన్ని పెంచే టెర్మినల్ ఆధునీకరణను ప్రధాని మోదీ ప్రారంభించిన నాలుగు నెలల్లోపే ఈ ఘటన చోటుచేసుకోవడం గమనార్హం.

3 నెలల క్రితమే ప్రారంభం


ప్రధాని మోదీ మూడు నెలల క్రితం ప్రారంభించిన మధ్యప్రదేశ్‌లోని జబల్‌పూర్ ఎయిర్‌పోర్టులోనూ గత గురువారం ఇదే విధంగా పైకప్పు కూలి ఓ కారుపై పడింది. అదృష్టవశాత్తూ ఎవరికీ గాయాలు కాలేదు.

రాజ్‌కోట్ ఎయిర్‌పోర్టులో కూలిన కెనోపీ

శనివారం గుజరాత్‌లోని రాజ్‌కోట్ ఎయిర్‌పోర్టు టెర్మినల్ బయట వాహనాలు ఆగే చోట ఏర్పాటు చేసిన కెనోపీ భారీ వర్షాలకు కుప్పకూలింది. ఈ ఘటనలో ఎవరికీ గాయాలు కాలేదు. ఈ గ్రీన్‌ఫీల్డ్ ఎయిర్‌పోర్టును ప్రధాని మోదీ గత ఏడాది జూలైలో ప్రారంభించారు.

బీజేపీ పాలిత ఉత్తరప్రదేశ్‌లోని మథురలో ఆదివారం ఓ వాటర్ ట్యాంక్ కుప్పకూలి ఇద్దరు చనిపోయారు. మరో 12 మందికి తీవ్రగాయాలయ్యాయి. 'జల్ నిగమ్' పథకం కింద రూ.8 కోట్లు ఖర్చు చేసి నిర్మించిన ఈ ట్యాంక్ కేవలం 3 ఏండ్లలో కుప్పకూలటంపై సర్వత్రా ఆగ్రహం వ్యక్తమైంది.





ఇది బీజేపీ పాలిత గుజరాత్‌లోని రోడ్ల పరిస్థితి. స్మార్ట్ సిటీ అహ్మదాబాద్‌లో ఓ ప్రధాన రహదారిపై భారీ గొయ్యి ఏర్పడింది. ఆ గుంతలో ఎవరూ పడకుండా బారికేడ్లను ఏర్పాటు చేసి రోడ్డుపై రాకపోకలను నిలిపివేశారు. మరోవైపు రాజధాని గాంధీనగర్‌లో ఆదివారం కురిసిన భారీ వర్షాలకు ఓ రోడ్డు కుంగిపోయి పెద్ద గొయ్యి ఏర్పడింది. అందులో అటుగా వస్తున్న కారు ఇరుక్కుపోయింది. 'అహ్మదాబాద్‌లో ఇటీవలే అండర్ గ్రౌండ్ వర్షపు నీటి వ్యవస్థను ప్రవేశపెట్టారు. దీని కారణంగా ఒక్క చుక్క నీరు కూడా అరేబియా సముద్రంలో కలవదు' అని కాంగ్రెస్ దీనిపై వ్యంగ్యంగా వ్యాఖ్యానించింది.



ప్లాస్టిక్ చాపింగ్ బోర్డులతో శరీరంలోకి మైక్రోప్లాస్టిక్

న్యూఢిల్లీ, జూన్ 30: ప్లాస్టిక్ చాపింగ్ బోర్డుపై కూరగాయలు, పండ్లు కోయటం ద్వారా వంటల్లోకి మైక్రోప్లాస్టిక్ (5 మిల్లీమీటర్ల పొడవు కన్నా తక్కువ) చేరుతుందని తాజా అధ్యయనంలో తేలింది. దీని వల్ల తీవ్రమైన ఆరోగ్య సమస్యలు తలెత్తుతాయని పరిశోధకులు గుర్తించారు. ఒక ఏడాదిపాటు ప్లాస్టిక్ చాపింగ్ బోర్డులను వంట గదుల్లో వాడినట్టయితే, దాని నుంచి 10 క్రెడిట్ కార్డులకు సమానమైన ప్లాస్టిక్ ఆహార పదార్థాల్లో కలుస్తుంది. ఆ తర్వాత వాటిని తిన్నవాళ్ల కడుపులో చేరుతుందని పరిశోధకులు గుర్తించారు. అంతే కాదు ప్రమాదకర బ్యాక్టీరియా కడుపులోకి చేరి...అక్కడుండే మంచి బ్యాక్టీరియాను చంపుతుందని తెలిపారు. ప్లాస్టిక్ చాపింగ్ బోర్డులకు బదులు వెదురు కర్రలు, పాలరాయి, చెక్కతో చేసినవి వాడటం శ్రేయస్కరమని అధ్యయనం సూచించింది.

పానీపూరీలో క్యాన్సర్ కారకాలు!

- సాస్, స్వీట్ చిల్లీ పొడర్లలో కృత్రిమ రంగులు
- కర్ణాటకలో పలు చోట్ల గుర్తింపు



బెంగళూరు: పానీపూరీ తింటున్నారా? అయితే మరోసారి ఆలోచించండి. పానీపూరీ తయారీలో వినియోగించే కృత్రిమ రంగుల్లో క్యాన్సర్ కారక రసాయనాలు ఉన్నట్టు తేలింది. పలు రకాల ఆహారాల్లో కృత్రిమ రంగులు కలుపుతుండటంపై ఆందోళనలు వ్యక్తమవుతున్న క్రమంలో కర్ణాటకలో ఆహార భద్రత విభాగం అధికారులు రాజధాని బెంగళూరుతో సహా 79 చోట్ల తనిఖీలు చేశారు. ఈ సందర్భంగా ఆందోళనకర విషయాలు గుర్తించారు. చాలా పానీపూరీ నమూనాల్లో వాటి సాస్, స్వీట్ చిల్లీ పౌడర్లలో క్యాన్సర్ కారక రసాయనాలు ఉన్నట్టు తేలిందని ది టైమ్స్ ఆఫ్ ఇండియా నివేదించింది. చాలా వరకూ శాంపిళ్లలో సన్‌సెట్ యెల్లో, బ్రిలియంట్ బ్లూ, కార్మోసిన్ రంగులు ఉన్నట్టు తేలిందని సంబంధిత అధికారులు తెలిపారు. బెంగళూరులో సేకరించిన 49కి 19 శాంపిళ్లలో సింథటిక్ రంగులు ఉన్నట్టు గుర్తించారు. ఈ నేపథ్యంలో పానీ పూరీ తయారీలో కృత్రిమ రంగులతో తయారు చేసే సాస్‌లు, స్వీట్ చిల్లీ పౌడర్లను రాష్ట్రవ్యాప్తంగా నిషేధించే యోచనలో అధికారులు ఉన్నట్టు సంబంధిత వర్గాలు తెలిపాయి. ఇటీవల గోబీ మంచూరియా, కబాబ్‌ల వంటి ఆహార పదార్థాల తయారీలో కృత్రిమ రంగుల వాడకాన్ని నిషేధిస్తూ కర్ణాటక ఆరోగ్య శాఖ ఆదేశాలు జారీచేసిన విషయం తెలిసిందే. కాగా, కృత్రిమ రంగుల వలన అలర్జీ, పిల్లల్లో హైపర్ యాక్టివిటీ, ఆరుగురు వంటి సమస్యలు ఎదురయ్యే అవకాశం ఉన్నదని, ఇదే సమయంలో ఎక్కువ కాలం ఈ సింథటిక్ రంగులను తీసుకోవడం వలన క్యాన్సర్‌కు గురయ్యే ప్రమాదం కూడా ఉంటుందని వైద్య నిపుణులు హెచ్చరిస్తున్నారు.



అలాంటి 50 మంది ఎంపీలను ఎన్నుకోవాలి: రాజాసింగ్

ముంబై: హిందూ రాష్ట్రం కావాలని పార్లమెంట్‌లో నిర్భయంగా డిమాండ్ చేసే 50 మంది ఎంపీలను ఎన్నుకోవడం అత్యవసరమని తెలంగాణకు చెందిన బీజేపీ నేత, గోషామహల్ ఎమ్మెల్యే టీ రాజాసింగ్ అన్నారు. హిందూ జనజాగృతి సమితి ఆధ్వర్యంలో ఆదివారం గోవాలో జరిగిన వైశ్విక్ హిందూ రాష్ట్ర మహోత్సవ్‌లో ప్రసంగిస్తూ ప్రస్తుతం పలువురు రాజకీయ నేతలు హిందుత్వ వాదులుగా నటిస్తున్నారని, వారు ఎన్నికైన తర్వాత లౌకిక వాదులుగా మారిపోతున్నారని అన్నారు. ఇలాంటి వారి బుజ్జగింపు రాజకీయాల కారణంగా హిందూ భారత్ అంతరించిపోతున్నదన్నారు. అయితే హిందూ రాష్ట్ర ఏర్పాటుకు అలాంటి ఎంఎల్‌ఏలు, ఎంపీలు ఎంత మాత్రం పనికి రారని అన్నారు. స్థిరంగా, దృఢంగా హిందుత్వ భావాలను వ్యక్తం చేయగల 50 మంది ఎంపీలను ఎన్నుకోవడం అత్యవసరమని పేర్కొన్నారు.

బెంగాల్‌లో మహిళపై దాష్టీకం

- నడిరోడ్డుపై విచక్షణారహితంగా దాడి
- మమత సర్కార్‌పై ప్రతిపక్షాల ఆగ్రహం



కోల్‌కతా: పశ్చిమ బెంగాల్‌లో దారుణం చోటుచేసుకుంది. వివాహేతర సంబంధం పెట్టుకున్నారని ఆరోపిస్తూ ఓ జంటను కొంత మంది విచక్షణారహితంగా కొట్టారు. అధికార తృణమూల్ కాంగ్రెస్ పార్టీకి చెందిన స్థానిక నాయకుడు నడిరోడ్డుపై వారికి బహిరంగ శిక్ష విధించాడు. ఇద్దర్నీ రోడ్డుపై పడేసి దారుణంగా దాడి చేశాడు. మహిళను జుట్టు పట్టుకొని కొట్టి, కిందపడేసి తన్నారు. ఎంత వేడుకున్నా ఆ జంటను వదల్లేదు. ఈ అమానవీయ ఘటన ఉత్తర దినాజ్‌పూర్ జిల్లా చోప్రా పట్టణంలో చోటుచేసుకుంది. జనం గుమిగూడి చూస్తుండటం, దాడిని ఆపే ప్రయత్నం చేయకపోవటంపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తాయి. ఇంత జరుగుతున్నా పోలీసులు ఏం చేస్తున్నారు? రాష్ట్రంలో శాంతిభద్రతలు ఉన్నాయా? అంటూ ప్రతిపక్షాలు ఆగ్రహం వ్యక్తం చేశాయి. చోప్రా పట్టణంలో అధికార పార్టీకి చెందిన స్థానిక నాయకుడే దాడికి తెగబడ్డాడని, స్థానికంగా తలెత్తే వివాదాల్లో తీర్పులు చెబుతూ.. నడిరోడ్డుపై శిక్షలు అమలుచేస్తున్నాడని బీజేపీ, సీపీఎం ఆరోపించాయి. నిందితుడు చోప్రా ఎమ్మెల్యే హమీదుల్ రెహమాన్ ముఖ్య అనుచరుడు తజేముల్‌గా బీజేపీ ఐటీ విభాగం 'ఎక్స్'లో పేర్కొన్నది. మమత సర్కార్ పాలనలో 'బుల్డోజర్ జస్టిస్' అమలైందని సీపీఎం నాయకుడు ఎండీ సలీం అన్నారు. బెంగాల్‌లో సామాన్యులపై దాడులు కొనసాగుతున్నాయని కాంగ్రెస్ ఆగ్రహం వ్యక్తం చేసింది. దాడి ఘటనపై ఇస్లామ్‌పూర్ ఎస్పీ జాబి థామస్ స్పందించారు. ఘటనకు బాధ్యులైన వారిని అరెస్టు చేయనున్నట్టు చెప్పారు. కాగా, దాడి ఘటనను తృణమూల్ ఖండించింది. నిందితుడు ఏ పార్టీకి చెందినా వదిలిపెట్టేది లేదని స్పష్టంచేసింది.



నీట ముంచిన గూగుల్ మ్యాప్స్

రోడ్డు అనుకుని నదిలోకి కారు
ఇద్దరిని రక్షించిన సిబ్బంది

కాసర్‌గోడ్: గూగుల్ మ్యాప్స్‌ను నమ్ముకుని ప్రయాణం చేసిన ఇద్దరు యువకులు నదిలోకి కారును పోనిచ్చి చిక్కుకుపోయారు. అయితే అదృష్టవశాత్తు కారు చెట్టులో ఇరుక్కుపోవడంతో ప్రాణాలతో బయటపడ్డారు. అబ్దుల్ రషీద్, మరో యువకుడు కర్ణాటకలోని దవాఖానకు ఆదివారం తెల్లవారుజామున కేరళ నుంచి కారులో వెళ్తున్నారు. గూగుల్ మ్యాప్స్ సహాయంతో వెళ్తుండగా, నదిని రోడ్డు అనుకుని అందులోకి కారు డ్రైవ్ చేయడంతో కారు నీట మునిగి కొట్టుకుపోవడం ప్రారంభించింది. అయితే కారు ఒక చెట్టుకు చిక్కుకోవడంతో బతికిపోయారు. అగ్నిమాపక సిబ్బందికి సమాచారం ఇవ్వడంతో వారు వచ్చి తాడు సహాయంతో వీరిని రక్షించారు.

బీఎస్పీకి జాతీయ పార్టీ హోదా హుళక్కే!

న్యూఢిల్లీ, జూన్ 30: ఒకప్పుడు ఉత్తరప్రదేశ్‌లో అధికారం చేపట్టిన పార్టీ.. దేశంలో ఒక వెలుగు వెలిగిన పార్టీ.. దళితుల పార్టీగా పేరుపొందిన మాయావతి నేతృత్వంలోని బహుజన్ సమాజ్ పార్టీ(బీఎస్పీ) యూపీతో పాటు దేశంలో ఎక్కడా ఒక్క సీటు కూడా గెలుచుకోలేకపోయింది. ఓటింగ్ షేర్ కూడా 2.04 శాతానికి పడిపోయింది. దీంతో త్వరలో జాతీయ హోదా కోల్పోయే స్థితికి ఈ పార్టీ వచ్చింది. ప్రస్తుతం దేశంలో బీజేపీ, కాంగ్రెస్, బీఎస్పీ, ఆప్, సీపీఎం, నేషనల్ పీపుల్స్ పార్టీ(ఎన్‌పీపీ)లకు జాతీయ పార్టీ హోదా ఉన్నది. కాగా, బీఎస్పీని 1984లో కాన్షీరాం స్థాపించగా.. 1997లో జాతీయ పార్టీగా గుర్తింపు పొందింది. బలమైన శక్తిగా ఎదిగిన బీఎస్పీ.. 2012 యూపీ అసెంబ్లీ ఎన్నికల నుంచి క్రమంగా ప్రభను కోల్పోయింది.

లోక్‌సభ డిప్యూటీ స్పీకర్ బరిలో 'అయోధ్య' ఎంపీ!

న్యూఢిల్లీ: లోక్‌సభ ఉప సభాపతి ఎన్నికలు జరిగితే, ఇండియా కూటమి అభ్యర్థిగా సమాజ్‌వాదీ పార్టీ ఎంపీ అవధేశ్ ప్రసాద్‌ను బరిలో నిలపాలని ఇండియా కూటమి యోచిస్తున్నది. ఆయన ఉత్తర ప్రదేశ్‌లోని ఫైజాబాద్ నియోజకవర్గం నుంచి గెలిచారు. ఈ నియోజకవర్గం పరిధిలోనే అయోధ్య ఉంది. 2019-24లో డిప్యూటీ స్పీకర్ పదవి ఖాళీగానే ఉంది. సంప్రదాయం ప్రకారం ఈ పదవిని ప్రతిపక్షాలకు కేటాయిస్తారు. అయితే దీనికి బీజేపీ ఇష్టపడటం లేదు. ఎన్డీయే కూటమి పక్షాలకే ఈ పదవిని ఇవ్వాలని బీజేపీ పెద్దలు భావిస్తున్నట్టు తెలిసింది. రాహుల్ గాంధీ (కాంగ్రెస్), అఖిలేశ్ యాదవ్ (సమాజ్‌వాదీ పార్టీ), అభిషేక్ బెనర్జీ (టీఎంసీ) ఇప్పటికే దీనిపై చర్చించగా మమత బెనర్జీ సైతం ఓకే అన్నట్టు తెలిసింది.

భూషి డ్యామ్‌లో ఐదుగురు గల్లంతు

బాధితులంతా ఒకే కుటుంబానికి చెందిన వారు

ముంబై (నమస్తే తెలంగాణ): మహారాష్ట్రలోని లోనావాలా సమీపంలోని భూషి డ్యామ్ వెనుక భాగంలో ఉన్న జలపాతం ప్రవాహంలో ఒకే కుటుంబానికి చెందిన ఐదుగురు కొట్టుకుపోయారు. ఇప్పటి వరకు ఇద్దరి మృతదేహాలను వెలికి తీయగా, మిగతా ముగ్గురి కోసం గాలింపు కొనసాగుతున్నది. ఆదివారం ఈ ప్రమాదం జరిగింది. లోనావాలాలో రెండు రోజుల నుంచి భారీ వర్షం కురుస్తున్నది. జలపాతంలో నీరు ఉధృతంగా ప్రవహిస్తుండగా...ఒక్కసారిగా కాపాడే ప్రయత్నంలో ఐదుగురు పర్యాటకులు డ్యామ్‌లోకి కొట్టుకుపోయారు.

కే-పాప్ మ్యూజిక్ విన్నాడని బహిరంగంగా ఉరి!

ఉత్తర కొరియాలో దారుణం

న్యూఢిల్లీ: దక్షిణ కొరియా పాప్ మ్యూజిక్ వినడం, సినిమాలు చూసి వాటిని షేర్ చేసినందుకు 22 ఏళ్ల యువకుడిని ఉత్తర కొరియా బహిరంగంగా ఉరి తీసింది. రెండేండ్ల క్రితం ఈ ఘటన జరగ్గా.. ఆ దేశ మానవహక్కుల సంఘం తాజాగా వెల్లడించింది. సౌత్ హ్వాంఘే ప్రావిన్స్ యువకుడు 70 కే-పాప్ (కొరియా పాపులర్) మ్యూజిక్ వినడంతోపాటు మూడు సినిమాలు చూసి వాటిని షేర్ చేసినందుకు దోషిగా తేలడంతో మరణశిక్ష అమలు చేశారు. 'రియాక్షనరీ ఐడియాలజీ, కల్చర్'ను నిషేధించే చట్టాన్ని యువకుడు ఉల్లంఘించినట్టు ఆరోపణలున్నాయి.

చిట్టీల పేరిట 30 కోట్లతో ఉడాయింపు

- ఓ స్కూల్ టీచర్ మోసం
- హయత్‌నగర్ పోలీసులకు బాధితుల ఫిర్యాదు

హయత్‌నగర్, జూన్ 30 : చిట్టీల పేరిట బాధితుల వద్ద రూ.30 కోట్లు వసూలు చేసి ఓ చిట్టీల వ్యాపారి పరారైన సంఘటన హయత్‌నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఆదివారం సాయంత్రం వెలుగుచూసింది. సీఐ జీ రామకృష్ణ తెలిపిన వివరాల ప్రకారం... నల్లగొండ జిల్లా, నార్కట్‌పల్లి మండలం, అమ్మనబోలు గ్రామానికి చెందిన చిట్టేటి మధుసూదన్‌రెడ్డి, కుటుంబ సభ్యులతో నగరానికి వచ్చి హయత్‌నగర్‌లోని రాజరాజేశ్వరి కాలనీలో నివాసముంటున్నాడు. మధుసూదన్‌రెడ్డి వృత్తిరీత్యా హయత్‌నగర్‌లోని ఓ కార్పొరేట్ స్కూల్‌లో టీచర్‌గా పనిచేస్తున్నాడు. స్కూల్‌లో తోటి ఉపాధ్యాయులు, కాలనీలో చుట్టుపక్కల వారి వద్ద చిట్టీలు కట్టించుకొని దాదాపు రూ.30 కోట్ల వరకు వసూళ్లు చేశాడు. చివరికి బాధితులకు చిట్టీ డబ్బులు చెల్లించకుండా మధుసూదన్‌రెడ్డి తప్పించుకు తిరుగుతున్నాడు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు. నిందితుడు పరారీలో ఉన్నట్టు పోలీసులు వెల్లడించారు.

మెదక్ ఆర్డినెన్స్ ఫ్యాక్టరీ సీజీఎంగా ప్రసాద్

హైదరాబాద్, జూన్ 30 (నమస్తే తెలంగాణ): ఆర్మ్‌డ్ వెహికల్స్ నిగమ్ లిమిటెడ్‌కు చెందిన ఆర్డినెన్స్ ఫ్యాక్టరీ మెదక్ (ఓఎఫ్ఎంకే) చీఫ్ జనరల్ మేనేజర్‌గా ఎస్ఎస్ ప్రసాద్ నియమితులైనట్టు భారత రక్షణ విభాగం ఒక ప్రకటనలో తెలిపింది. సోమవారం ఆయన బాధ్యతలు చేపట్టనున్నట్టు పేర్కొన్నది.

- అమ్మవారికి బంగారు హారం



శ్రీశైలం భ్రమరాంబ ఆలయ అధికారులకు రూ.24,41,433 విలువైన 375 గ్రాముల బంగారు హారాన్ని అందజేస్తున్న భక్తుడు నటరాజ్, కుటుంబ సభ్యులు.

నేటి నుంచి సఫారీ నిలిపివేత

అమ్రాబాద్, జూన్ 30 : అమ్రాబాద్ టైగర్ రిజర్వ్ (ఏటీఆర్) పరిధిలో పర్యాటక ప్రకృతి ప్రేమికుల కోసం అటవీ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించే సఫారీ యాత్రను ఎన్‌టీసీఏ సూచనల మేరకు సోమవారం నుంచి నిలిపివేస్తున్నట్టు నాగర్‌కర్నూల్ జిల్లా అటవీ శాఖ అధికారి రోహిత్‌గోపిడి ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. అమ్రాబాద్ మండలం ఫర్హాబాద్ గేట్ నుంచి వన్యప్రాణులు, ప్రకృతి, వ్యూ పాయింట్ ద్వారా నల్లమల అందాలను వీక్షించేందుకు ఏర్పాటు చేసిన సఫారీ యాత్రను సెప్టెంబర్ 30 వరకు నిలిపివేస్తున్నట్టు పేర్కొన్నారు. ఈ మూడు నెలలు పెద్దపులులు, ఎలుగుబంట్లు ఇతర వన్యప్రాణుల సంతానోత్పత్తికి సమయం ఉంటుందని తెలిపారు. వన్యప్రాణులకు వాహనాలు, మనుషుల అలికిడి ద్వారా ఇబ్బందులు కలుగకుండా ఉండేందుకు ఈ నిర్ణయం తీసుకున్నట్టు పేర్కొన్నారు.

కృష్ణపట్టెలో రాబందు ఆనవాళ్లు

- కంబాలపల్లి అటవీ రేంజ్‌లో వన్యప్రాణులు
- సీసీ కెమెరాల్లో రికార్డైన దృశ్యాలు
- డివిజన్ అటవీ అధికారి సర్వేశ్వరరావు



నల్లమలలో ట్రాప్ కెమెరాకు చిక్కిన రాబందు (ఫైల్)

హైదరాబాద్, జూన్ 30 (నమస్తే తెలంగాణ): నల్లమల అటవీ ప్రాంతం అభివృద్ధికి అటవీశాఖ చేపడుతున్న చర్యలు సత్ఫలితాలిస్తున్నాయి. అమ్రాబాద్ టైగర్ రిజర్వ్ ఫారెస్ట్ నాగార్జునసాగర్ డివిజన్ చందంపేట మండలం కంబాలపల్లి రేంజ్‌లో నల్లమల అటవీ ప్రాంతంలో అంతరించిపోతున్న 'రాబందుల' ఆనవాళ్లు కనిపించాయి. దీంతో పాటు రెండు పెద్దపులులు సంచరిస్తున్నాయి. ఉమ్మడి మహబూబ్‌నగర్, ఉమ్మడి నల్లగొండ, కర్నూలు జిల్లాల్లో 26,795 హెక్టార్ల వరకు అటవీ ప్రాంతం విస్తరించి ఉంది. కంబాలపల్లి రేంజ్‌లో రెండు పెద్దపులులు, రాబందులు సంచరించడం ఇదే ప్రథమమని డివిజన్ అటవీ అధికారి సర్వేశ్వరరావు తెలిపారు. సీసీ కెమెరాల్లో వన్యప్రాణుల సంచారం నమోదైనట్టు తెలిపారు. అటవీ జంతువుల సంరక్షణకు కేంద్రప్రభుత్వం 4.50 కోట్లు విడుదల చేయగా.. ఆ నిధులతో అటవీశాఖ నల్లమల అటవీ ప్రాంతంలో అటవీ అభివృద్ధి, వన నర్సరీలు, రోడ్లు, చెక్ డ్యాంలతోపాటు 50కి పైగా సీసీ కెమెరాలతో నిఘా, వాచ్‌టవర్, బేస్ క్యాంపులు ఏర్పాటు చేశారు. అటవీ ప్రాంతం చుట్టూ ఐనుపగేట్లు, కంచె ఏర్పాటుచేశారు. వన్యప్రాణుల దాహార్తికి నల్లమలలో 150 కుపైగా నీటి తొట్లు, చెక్ డ్యాంలు ఏర్పాటు చేశారు.

వెంకయ్య అనుభవ సంపద అమూల్యం

ఆయన వ్యక్తిత్వం నుంచి ఎన్నో నేర్చుకున్నా

- మాజీ ఉపరాష్ట్రపతిపై ప్రధాని మోదీ ప్రశంసలు
- వెంకయ్య జీవితం ఆధారంగా 3 పుస్తకాల ఆవిష్కరణ
- హైదరాబాద్‌లో వెంకయ్యనాయుడు 75వ పుట్టినరోజు వేడుకలు



కార్యక్రమంలో వెంకయ్యనాయుడికి శుభాకాంక్షలు తెలుపుతున్న మాజీ మంత్రి హరీశ్‌రావు

మణికొండ, జూన్ 30: మంచి ఆలోచనలు, మంచి వ్యక్తిత్వం, దార్శనికతం మేలు కలయికే మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడి జీవితమని ప్రధాని నరేంద్రమోదీ కొనియాడారు. ఆయన నుంచి తాను చాలా నేర్చుకున్నానని అన్నారు. వెంకయ్యనాయుడు 75వ పుట్టిన రోజు సందర్భంగా హైదరాబాద్ గచ్చిబౌలిలోని అన్వయ కన్వెన్షన్‌లో ఆయన మిత్రులు పంచసప్తతి పేరిట ఓ ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించారు. వెంకయ్య జీవన ప్రస్థానం ఆధారంగా రాసిన మూడు పుస్తకాలు 'వెంకయ్యనాయుడు (ఎ లైఫ్ ఇన్ సర్వీస్)-జీవన ప్రస్థానం-ఆంగ్లం, సెలబ్రేటింగ్ భారత్ (13వ ఉపరాష్ట్రపతిగా ఐదేండ్ల ప్రయాణం)-ఆంగ్లం, మహానేత (జీవన చిత్రమాలిక)-తెలుగు' పుస్తకాలను ప్రధాని మోదీ ఆన్‌లైన్‌లో ఆవిష్కరించారు. వీడియో కాన్ఫరెన్స్ ద్వారా పాల్గొన్న ప్రధాని ఈ సందర్భంగా మాట్లాడుతూ ఒక చిన్న గ్రామం నుంచి వచ్చి పెద్ద పదవులు చేపట్టిన వెంకయ్యనాయుడి అనుభవ సంపద అమూల్యమని కొనియాడారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో కొన్ని దశాబ్దాల క్రితం బీజేపీ, జనసంఘ్‌కు పునాది లేని రోజుల్లోనే వెంకయ్యనాయుడు ఏబీవీపీ కార్యకర్తగా ఎంతో కష్టపడి, పార్టీలో కీలకంగా ఎదిగారని కొనియాడారు. వెంకయ్యనాయుడు సౌమ్యత, చమత్కారంతో కూడిన వ్యాఖ్యానాన్ని ప్రశంసించిన ప్రధాని.. ఆయన తెలివితేటలు, సహజత్వం, త్వరితగతిన ప్రతిస్పందించటం, వన్‌లైనర్లకు ఎవరూ సాటి రారని ప్రశంసించారు. దేశ రాజకీయాల్లో వెంకయ్యనాయుడు సేవలను ప్రశంసించిన మోదీ, ఈ రోజు ఆవిష్కరించిన మూడు పుస్తకాలు యువతకు స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. 2047లో అభివృద్ధి చెందిన భారతదేశం స్వతంత్ర శతాబ్ది ఉత్సవాలను జరుపుకోనుందని, అదే సమయంలో వెంకయ్యనాయుడు కూడా తన జీవన శతాబ్ది మైలురాయిని దాటాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా ప్రధానమంత్రి సందేశానికి వెంకయ్య ధన్యవాదాలు తెలుపుతూ.. మోదీ నాయకత్వంలో దేశం ప్రగతి బాటన పయనిస్తున్నదని అన్నారు. దేశంలో పేదరిక నిర్మూలనకు మరింత కృషి జరగాలని ఆకాంక్షించిన వెంకయ్య.. ప్రజలకు ఉచితాలను అలవాటు చేయవద్దని సూచించారు. ఈ వేడుకకు పలువురు రాజకీయ, రాజకీయేతర ప్రముఖులు హాజరై వెంకయ్యనాయుడుకు శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో తెలంగాణ, మిజోరం గవర్నర్లు రాధాకృష్ణన్, కంభంపాటి హరిబాబు, కేంద్రమంత్రి జీ కిషన్‌రెడ్డి, రాష్ట్ర మాజీ మంత్రి టీ హరీశ్‌రావు, చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, ఏపీ స్పీకర్ అయ్యన్నపాత్రుడు, ఆ రాష్ట్ర మంత్రులు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, సత్యకుమార్‌యాదవ్, ఎమ్మెల్యేలు కామినేని శ్రీనివాస్, సుజనాచౌదరి తదితరులు పాల్గొన్నారు.

అశ్వారావుపేట ఎస్సై ఆత్మహత్యాయత్నం

అశ్వారావుపేట, జూన్ 30: భద్రాద్రి జిల్లా అశ్వారావుపేట ఎస్సై శ్రీరాముల శ్రీను ఆత్మహత్యకు యత్నించారు. ఫోన్ లోకేషన్ ద్వారా గుర్తించిన పోలీసులు.. చికిత్స కోసం మహబూబాబాద్ ప్రభుత్వ దవాఖానకు తరలించారు. వివరాలు ఇలా.. అశ్వారావుపేట పోలీస్ స్టేషన్ పక్కనే ఉన్న క్వార్టర్స్‌లో నివాసం ఉంటున్న ఎస్సై శ్రీను ఆదివారం ఉదయం 8:30 గంటలకు మఫ్టీలో స్టేషన్‌కు వచ్చారు. సోమవారం నుంచి కొత్త చట్టాలు అమల్లోకి వస్తున్నాయని, అప్రమత్తంగా ఉండాలని సిబ్బందికి సూచనలు చేశారు. అదే సమయంలో ప్రైవేట్ కారు రావడంతో డ్రైవర్‌ను దింపిన ఎస్సై.. ఇప్పుడే వస్తానంటూ కారు డ్రైవ్ చేసుకుంటూ వెళ్లిపోయారు. మధ్యాహ్నం తన వాత సిబ్బంది ఫోన్ చేస్తే స్విచ్ఛాఫ్ రావడంతో వెంటనే సీఐ జితేందర్‌రెడ్డికి సమాచారం అందించారు. ఆయన వెంటనే ఎస్సై ఫోన్ లోకేషన్‌ను ట్రాక్ చేయగా మధ్యాహ్నం 1:30 గంటల తర్వాత మండలంలోని తిరుమలకుంట అటవీ ప్రాంతంలో స్విచ్ఛాఫ్ అయినట్టు గుర్తించారు. కానీ రాత్రి 10:45 గంటల వరకు ఆచూకీ లభ్యం లభించలేదు. ఇంతలో మహబూబాబాద్ జిల్లా కేంద్రం శివారులో పురుగు మందు తాగి ఆత్మహత్యకు యత్నించినట్టు గుర్తించారు. వెంటనే అక్కడి ఎస్సై ఆయన స్పందించి చికిత్స కోసం అక్కడి ప్రభుత్వ దవాఖానకు తరలించారు. ఎస్సై శ్రీను ఆత్మహత్యాయత్నానికి గల కారణాలపై పోలీసులు ఆరా తీస్తున్నారు.



శ్రీరాముల శ్రీను, ఎస్సై అశ్వారావుపేట

'ధన్వంతరి' మోసాలపై రోడ్డెక్కిన బాధితులు

- రూ.1,000 కోట్లకు మోసపోయామని వెల్లడి
- న్యాయం చేయాలని రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి

హైదరాబాద్ సిటీబ్యూరో, జూన్ 30 (నమస్తే తెలంగాణ): ధన్వంతరి ఫౌండేషన్ చేతిలో దారుణంగా మోసపోయిన తమకు న్యాయం చేయాలని బాధితులు రోడ్డెక్కారు. దాదాపు 350 మంది బ్రాహ్మణ వయోధికులు ఆదివారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో మీడియా సమావేశాన్ని నిర్వహించి ఆ ఫౌండేషన్ మోసాలను వివరించారు. అగ్రహారాల నిర్మాణం, సేవా కార్యక్రమాల పేరుతో ధన్వంతరి ఫౌండేషన్ నిర్వాహకులు తమ నుంచి రూ.1,000 కోట్ల వరకు వసూలు చేశారని, ఆ సొమ్మును డొల్ల కంపెనీల్లోకి మళ్లించడం ద్వారా ఫౌండేషన్ వ్యవస్థాపకుడు పంతంగి కమలాకరశర్మ, ఆయన కుటుంబసభ్యులు అక్రమంగా ఆస్తులను కూడబెట్టుకున్నారని తెలిపారు. వాటి వేలం ద్వారా వచ్చిన సొమ్మును తమకు ఇప్పించాలని ప్రభుత్వాన్ని కోరారు. కమలాకరశర్మ పాస్‌పోర్టులను సీజ్ చేయాలని, ధన్వంతరి ఫౌండేషన్ మోసాలపై ఐజీ స్థాయి అధికారి నేతృత్వంలో ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని ఏర్పాటు చేసి విచారణ జరిపించాలని విజ్ఞప్తి చేశారు.

బీటీపీఎస్‌కు 25 కోట్లు నష్టం

- పిడుగుపాటు ఫలితం

మణుగూరు టౌన్, జూన్ 30: భద్రాద్రి జిల్లా మణుగూరులోని భద్రాద్రి థర్మల్ పవర్ ప్లాంట్ (బీటీపీఎస్)లో యూనిట్-1 వద్ద శనివారం రాత్రి పిడుగు పడటం వల్లే జరిగిన అగ్ని ప్రమాదం సంభవించిందని అధికారులు ధ్రువీకరించారు. విద్యుత్ థర్మల్ డైరెక్టర్ లక్ష్మయ్య, విద్యుత్ సౌధా ఎస్ఈ రత్నాకర్ ఆదివారం బీటీపీఎస్‌లో క్షేత్రస్థాయిలో పరిశీలించారు. అనంతరం డైరెక్టర్ లక్ష్మయ్య మీడియాతో మాట్లాడుతూ.. దీనివల్ల దాదాపు రూ.25 కోట్ల మేర నష్టం జరిగి ఉంటుందని, 270 మెగావాట్ల విద్యుత్తు ఉత్పత్తికి అంతరాయం ఏర్పడినట్టు తెలిపారు.



పిడుగుపాటుకు కాలిన బీటీపీఎస్ జనరేటర్ ట్రాన్స్‌ఫార్మర్ (ఫైల్)

కస్టమ్స్ అధికారుల ఇండ్లలో సీబీఐ సోదాలు

- ముగ్గురిపై కేసు నమోదు

హైదరాబాద్, జూన్ 30 (నమస్తే తెలంగాణ): విదేశీ కరెన్సీని అక్రమ పద్ధతుల్లో మార్పిడి చేసినందుకు ప్రయత్నించిన ఇద్దరు కస్టమ్స్ విభాగం ఆఫీస్ సూపరింటెండెంట్లు, ఒక ఇన్‌స్పెక్టర్ ఇండ్లలో, వారి బంధువుల ఇండ్లల్లో సీబీఐ అధికారులు సోదాలు చేపట్టారు. ఆదివారం హైదరాబాద్‌లో మూడు చోట్ల, ఢిల్లీలోని ఓ ప్రాంతంలో ఈ సోదాలు జరిపారు. వివరాల్లోకెళ్తే... శంషాబాద్‌లోని రాజీవ్‌గాంధీ విమానాశ్రయం కస్టమ్స్ విభాగంలో పనిచేస్తున్న ఆఫీస్ సూపరింటెండెంట్లు వై శ్రీనివాసులు, పేరి చక్రపాణి, ఇన్‌స్పెక్టర్ పంకజ్ గౌతమ్‌లు విదేశీ కరెన్సీని గత మార్చి 16న ఆఫీస్‌బాయ్ ఓంప్రకాశ్ దత్తాతో మార్పిస్తుండగా సీబీఐసీ క్రైం ఇంటెలిజెన్స్ విభాగం అదుపులోకి తీసుకొన్నది. కరెన్సీ మార్పిడికి వచ్చిన బహూదూర్‌పురాకు చెందిన గులాష్మీ, సాజిత్, ఓంప్రకాశ్ దత్తాను విచారించగా కస్టమ్స్ అధికారుల పాత్ర ఉన్నట్టు తేలింది. వీరి వద్ద నుంచి 6,97,805 విలువైన ఇండియన్, విదేశీ కరెన్సీని స్వాధీనం చేసుకొన్నారు. దీనిపై ఆర్జీఐఏ కస్టమ్స్ కమిషనరేట్‌లోని డిప్యూటీ కమిషనర్ ఆదిత్య జల్లా ఇచ్చిన ఫిర్యాదు మేరకు ముగ్గురు అధికారులపై ఈనెల 28న సీబీఐ కేసునమోదు చేసింది. తాజాగా సీబీఐ హైదరాబాద్, ఢిల్లీలో నాలుగుచోట్ల సోదాలు నిర్వహించింది.


రాబడి

పోస్టల్ జీవిత బీమాకు పోదామా..

పీఎల్ఐ-ఆర్పీఎల్ఐకి ఉన్న ఐటీ ప్రయోజనాలేమిటి?

భారతీయ తపాలా కార్యాలయం (ఇండియా పోస్ట్ లేదా పోస్టాఫీస్) రెండు రకాల జీవిత బీమా పథకాలను అందిస్తున్నది. అవే.. పోస్టల్ లైఫ్ ఇన్సూరెన్స్ (పీఎల్ఐ), గ్రామీణ పోస్టల్ లైఫ్ ఇన్సూరెన్స్ (ఆర్పీఎల్ఐ). భద్రత, సుస్థిరతలకు మదుపరులు ముందుగా చూసేది పోస్టాఫీస్ స్కీములనేనని ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు. అటు ప్రభుత్వ, ఇటు ప్రైవేట్ రంగ ఉద్యోగులకు, ఆయా రంగాల నిపుణులు, వ్యాపారులు, ఇతరత్రా వృత్తులవారికి అనేక ప్రయోజనాలను చేకూర్చే ఈ స్కీముల్లో బీమా పథకాలకు సైతం గొప్ప ఆదరణే ఉంటున్నది. వాటికి ఆదాయ పన్ను (ఐటీ) మినహాయింపులు కూడా ఉన్నాయి. పీఎల్ఐ, ఆర్పీఎల్ఐ ప్రీమియం చెల్లింపుల్లో పోస్టాఫీస్ రిబేట్‌ను ఆఫర్ చేస్తున్నది. ఐటీ చట్టంలోని సెక్షన్ 80సీ కింద పీఎల్ఐ స్కీంలో 6, 12 నెలలు లేదా అపై ముందస్తు పేమెంట్లకు 1 శాతం నుంచి 2 శాతం రిబేట్ వస్తున్నది. అలాగే ఆర్పీఎల్ఐ స్కీంలో 3, 6, 12 నెలలు లేదా అపై ముందస్తు చెల్లింపులకు 0.5 శాతం, 1 శాతం, 2 శాతం రిబేట్లు వర్తిస్తున్నాయి.

- పోస్టాఫీసుల్లో లేదా పోస్టల్ ఏజెంట్లను సంప్రదించి ఈ బీమా పాలసీలను తీసుకోవచ్చు.
- పీఎల్ఐ, ఆర్పీఎల్ఐ పాలసీదారులు తమ ప్రీమియంలను దేశవ్యాప్తంగా ఉన్న ఏ పోస్టాఫీస్‌లోనైనా చెల్లించవచ్చు. పీఎల్ఐ పోర్టల్ ద్వారా లేదా డెబిట్, క్రెడిట్ కార్డుల ద్వారా, బీమ్/యూపీఐ, నెట్ బ్యాంకింగ్ ద్వారా కూడా పేమెంట్స్ చేసుకోవచ్చు. ఉద్యోగులు తమ సాలరీ అకౌంట్ల నుంచి ఆటోమేటిక్ డెబిట్ కూడా చేయించుకోవచ్చు.
- ఈ పోస్టల్ బీమా పథకాలకు 19-55 ఏండ్లవారు అర్హులు.
- పాలసీ కోసం ఫొటోలు, ప్రపోజల్ ఫామ్, వయస్సు-చిరునామా ధ్రువీకరణ పత్రాలు, ఐడెంటిటీ ప్రూఫ్, అనారోగ్యం ఉంటే వాటి మెడికల్ రిపోర్టులు అవసరం.
- సమ్ అష్యూర్డ్ పరిమితి కనిష్ఠంగా రూ.10,000, గరిష్ఠంగా రూ.10 లక్షలు.
- పాలసీ తీసుకున్న 3 ఏండ్ల తర్వాత నుంచి రుణాలు, సరెండర్ సదుపాయం ఉంటుంది.
- పీఎల్ఐలో సుమంగళ్, బాల జీవన్ బీమాలపై రుణ సౌకర్యం, సరెండర్ అవకాశం లేదు.
- గ్రామీణ పీఎల్ఐలో గ్రామ ప్రియ, గ్రామ సుమంగళ్, బాల జీవన్ బీమాలపై రుణ సౌకర్యం, సరెండర్ అవకాశం ఉండదు.
- బాల జీవన్ బీమా పథకానికి 5-20 ఏండ్లవారు అర్హులు. తల్లిదండ్రుల వయసు 18-45 ఏండ్ల మధ్య ఉండాలి. కుటుంబంలో గరిష్ఠంగా ఇద్దరి పిల్లలకే పథకం వర్తిస్తుంది. గరిష్ఠ సమ్ అష్యూర్డ్ రూ.3 లక్షలు.



పీఎల్ఐ పథకాలు	ఆర్పీఎల్ఐ పథకాలు
హోల్ లైఫ్ అష్యూరెన్స్ (సురక్ష)	హోల్ లైఫ్ అష్యూరెన్స్ (గ్రామ సురక్ష)
కన్వర్టబుల్ హోల్ లైఫ్ అష్యూరెన్స్ (సువిధ)	కన్వర్టబుల్ హోల్ లైఫ్ అష్యూరెన్స్ (గ్రామ సువిధ)
ఎండోమెంట్ అష్యూరెన్స్ (సంతోష్)	ఎండోమెంట్ అష్యూరెన్స్ (గ్రామ సంతోష్)
జాయింట్ లైఫ్ అష్యూరెన్స్ (యుగళ్ సురక్ష)	10 ఏండ్ల గ్రామీణ పీఎల్ఐ (గ్రామ ప్రియ)
యాంటిసిపేటెడ్ ఎండోమెంట్ అష్యూరెన్స్ (సుమంగళ్)	యాంటిసిపేటెడ్ ఎండోమెంట్ అష్యూరెన్స్ (గ్రామ సుమంగళ్)
చిల్డ్రన్ పాలసీ (బాల జీవన్ బీమా)	చిల్డ్రన్ పాలసీ (బాల జీవన్ బీమా)

మనలో చాలామంది క్రెడిట్ కార్డ్స్ వాడుతుంటారు. అయితే ఈ క్రెడిట్ కార్డుల్లో ఎన్ని రకాలున్నాయో.. వాటి లాభాలేంటో మీకు తెలుసా? బ్యాంకింగ్ రంగంలో ఉన్న ప్రస్తుత పోటీ వాతావరణంలో కస్టమర్లను ఆకట్టుకోవడం ఓ పెద్ద టాస్క్ అయిపోయింది. అందుకే యూజర్ల అవసరాలకు, అలవాట్లకు తగ్గట్టుగా ఒక్కో కార్డును ఒక్కో రకంగా ప్రయోజనాలను చేర్చి అందిస్తున్నాయి ఆయా సంస్థలు.

అక్కరకో క్రెడిట్ కార్డ్



బేసిక్ క్రెడిట్ కార్డ్స్

బ్యాంకులు, సంస్థలు తమ కస్టమర్లకు ఉచితంగానే ఇస్తున్నాయి. మరికొన్ని తక్కువ ఫీజుని వసూలు చేస్తున్నాయి. పెద్దగా బెనిఫిట్స్ ఏవీ ఉండవు.

రివార్డులకు..

క్రెడిట్ కార్డ్స్‌ను ఎక్కువగా వాడేవారికి ఇవి ఉత్తమం. ప్రతీ కొనుగోలుపై రీడిమబుల్ రివార్డ్స్ యాడ్ అవుతాయి.

క్యాష్ బ్యాక్ కోసం..

వీటితో మనం కొనే వస్తువుల ధర కొంత మొత్తం తగ్గుతుంది. అకౌంట్లలో ఆ మొత్తాలు జమవుతాయి.

ప్రయాణాలకు వీలుగా..

ప్రయాణాలు ఎక్కువగా చేసేవారికి సౌకర్యంగా ఉంటాయి. ఎయిర్‌పోర్ట్ లాంజ్ యాక్సెస్, హోటల్ చార్జీల్లో రాయితీ వంటివి అందుకోవచ్చు.

వ్యాపారస్థులకు ప్రయోజనకారిగా..

వ్యాపారులు, కంపెనీల యజమానుల కోసం వీటిని ఇస్తున్నారు. వ్యాపార లావాదేవీలపై రివార్డ్స్ పొందవచ్చు.

విద్యార్థుల కోసం..

పరిమిత రుణ చరిత్ర ఉన్నవారు, యువతకు లాభదాయకం. వార్షిక చార్జీ ఉండదు. బోనస్ పాయింట్లు వస్తాయి.

కో-బ్రాండెడ్

వీటితో ఉచిత హోటల్ సర్వీసునూ అందుకోవచ్చు. అయితే హై ఎండ్ కస్టమర్లకే ఇవి దొరుకుతాయి.

స్టోర్ క్రెడిట్ కార్డ్స్

రిటైల్ స్టోర్ల ద్వారా ఇష్యూ అవుతున్నాయి. ఎక్కడైతే లేదా ఎవరైతే ఇస్తారో అక్కడే ఈ క్రెడిట్ కార్డ్స్ చెల్లుతాయి.

షాపింగ్ కోసం..

ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ షాపర్స్‌కు సూటబుల్. వీటితో కొంటే డిస్కౌంట్లు, రివార్డులు, క్యాష్‌బ్యాక్ వంటి రకరకాల ఆఫర్లను అందుకోవచ్చు.

విమాన ప్రయాణికులకు..

విమానయాన సంస్థలతో కలిసి బ్యాంకులు వీటిని ఇష్యూ చేస్తున్నాయి. టికెట్ల ధరపై రాయితీలు, రివార్డ్ పాయింట్లు అందుతాయి.

ఇంధన వినియోగదారులకు..

వీటితో వాహనదారులు పెట్రోల్, డీజిల్ పోయించుకున్నప్పుడు డిస్కౌంట్ పొందవచ్చు. సర్‌చార్జీలను తప్పించుకోవచ్చు.

వినోదాలకు వెళ్లేవారి కోసం..

సినిమాలకు తరచూ వెళ్లేవారి కోసం ఈ క్రెడిట్ కార్డులున్నాయి. సెక్యూర్డ్‌లైనా క్రెడిట్ కార్డులను పొందవచ్చు. క్రెడిట్ స్కోర్‌తో సంబంధం లేకుండా నగదు గ్యారెంటీతో వీటిని జారీ చేస్తారు.

లాభాల స్వీకరణకు అవకాశం!

గత వారం దేశీయ స్టాక్ మార్కెట్లు రికార్డుల మోత మోగించాయి. వరుస ట్రేడింగ్ సెషన్లలో ఆకర్షణీయ లాభాలనే అందుకున్నాయి. అయితే చివరి రోజున మాత్రం మదుపరులు అమ్మకాల ఒత్తిడికి లోనయ్యారు. ఫలితంగా సూచీలు నయా ఆల్‌టైమ్ హైల్లో స్థిరపడలేకపోయాయి. అయినప్పటికీ అంతకుముందు వారం ముగింపుతో చూస్తే బీఎస్ఈ ప్రధాన సూచీ సెన్సెక్స్ 1,822.83 పాయింట్లు లేదా 2.36 శాతం పెరిగి 79వేల స్థాయికి ఎగువన 79,032.73 వద్ద స్థిరపడింది. అలాగే ఎన్ఎస్ఈ సూచీ నిఫ్టీ 509.50 పాయింట్లు లేదా 2.16 శాతం అందిపుచ్చుకుని 24వేల స్థాయిని దాటి 24,010.60 దగ్గర నిలిచింది. అయితే ఈ వారం మదుపరులు లాభాల స్వీకరణకు దిగవచ్చన్న అంచనాలున్నాయి. సూచీలు దాదాపు గరిష్ఠ స్థాయిల్లో కదలాడుతుండటమే కారణం. మదుపరులు పెట్టుబడుల జోష్‌ను కొనసాగించే దుమా మీలు లేక పోలేదంటున్నారు. జూన్ నెల వాహన విక్రయాలు, జీడీపీ వసూళ్ల తదితర అంశాలు మార్కెట్ ట్రెండ్‌ను ప్రభావితం చేయవచ్చు. ఇక గ్లోబల్ స్టాక్ మార్కెట్లు, విదేశీ సంస్థాగత మదుపరుల పెట్టుబడులు, అంతర్జాతీయ పరిణామాలు, డాలర్‌తో పోల్చితే రూపాయి మారకం విలువ ఎప్పట్లాగే ఈ వారం కూడా భారతీయ స్టాక్ మార్కెట్ల తీరును నిర్దేశించనున్నాయి. అమ్మకాల ఒత్తిడి ఎదురైతే నిఫ్టీకి 23,700 పాయింట్ల స్థాయి కీలకం. దీనికి దిగువన ముగిస్తే 23,400 పాయింట్ల స్థాయిని మద్దతుగా చెప్పుకోవచ్చు. అయితే సూచీలు పరుగందుకుంటే ఈ వారం 24,400-24,600 మధ్యకు నిఫ్టీ చేరవచ్చని చెప్తున్నారు.



హెల్త్ ఇన్సూరెన్స్‌ను అందరికీ దగ్గర చేసేందుకు క్యాష్‌లెస్ చికిత్స నుంచి క్లెయిమ్ సెటిల్‌మెంట్ వరకు ఇటీవల పలు మార్పులను చేసింది ఐఆర్‌డీఏఐ.

ఆరోగ్య బీమాలో మార్పులొచ్చాయ్

- వయసుతో సంబంధం లేకుండా అందరూ ఆరోగ్య బీమాను తీసుకోవచ్చు. సీనియర్ సిటిజన్లకు ఇది గొప్ప ఊరట.
- గుండె జబ్బు, క్యాన్సర్, కిడ్నీ వ్యాధులు, ఎయిడ్స్ రోగులకూ ఆరోగ్య బీమా.
- డిశ్చార్జి అభ్యర్థన వచ్చే మూడు గంటల్లోగా బీమా సంస్థలు తుది అనుమతి ఇవ్వాలి.
- ఆయుర్వేద, యోగా, నాచురోపతి, సిద్ధ, యునాని, హోమియోపతికీ బీమా.
- ముందున్న షుగర్, బీపీ వంటి అనారోగ్య సమస్యలకు ఇన్సూరెన్స్ కవరేజీ ఉండాలంటే పాలసీ కొన్న నాలుగేండ్ల తర్వాతే వీలయ్యేది. అయితే దీన్ని మూడేండ్లకు తగ్గించారు. జాయింట్ రిప్లేస్‌మెంట్ సర్జరీ వంటి స్పెసిఫిక్ డిసీజ్‌లు/ప్రొసీజర్ల వెయిటింగ్ పీరియడ్ కూడా మూడేండ్లే.
- మీరు పాలసీ తీసుకున్న బీమా సంస్థతో లింకైన దవాఖానలేగాక ఇతర దవాఖానల్లో చికిత్స తీసుకున్నా క్యాష్‌లెస్ వైద్య సదుపాయం.
- ఆరోగ్య బీమాలో మారటోరియం వ్యవధిని 8 ఏండ్ల నుంచి 5 ఏండ్లకు తగ్గింపు. రెగ్యులర్ పాలసీదారుల క్లెయిములు తిరస్కరణ తగ్గనున్నది.
- మీకు ఒకటి కన్నా ఎక్కువ పాలసీలుంటే.. చికిత్స ఖర్చును క్లెయిమ్ చేసుకోవడానికి వాటన్నిటినీ ఒకేసారి వినియోగించుకోవచ్చు.
- ఇండెమ్నిటీ ఆధారిత పాలసీలు వద్దన్న ఐఆర్‌డీఏఐ.. బెనిఫిట్ ఆధారిత పాలసీలనే ఇవ్వాలని ఇన్సూరెన్స్ కంపెనీలకు స్పష్టం చేసింది. దీనివల్ల పాలసీదారులకు నిర్దిష్ట దవాఖాన ఖర్చులు అందుతాయి.

సామాన్యుడికి ధరల షాక్


కొండెక్కిన నిత్యావసరాలు • బియ్యం, పప్పు, ఉప్పుల దగ్గర్నుంచి అన్నీ పిరం

భగ్గుమంటున్న కూరగాయల ధరలు • 17 శాతం పెరిగిన ఆహారోత్పత్తుల రేట్లు

సబ్బులు, హెయిర్ ఆయిల్స్ 11 శాతం ప్రియం • సూది గోలీలు చూస్తేనే గుండె దడ

పేద, మధ్యతరగతి నెత్తిన పెను భారం • ఇక మొదలుకానున్న పెట్రో వడ్డనలు

మోహన్‌రావు ఓ ప్రైవేట్ ఉద్యోగి. ఇంటికి దూరపు బంధువు ఒకరు వస్తే.. మార్కెట్‌లో చికెన్ తెద్దామని వెళ్లాడు. కిలో రూ.280 ఉన్నది. దాంతో చేసేదేమీలేక రూ.80 పెట్టి డజను కోడిగుడ్లు తీసుకుని వెళ్లిపోయాడు. సావిత్రమ్మ ఓ గృహిణి. అంగట్లో కూరగాయలు కొనేందుకు వెళ్లింది. కిలో టమాట రూ.100 పలుకుతున్నది. ఉల్లిగడ్డ రూ.50 అంటున్నారు. పచ్చి మిర్చి రూ.80 చెప్తున్నారు. బెండ, దొండ, వంకాయ.. ఇలా ఏది అడిగినా పావు రూ.20 కంటే తక్కువ లేదు. ఇక పరంధామయ్య వయసు 70. నిత్యం షుగర్, బీపీ ట్యాబ్లెట్లు మింగాల్సిందే. మందు బిళ్లలు అయిపోతే మెడికల్ షాపులో ఎప్పుడూ ఇచ్చేంత ఇచ్చినా ఇంకా కావాలంటున్నారు. అదేంటని అడిగితే రేట్లు పెరిగాయన్న సమాధానం. కిరాణా సరుకుల కోసం వెళ్లిన కిశోర్, పండ్లు తెచ్చేందుకు పోయిన రవీందర్‌లది ఇంతే సంగతి.



న్యూఢిల్లీ, జూన్ 30: ఏం తినేటట్టు లేదు.. ఏం కొనేటట్టు లేదు. అవును.. కొనడానికి పోతే కొరివితో తలగోక్కున్నట్టే అనేలా తయారైంది పరిస్థితి. కిరాణా సరుకుల దగ్గర్నుంచి కూరగాయలు, పండ్లదాకా అన్నింటి రేట్లూ మోత మోగుతున్నాయి. చివరకు అత్యవసర ఔషధాలూ కొనుక్కోలేని దుస్థితి దాపురించింది. ఒక్కమాటలో చెప్పాలంటే సామాన్యుల ఇంటి బడ్జెట్ తలకిందులైపోయింది. అసలే మార్కెట్ మందగమనంలో ఉన్న వేళ.. ద్రవ్యోల్బణం విజృంభిస్తుండటంపట్ల అన్ని వర్గాల్లోనూ ఆందోళన కనిపిస్తున్నదిప్పుడు. ముఖ్యంగా ఆహార ద్రవ్యోల్బణం పెచ్చుమీరకుండా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తగిన చర్యలు తీసుకోవాలని సర్వత్రా డిమాండ్లు వినిపిస్తున్నాయి.

ఎఫ్ఎంసీజీ ఎఫెక్ట్

ఫాస్ట్ మూవింగ్ కన్జ్యూమర్ గూడ్స్ (ఎఫ్ఎంసీజీ) కంపెనీలు తాము తయారు చేస్తున్న దాదాపు అన్ని ఉత్పత్తుల రేట్లనూ పెంచేశాయి. సబ్బులు, హెయిర్ ఆయిల్స్‌తోపాటు వివిధ ఆహారోత్పత్తుల ధరలు గడిచిన 2-3 నెలల్లో 2 నుంచి 17 శాతం వరకు పెరిగాయి. అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికలు ముగిసిన వేళ కంపెనీలు ధరలు పెంచడం చర్చనీయాంశమైంది. 2022తోపాటు 2023 ప్రథమార్ధం వరకు ఎఫ్ఎంసీజీ సంస్థలు ధరలు పెంచాయి. అయితే అంతర్జాతీయ మార్కెట్‌లో ముడిసరుకు, పామాయిల్ ధరలు తగ్గుముఖం పట్టినా.. వాటి ఆధారిత ఉత్పత్తుల ధరలు పెరగడం గమనార్హం. కాగా, చాలా సంస్థలు తమ ఉత్పత్తుల ధరలను పెంచకుండా, వాటి పరిమాణాన్ని తగ్గిస్తున్నాయి. దీంతో వినియోగదారులకు తెలియకుండానే వారిపై ధరల భారాన్ని కార్పొరేట్ కంపెనీలు మోపుతున్నాయి.

ఇది ఆరంభమే..

ఏప్రిల్‌లో హెయిర్ ఆయిల్ ధరలను 6 శాతం పెంచామని, కొబ్బరి రేట్లు పెరుగుతున్నందున మళ్లీ పెరిగేందుకు వీలున్నదని ఇటీవలి త్రైమాసిక ఆర్థిక ఫలితాల సందర్భంగా ఎఫ్ఎంసీజీ దిగ్గజం మారికో సంకేతాలిచ్చింది. ఇక ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2024-25)లో తమ ఉత్పత్తుల ధరలను 2 నుంచి 4 శాతం పెంచబోతున్నట్టు స్నాక్స్ తయారీదారు బైకాజీ తెలిపింది. ఉత్పాదక వ్యయం పెరిగిందంటూ డాబర్, ఇమామీ సంస్థలు కూడా తమ ఉత్పత్తుల రేట్లు కొంతమేర పెరుగుతాయంటున్నాయి.

ఔషధాలూ పిరం

ప్రజలకు అత్యవసరమైన ఔషధాల ధరలను నియంత్రించడంలోనూ మోదీ సర్కారు విఫలమవుతున్నది. ఏకంగా 800 కీలక ఔషధాల ధరల్లో పెంపు.. ఇప్పుడు దేశంలోని మెజారిటీ ప్రజల ఆరోగ్యంపై ప్రభావం చూపుతున్నది. ఇప్పటికే రక్తపోటు (బీపీ), చక్కెర వ్యాధి (డయాబెటిస్ లేదా షుగర్)తో బాధపడుతున్నవారు ఎక్కువ సొమ్ము పెట్టి మందులను కొనుక్కోవాల్సి వస్తున్నది. గడిచిన రెండు నెలలుగా క్రమేణా ఆయా మందుల ధరలు పెరుగుతూనే ఉన్నాయని, ఇలా ఇప్పటిదాకా 15 శాతం పెరిగాయని మెడికల్ షాపు యజమానులు చెప్తున్నారు. పెయిన్ కిల్లర్స్, యాంటీ బయాటిక్స్, యాంటీ ఇన్ఫెక్టివ్స్ వంటి ఔషధాల ధరలకు కేంద్ర ప్రభుత్వ నిర్ణయాలతో రెక్కలొచ్చాయి. అంతేగాక సర్కారు తీరు ఔషధ తయారీ సంస్థలకు లాభాల్ని పండిస్తున్నది. ఏటా కొంతమేర పెంచేందుకు డ్రగ్స్ కంపెనీలకు కేంద్రం పచ్చజెండా ఊపింది. అయినప్పటికీ షెడ్యూల్డ్ ఫార్ములేషన్లపై 10 శాతం, నాన్-షెడ్యూల్డ్ డ్రగ్స్‌పై 20 శాతం మేర ధరల్ని పెంచుకుంటామని ఫార్మా కంపెనీల లాబీయింగ్ గ్రూప్ పావులు కదుపుతుండటం గమనార్హం. నిజానికి గతంలోనే 10-12 శాతం వరకు రేట్లను పెంచాయి.

ద్రవ్యోల్బణం ఒత్తిళ్లు

రిటైల్, టోకు ద్రవ్యోల్బణం గణాంకాలు ఇప్పటికీ రిజర్వ్ బ్యాంక్ (ఆర్బీఐ) ఆమోదయోగ్య స్థాయిలో నమోదు కావడం లేదు. మే నెలకుగాను ఇటీవల కేంద్రం విడుదల చేసిన లెక్కలనే చూస్తే.. వినియోగదారుల ధరల సూచీ (సీపీఐ) ఆధారిత రిటైల్ ద్రవ్యోల్బణం 4.8 శాతంగా ఉన్నది. ఇక టోకు ధరల సూచీ (డబ్ల్యూపీఐ) ఆధారిత హోల్‌సేల్ ద్రవ్యోల్బణం 15 నెలల గరిష్ఠాన్ని తాకుతూ 2.61 శాతానికి ఎగబాకింది. రిటైల్ ద్రవ్యోల్బణాన్ని 4 శాతం దిగువనే ఉంచాలన్నది ఆర్బీఐ లక్ష్యం. అందుకే ఇటీవలి ద్రవ్యసమీక్షల్లోనూ కీలక వడ్డీరేట్లను గరిష్ఠ స్థాయిల్లోనే ఉంచింది. ఇది ఇతర రంగాల రుణ లభ్యతను దెబ్బతీస్తున్నది. రుణగ్రహీతలపై ఈఎంఐల భారాన్ని పెంచుతున్నది. అయితే వర్షాధార పంటలే ఎక్కువగా ఉన్న భారత్‌లో.. కేంద్ర ప్రభుత్వం ప్రత్యామ్నాయ చర్యలపై దృష్టి పెట్టకపోతే పరిస్థితి ఇలాగే ఉంటుందన్న విమర్శలు గట్టిగా వినిపిస్తున్నాయిప్పుడు. పంటలకు గిట్టుబాటు ధర కల్పించకపోవడం, వ్యవసాయాన్ని, రైతులను చిన్నచూపు చూడటం మోదీ సర్కారు ఇకనైనా మానుకోవాలని మెజారిటీ విశ్లేషకులు హితవు పలుకుతున్నారు. ఇక సరైన గిడ్డంగుల వ్యవస్థ ఉంటే.. మార్కెట్‌లో డిమాండ్‌కు తగ్గ సరుకులు లభిస్తాయని ఆర్థిక, వ్యవసాయ నిపుణులు సూచిస్తున్నారు.

త్వరలో పెట్రో వడ్డనలు!

పెట్రోల్, డీజిల్ ధరలు పెరిగే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఆయా రాష్ర్టాల అసెంబ్లీ, లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో ఇన్నాళ్లూ పెట్రో ధరల పెంపును అడ్డుకున్న కేంద్రం.. ఇప్పుడు ప్రభుత్వ రంగ చమురు మార్కెటింగ్ సంస్థలకు పెంపుపై స్వేచ్ఛనివ్వబోతున్నట్టు సమాచారం. ఇక రవాణా చార్జీల భారం ఆయా వస్తూత్పత్తులపై తప్పక ఉంటుంది. దీంతో రిటైల్ మార్కెట్‌లో వాటి ధరలు ఇంకా పెరగడం సహజమే.

ధరలెందుకు పెరుగుతున్నాయ్?

దేశంలో ధరలు ఇంతలా పెరుగుతుండటం వెనుక డిమాండ్‌కు తగ్గ సరఫరా లేకపోవడమే కారణమని ఆర్థిక నిపుణులు అభిప్రాయపడుతున్నారు. నిజానికి నైరుతి రుతుపవనాలు ఈసారి ముందుగా వచ్చినా.. ఆశించిన స్థాయిలో మాత్రం వర్షపాతం లేదు. పంటలపై ఆ ప్రభావం స్పష్టంగా కనిపిస్తున్నది. ఇంకా ఉష్ణోగ్రతలు అత్యధిక స్థాయిల్లోనే నమోదవుతున్నాయి. దీంతో ఇప్పట్లో పప్పుధాన్యాలు, తృణధాన్యాలు, కూరగాయల ధరలు తగ్గబోవన్న మెజారిటీ విశ్లేషకులు చెప్తున్నారు. ఇక పండిన పంటలను నిల్వ చేసుకోవడంలోనూ ప్రభుత్వ వైఫల్యాలు స్పష్టంగా కనిపిస్తున్నాయని.. ఉల్లి, టమాట, పాలకూర, వంకాయ ఇలా అన్ని కూరగాయల ధరలకు రెక్కలు తొడగడానికి కారణం ఇదేనన్న విమర్శలు ఇప్పుడు పెద్ద ఎత్తున వినిపిస్తున్నాయి. మరోవైపు గోధుమల సరఫరా మార్కెట్‌లోకి తగ్గిపోతున్నది. అయినా దిగుమతులపై కేంద్రం ఇంకా ఓ నిర్ణయానికి రాకపోవడం కూడా ధరల పెంపునకు దారితీస్తున్నట్టు చెప్తున్నారు. వరి, చెరకు పంటలు దెబ్బతిని.. బియ్యం, చక్కెర రేట్లను పరుగులు పెట్టిస్తున్నాయి.

ప్రభుత్వం ఏం చేయాలి?

- ఎగుమతులపై నిషేధం, దిగుమతులపై సుంకాల ఎత్తివేతతో కొన్ని ఆహారోత్పత్తుల ధరలను అదుపు చేయవచ్చు.
- చక్కెర, బియ్యం, ఉల్లిగడ్డ, గోధుమల ఎగుమతుల్ని ఆపి ధరల్ని నియంత్రించవచ్చు.
- ప్రభుత్వమే వివిధ పప్పుధాన్యాలను కొని సబ్సిడీ ధరలకు రేషన్ షాపులు, ఇతరత్రా మార్గాల ద్వారా ప్రజలకు అందేలా చేయవచ్చు. మార్కెట్‌లో కృత్రిమ కొరతను సృష్టిస్తున్నవారిపై కొరడా ఝుళిపించి అక్రమ నిల్వలను బయటికి తీయాలి.
- రైతులే నేరుగా తమ పంటలను అమ్ముకునేలా చర్యలు తీసుకోవాలి.

చివరగా.. తాజాగా కేంద్రంలో అధికారంలోకి వచ్చిన బీజేపీ.. తమకు ఆదరణ తగ్గలేదని నిరూపించుకోవడానికి త్వరలో జరిగే మహారాష్ట్ర, హర్యానా అసెంబ్లీ ఎన్నికలు కీలకం కానున్నాయి. అందుకే అక్కడి రైతుల మద్దతును సంపాదించుకొనేందుకు మోదీ సర్కారు పలు ప్రయత్నాలనే చేస్తుంది. దీంతో ధరలను అదుపుచేసి వారి ఆగ్రహానికి గురయ్యే సాహసం కమలం పార్టీ పెద్దలు చేయకపోవచ్చనే విశ్లేషణలున్నాయి. ఇంకొన్నాళ్లు ఓపిక పట్టి ఆ తర్వాతే ఏదో ఒకటి చేద్దామన్న ధోరణితో కేంద్ర ప్రభుత్వం ఉన్నట్టు చెప్తున్నారు. మొత్తానికి ధరల అదుపు ఇప్పట్లో జరగదనేదే సారాంశం.



పండ్లు, కూరగాయల ధరలు హోల్‌సేల్ మార్కెట్‌లోనే బాగా పెరిగిపోయాయి. దీంతో రిటైల్ ధరలు ఇంకా ఎక్కువైపోయాయి. ఇప్పటికే వ్యాపారం తగ్గిపోయింది. ఎప్పుడూ కిలోల్లో కొనే కస్టమర్లు కూడా ఇప్పుడు అర్ధ, పావుకిలోతో సరిపెట్టుకుంటున్నారు. పరిస్థితులు ఇలాగే ఉంటే కష్టాలామే.

-చందరనాథ్, పండ్లు, కూరగాయల వ్యాపారి



పప్పులు, సబ్బులు, టూత్ పేస్టులు.. అన్ని కిరాణా సరుకుల ధరలు పెరుగుతూనే ఉన్నాయి. ధరలు ఇలా పెరుగుతూపోతే వినియోగదారులకే కాదు.. వ్యాపారులకూ ఇబ్బందే. బిజినెస్ సరిగ్గా జరగక పెట్టిన పెట్టుబడులు రావడం లేదు. ఈఎంఐల చెల్లింపులూ ఇబ్బందికరంగా మారుతున్నాయి.

-రాజు, కిరాణా వ్యాపారి



ఈ ఏడాది కోళ్ల ధరలు గణనీయంగా పెరిగాయి. దీంతో చికెన్ రేట్లూ అదే స్థాయిలో కదలాడుతున్నాయి. కిలో రూ.300 దరిదాపుల్లో ఉండటం.. వ్యాపారాన్ని దెబ్బతీస్తున్నది. డజను కోడిగుడ్లు సైతం రూ.70-80కి అమ్ముతున్నాం. ఫామ్ స్థాయిలో పెరిగిన ఖర్చులు రిటైల్ మార్కెట్‌ను ప్రభావితం చేస్తున్నాయి.

-సురేశ్, చికెన్ షాపు యజమాని



మందుల రేట్లు పెరుగుతున్నాయి. ప్రధానంగా బీపీ, షుగర్ ఔషధాల ధరలు ఇటీవలి కాలంలో బాగా పెరిగిపోయాయి. గడిచిన రెండు నెలల్లో ఏకంగా 15 శాతం వరకు ఎగిశాయి. మా రెగ్యులర్ కస్టమర్లకూ ఇబ్బంది కలుగుతున్నది. నెలనెలా ఇలా రేట్లు పెరగడమేంటి? అంటూ అంతా విస్తుపోతున్నారు.

-సాయి, మెడికల్ షాపు యజమాని



ప్రతి నెలా ఖర్చులు పెరిగిపోతున్నాయి. ఆదాయం మాత్రం అంతంతే ఉంటున్నది. ఇలాగైతే ఏం పెట్టి కొనేది.. ఎలా తినేది. రెండు నెలల క్రితం రూ.500కు వారానికి సరిపడా కూరగాయలు వచ్చేవి. ఇప్పుడు రూ.700-800 పెట్టాల్సి వస్తున్నది. కిరాణా సరుకుల నెలవారీ బడ్జెట్ కూడా పెరిగిపోయింది.

-స్రవంతి, గృహిణి

మార్కెట్‌లో ధరలు ఇవీ..

వస్తువు (కిలో)	ధర (రూ.ల్లో)	పెరుగుదల (రూ.ల్లో)
కందిపప్పు	180	40
మినపపప్పు	140	30
పెసరపప్పు	130	45
శనగపప్పు	100	35
పాలు (లీటర్)	60	4
పెరుగు	96	28
చికెన్	280	70
గుడ్లు (డజను)	80	25
టమాట	90	60
ఉల్లిగడ్డ	50	30
పచ్చిమిర్చి	80	40
బెండ/దొండ	70	30
దానిమ్మ	350	120
యాపిల్	260	50
ఆరెంజ్ (1)	40	15
బొప్పాయి	45	15



ట్రీ మ్యాన్ ఆఫ్ తెలంగాణ అవార్డును అందుకొంటున్న సింగరేణి సీఎండీ ఎన్ బలరామ్

సింగరేణి సీఎండీకి 'ట్రీ మ్యాన్' అవార్డు

గ్రీన్ మ్యాపుల్ ఫౌండేషన్ ప్రదానం

హైదరాబాద్,జూన్ 30 (నమస్తే తెలంగాణ): సింగరేణి సంస్థ సీఎండీ ఎన్ బలరామ్‌కు 'ట్రీ మాన్ ఆఫ్ తెలంగాణ' అవార్డు లభించింది. సింగరేణిని పర్యావరణ అనుకూల సంస్థగా మార్చడంతోపాటు స్వయంగా 18 వేలకుపైగా మొక్కలను నాటి ప్రజల్లో పర్యావరణ స్ఫూర్తిని పెంచినందుకు, తెలంగాణలోని 6 జిల్లాల్లో 35 చిన్న అడవులను (మినీ ఫారెస్ట్స్) సృష్టించినందుకు ఈ అవార్డు వరించింది. శనివారం రాత్రి హైదరాబాద్‌లో జరిగిన కార్యక్రమంలో గ్రీన్ మ్యాపుల్ ఫౌండేషన్ ఆయనకు ఈ అవార్డును ప్రదానం చేసింది. వక్తలు మాట్లాడుతూ.. పర్యావరణ పరిరక్షణకు బలరామ్ చేస్తున్న కృషిని ప్రశంసించారు. పర్యావరణాన్ని పెంపొందించేందుకు సింగరేణి పలు కార్యక్రమాలను చేపడుతున్నదని, సింగరేణి బడుల్లో పిల్లలకు పర్యావరణ సిలబస్‌ను బోధిస్తున్నామని బలరామ్ వివరించారు. ఈ నేపథ్యంలో సీఎంపీడీఐ 2021-22లో తమ సంస్థను 'కార్బన్ న్యూట్రాలిటీ కంపెనీ'గా గుర్తించిందని తెలిపారు. ఈ ఏడాది 40 లక్షల మొక్కలను నాటేందుకు సింగరేణి సిద్ధమైందని, వనమహోత్సవంలో భాగంగా 2 వేల మొక్కలను నాటాలని వ్యక్తిగత లక్ష్యంగా పెట్టుకున్నామని వెల్లడించారు. గ్రీన్ మ్యాపుల్ ఫౌండేషన్ నిర్వాహకులకు ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో ఫౌండేషన్ ఎండీ అశుతోష్ వర్మ, ఎన్టీపీసీ, ఆయిల్ ఇండియా తదితర కంపెనీల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.


పట్టుకొచ్చి లోపలేయాలా?

- గోల్డ్‌స్మిత్ పరారీ కేసులో బాధితులకు బెదిరింపులు
- తీసుకున్న బంగారం తెచ్చి ఇవ్వాలని పోలీస్ అధికారి హుకుం
- భయాందోళనలో బాధితులు
- వరంగల్ సీపీ పరిధిలో వెలుగులోకి..

సుబేదారి, జూన్ 30 : న్యాయం చేయాలని ఠాణా మెట్లు ఎక్కిన బాధితులకే చుక్కలు చూపిస్తున్నాడో పోలీస్ అధికారి. 'చెప్పినట్టు వింటారా? లేకపోతే పట్టుకొచ్చి లోపలేయాలా?' అంటూ బెదిరింపులకు పాల్పడుతుండటంతో బాధితులు గుబగుబలాడిపోతున్నారు. విశ్వసనీయ సమాచారం మేరకు.. వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలోని వరంగల్ నగరం సెంట్రల్ జోన్‌లో ఓ ఇన్‌స్పెక్టర్.. తన స్టేషన్ పరిధిలో స్వర్ణకారుడు ఆభరణాల తయారీ కోసం తన వినియోగదారుల నుంచి పెద్దమొత్తంలో బంగారం తీసుకున్నాడు. హనుమకొండ జిల్లా కమలాపూర్‌కు చెందిన ఓ బాధితుడికి ఆ స్వర్ణకారుడు చాలాకాలం నుంచి పరిచయం ఉండటంతో కొద్దిరోజుల క్రితం రూ.7 లక్షలకుపైగా విలువ చేసే 85 గ్రాముల బిస్కెట్ గోల్డ్‌కాయిన్ ఇచ్చి చేయించుకున్నాడు. అయితే ఏం జరిగిందో ఏమో కానీ, ఇటీవల ఆ స్వర్ణకారుడు బాధితుల నుంచి తీసుకున్న బంగారంతో పరారయ్యాడు. విషయం తెలిసిన బాధితులు అతడి షాపు వద్దకు వెళ్లి సిబ్బందిని నిలదీశారు. కమలాపూర్‌కు చెందిన బాధితుడు కూడా వెళ్లి సిబ్బందిని నిలదీయగా పాత పరిచయంతో స్వర్ణకారుడి వద్ద పనిచేసే సిబ్బంది 50 గ్రాముల బంగారం అతడికి ఇచ్చారు. అదే సమయంలో మరికొందరు తమకు న్యాయం చేయాలని స్థానిక ఇన్‌స్పెక్టర్‌కు ఫిర్యాదు చేయడంతో స్వర్ణకారుడి అసలు బాగోతం బయటపడింది. పరారైన స్వర్ణకారుడి వద్ద పనిచేసే సిబ్బందిని విచారణ కోసం ఇన్‌స్పెక్టర్ స్టేషన్‌కు పిలిపించినట్టు తెలిసింది. ఎంతమంది వద్ద ఎంతెంత బంగారం తీసుకున్నారు? ఎవరెవరికి ఇచ్చారు? అని వివరాలు తీసుకొన్నాడు. బంగారం తిరిగి తీసుకున్న బాధితులకు ఫోన్ చేసి 'మీరు తీసుకున్న బంగారం తిరిగి ఇవ్వాలి' అని ఫోన్ చేసి హుకుం జారీ చేసినట్టు తెలిసింది. కమలాపూర్‌కు చెందిన బాధితుడికి ఇన్‌స్పెక్టర్ ఫోన్‌చేసి తీసుకున్న 50 గ్రాముల బంగారం స్టేషన్‌కు తీసుకొచ్చి ఇవ్వాలని బెదిరించాడు. 'నేను ఇచ్చిన 85 గ్రాముల బంగారంలో వచ్చింది 50 గ్రాములే. ఇంకా 35 గ్రాముల బంగారం రావాలి. రసీదు, ఫోన్ కాల్స్ రికార్డ్స్ ఉన్నాయి'.. సార్ అని సదరు బాధితుడు మొరపెట్టుకున్నా ఆ ఇన్‌స్పెక్టర్ వినలేదని తెలిసింది. 'స్టేషన్‌కు వస్తావా? రావా?.. రాకుంటే పట్టుకొచ్చి లోపలేస్తా'.. అని బెదిరింపులకు దిగినట్టు సమాచారం. దీంతో బాధితుడు భయాందోళనకు గురవుతున్నట్టు తెలిసింది.

గూడూరులో అరుదైన జైన పద్మావతి శిల్పాలు

పాలకుర్తి, జూన్ 30 : మనకు కనిపించే నాగదేవతల విగ్రహాలన్నీ ఒకటి కాదని, అందులో జైన యక్షిణి పద్మావతిదేవి శిల్పాలు ఉంటాయని చరిత్ర పరిశోధకుడు రెడ్డి రత్నాకర్‌రెడ్డి తెలిపారు. జనగామ జిల్లా పాలకుర్తి మండలం గూడూరులో రెండు అరుదైన రాష్ట్రకూటుల కాలం నాటి జైన యక్షిణి శిల్పాలను ఆయన గుర్తించారు. ఆదివారం వాటి వివరాలు వెల్లడించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రెండు శిల్పాల్లో ఒకటి.. గ్రామంలోని పోచమ్మ గుడి చెట్టు కింద కొమ్మలోళ్ల బొమ్మలు అని స్థానికులు పిలిచే శిల్పాల్లో ఉన్నదని, దానిలో శిల్పకళ ఉట్టి పడుతున్నదని తెలిపారు. నడుము నుంచి పైభాగం వరకు మానవ స్త్రీ రూపం, దిగువ భాగం మెలితిరిగిన పాము తోకతో ఉన్నట్టు తెలిపారు. నల్లని పొడవైన గ్రానైట్ శిల్పం నవ నాగ దేవత రూపంలో ఉన్నట్టు చెప్పారు. తల పై 9 పడగల సర్పం గొడుగు పట్టిందని, రెండు చేతుల్లో రెండు తామర మొగ్గలు ఉన్నాయని చెప్పారు. జైన దేవతల విగ్రహాలను చెట్టుకు ఒరిగించి పెట్టారని ఆయన తెలిపారు. ఈ రెండు శిల్పాలను గ్రామస్థులు సంరక్షించుకోవాలని కోరారు.



జనగామ జిల్లా గూడూరులో జైనయక్షిణి పద్మావతి శిల్పాలు



బొగతకు పర్యాటకుల తాకిడి

ములుగు జిల్లా వాజేడు మండలంలోని చీకుపల్లి అటవీప్రాంతంలో ఉన్న తెలంగాణ నయాగార బొగత జలపాతం ఆదివారం పర్యాటకులతో నిండిపోయింది. ఇక్కడికి రాష్ట్రం నలుమూలల నుంచి పర్యాటకులు తరలివచ్చారు. జలపాతం వద్ద ఉన్న స్విమ్మింగ్ పూల్‌లో ఈత కొడుతూ సందడి చేశారు. వ్యూపాయింట్ వద్ద కుటుంబ సభ్యులు, స్నేహితులతో కలిసి ఫొటోలు, సెల్ఫీలు దిగుతూ బొగత అందాలను కెమెరాలు, సెల్‌ఫోన్లలో బంధించుకున్నారు. - వాజేడు

మేడిగడ్డలో పెరిగిన వరద ప్రవాహం

మహదేవపూర్, జూన్ 30 : జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండలం అంబట్‌పల్లి గ్రామంలోని లక్ష్మి (మేడిగడ్డ) బరాజ్‌కు వరద ప్రవాహం పెరుగుతున్నది. శనివారం ఇన్‌ఫ్లో 12 వేల క్యూసెక్కులు ఉండగా, ఆదివారం 12,500 క్యూసెక్కులకు పెరిగింది. దీంతో బరాజ్‌లోని 85 గేట్లు ఎత్తి అంతే మొత్తంలో దిగువకు విడుదల చేస్తున్నారు. ప్రవాహం మరింత పెరిగే అవకాశం ఉన్నదని ఇరిగేషన్ శాఖ అధికారులు తెలిపారు. భారీ వరద ప్రవాహం కారణంగా పలు పరికరాలు నిలిచిపోయిన విషయం తెలిసిందే. డౌన్ స్ట్రీమ్‌లో పియర్ల వద్ద ఉన్న ఇసుక కొట్టుకుపోకుండా ఏర్పాటు చేసిన రాళ్లను సరిచేస్తున్నారు.

ఉమ్మడి ఖమ్మం జిల్లాలో మోస్తరు వాన

- ఖమ్మంలో 32, దుమ్ముగూడెంలో 39 మి.మీ. వర్షపాతం
- ములకలపల్లిలో పొంగిన పాములేరు వాగు
- ఆరు గ్రామాలకు నిలిచిన రాకపోకలు



వర్షం కారణంగా ఖమ్మం జిల్లా వైరా మండలం రెబ్బవరం వద్ద రహదారిపై కూలిన చెట్టు

భద్రాద్రి కొత్తగూడెం, (నమస్తే తెలంగాణ)/ ఖమ్మం వ్యవసాయం/అశ్వారావుపేట/ ములకలపల్లి, జూన్ 30: ఉమ్మడి ఖమ్మం జిల్లాలో శనివారం ప్రారంభమైన వాన ఆదివారం రాత్రి దాకా ధార తెగకుండా కురుస్తూనే ఉంది. కొన్ని మండలాల్లో తేలికపాటి, మరికొన్ని మండలాల్లో మోస్తరు, ఇంకొన్ని మండలాల్లో భారీ వర్షం కురిసింది. ఖమ్మం జిల్లా వ్యాప్తంగా సగటున 32 మిల్లీ మీటర్ల వర్షపాతం, భద్రాద్రి జిల్లా దుమ్ముగూడెంలో 39 డిగ్రీల వర్షపాతం నమోదైంది. ఈ వర్షంతో పత్తి, పునాస పంటలు ప్రాణం పోసుకుంటున్నాయి. మండల, పట్టణ, జిల్లా కేంద్రాల్లో జనజీవనానికి కాస్త ఆటంకం ఏర్పడింది. ఆయా పనుల మీద బయటకు వెళ్లొచ్చిన వారు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. మరో నాలుగు రోజులపాటు వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ శాఖ అధికారులు తెలిపారు. ఖమ్మం జిల్లా వైరా మండలం రెబ్బవరంలో ఆదివారం ఉదయం భారీ వృక్షం రోడ్డుకు అడ్డంగా కూలింది. వైరా-జగ్గయ్యపేట మార్గంలో కిలోమీటర్ల మేర వందలాది వాహనాలు నిలిచిపోయాయి.

కొట్టుకుపోయిన అప్రోచ్ నిర్మాణం

ములకలపల్లి మండలం తాళ్లపాయి పంచాయతీ పరిధిలో రింగిరెడ్డిపల్లి మీదుగా భద్రాచలం వెళ్లే ప్రధాన రోడ్డుపై పాములేరు వాగు మీద వంతెన నిర్మాణానికి అధికారులు సిద్ధమయ్యారు. అప్పటికే ఉన్న బ్రిడ్జిని కాంట్రాక్టర్ తొలగించి రాకపోకలకు అంతరాయం కలుగకుండా తాత్కాలికంగా అప్రోచ్ నిర్మించారు. ఇటీవల ములకలపల్లిలో కురిసిన వర్షానికి అప్రోచ్ కొట్టుకుపోయింది. దీంతో రింగిరెడ్డిపల్లి, తాళ్లపాయి, మంగళగుట్ట, సుందర్‌నగర్ గ్రామాలకు రవాణా వ్యవస్థ స్తంభించింది.

భూపరిహారం పంపిణీలో అక్రమాలు

- అక్రమార్కుల కుటుంబ సభ్యుల ఖాతాల్లో డబ్బు జమ
- ఆసిఫాబాద్ జిల్లాలో ఘటన.. ఫిర్యాదులతో విచారణ
- ఏసీబీ అదుపులో వరంగల్ ఆర్డీవో సిడాందత్తు

వరంగల్, జూన్ 30 (నమస్తే తెలంగాణ): భూపరిహారం పంపిణీలో అక్రమాలకు పాల్పడ్డారనే ఆరోపణలపై అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) అధికారులు వరంగల్ రెవెన్యూ డివిజన్ అధికారి (ఆర్డీవో) సిడాం దత్తును అదుపులోకి తీసుకున్నట్టు సమాచారం. కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లాలో జరిగిన ఈ అక్రమాలపై ఫిర్యాదులు రావడంతో ఏసీబీ అధికారులు దత్తును వరంగల్ ఆర్డీవో కార్యాలయం నుంచి తీసుకెళ్లడం రెవెన్యూ శాఖలో చర్చనీయాంశమైంది. సిడాం దత్తు ఇటీవల జరిగిన పార్లమెంట్ ఎన్నికల ముందు బదిలీపై వరంగల్ ఆర్డీవోగా వచ్చారు. గతంలో ఆసిఫాబాద్ ఆర్డీవోగా పనిచేశారు. ఆ సమయంలో ఆసిఫాబాద్ పట్టణాన్ని ఆనుకొని ఉన్న జన్కాపూర్ శివారు మీదుగా 363 జాతీయ రహదారి నిర్మాణం జరిగింది. జన్కాపూర్ శివారులో అప్పటికే రెండు దశాబ్దాలుగా భూమిలో సుమారు 15 ఎకరాల్లో వెంచర్లు చేశారు. ఆ లేఅవుట్లకు సంబంధించిన 6.12 ఎకరాలను 363 జాతీయ రహదారి నిర్మాణానికి సేకరించినట్టు రెవెన్యూ అధికారులు రికార్డుల్లో పేర్కొన్నారు. ఈ భూమికి పరిహారంగా ప్రభుత్వం నుంచి రూ.4.32 కోట్లు మంజూరయ్యాయి. సదరు వెంచర్‌లో రహదారుల నిర్మాణం కోసం వదిలిన స్థలాలకు మంజూరైన పరిహారాన్ని స్థానిక గ్రామపంచాయతీకి ఇవ్వాల్సి ఉండగా.. ఆ వెంచర్ చేసిన రియల్ ఎస్టేట్ వ్యాపారులు అక్రమంగా తీసుకున్నారు. దీనిపై ఫిర్యాదు అందడంతో ప్రభుత్వం విచారణ చేపట్టింది. రియల్ ఎస్టేట్ వ్యాపారుల్లో ఒకరి వద్ద పనిచేసిన డ్రైవర్ బ్యాంకు ఖాతాలో రూ.1,15,19,000 జమ అయ్యాయి. అందులో నుంచి ఆర్డీవో సిడాం దత్తు తల్లి సిడాం మల్కుబాయి ఖాతాలోకి రూ.65 లక్షలు, డిప్యూటీ తహసీల్దార్ మేడం నాగోరావు సోదరుడు మేడం దత్తుసా ఖాతాలో రూ.30 లక్షలు బదిలీ అయినట్టు విచారణలో తేలింది. సర్వేయర్ భరత్‌కు రూ.10 లక్షల నగదుతోపాటు రూ.2 లక్షల విలువైన బైకును రియల్ ఎస్టేట్ వ్యాపారులు కొనుగోలు చేసి ఇచ్చారని వెలుగులోకి వచ్చింది. నిందితుల బ్యాంకు స్టేట్‌మెంట్లు, రియల్ ఎస్టేట్ వ్యాపారి డ్రైవర్ వాంగ్మూలాన్ని విచారణ అధికారులు నమోదు చేశారు.

మరో మూడు రోజులు భారీ వర్షాలు

- బంగాళాఖాతంలో అల్పపీడనం
- జూన్ నెలలో సాధారణ వర్షపాతానికి మించి నమోదు

హైదరాబాద్, జూన్ 30 (నమస్తే తెలంగాణ): బంగాళాఖాతంలో అల్పపీడనం కొనసాగుతుందని వాతావరణ శాఖ తెలిపింది. ఉత్తర ఒడిశా, పశ్చిమ బెంగాల్ తీరాలకు ఆనుకుని ఉపరితల ఆవర్తనం సముద్రమట్టానికి 7.6 కి.మీ ఎత్తులో నైరుతి దిశగా కొనసాగుతుందని పేర్కొన్నది. అల్పపీడనం, ఉపరితల ఆవర్తనం ప్రభావంతో తెలుగు రాష్ర్టాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని చెప్పింది. మరో మూడు రోజులు భారీ వర్షాలు పడే అవకాశం ఉందని అంచనా వేసింది. ఆదివారం భద్రాద్రి-కొత్తగూడెం జిల్లా ముల్కలపల్లిలో అత్యధికంగా 9.12 సెం.మీ, భద్రాచలంలో 7.33 సెం.మీ, జూలూరుపాడులో 6.20 సెం.మీ, చండ్రుగొండలో 6.15 సెం.మీ, కొత్తగూడెంలో 5.57 సెం.మీ, మండపల్లిలో 5.32 సెం.మీ, అశ్వాపురంలో 5.51 సెం.మీ, కుమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లా జైనూర్‌లో 5.74 సెం.మీ, ఖమ్మం జిల్లా తిరుమలాయపాలెంలో 5.61 సెం.మీ, ఆదిలాబాద్ జిల్లా ఉట్నూర్‌లో 6.72 సెం.మీ చొప్పున వర్షపాతం నమోదైంది. ఈ ఏడాది జూన్ ముగిసేనాటికి 159 మి.మీ. వర్షపాతం నమోదైంది. సోమవారం ఆదిలాబాద్, పెద్దపల్లి, నల్లగొండ, సూర్యాపేట, ఖమ్మం, భద్రాద్రి-కొత్తగూడెం, కొమురంభీం ఆసిఫాబాద్, నిర్మల్, మంచిర్యాల, జగిత్యాల, మహబూబాబాద్, కరీంనగర్, భూపాలపల్లి, ములుగు జిల్లాలకు వాతావరణ శాఖ ఎల్లో అలర్ట్ జారీ చేసింది.

జిందగీ
చింతన
నమస్తే తెలంగాణ హైదరాబాద్
సోమవారం 1 జులై 2024
www.ntnews.com


సర్వం జగన్నాథం

ఈ నెల 7న పూరీ రథయాత్ర

ఆషాఢంలో సర్వం జగన్నాథం! ఆషాఢ శుద్ధ విదియ మొదలు ఏకాదశి వరకు పూరీ క్షేత్రంలో ప్రతి రోజూ పండుగే. కడలి ఉప్పొంగుతుంది. అలలు కొత్త కళను సంతరించుకుంటాయి. పూరీ కేంద్రంగా ఇలాతలాన్ని పాలిస్తున్న జగన్నాటక సూత్రధారి.. గర్భాలయం వదిలి.. వీధుల్లోకి కదిలి వస్తారు. ఎక్కడా లేని విశేషం పూరీలో ఒకటుంది. ఏ హిందూ ఆలయంలో అయినా.. ఊరేగింపు సేవకు మూలమూర్తిని కదిలించరు. ఊరూరా ఉత్సవ విగ్రహాలే ఊరేగుతాయి. పూరీలో మాత్రం మూలమూర్తి రథం ఎక్కుతారు. ఊరంతా తిరుగుతారు. పది రోజులు ఆలయాన్ని విడిచిపెడతారు. బలభద్ర, సుభద్ర సమేతుడై రథయాత్రకు వెంచేసే జగన్నాథుడి మూలవిరాట్టు.. భక్తుల హృదయ సామ్రాట్టు.

పూరీ ఆలయంలో ఎన్నో విశేషాలు. ఇక్కడ స్వామి కొయ్యతో కొలువుదీరడం ఆశ్చర్యం. భక్తులను స్వయంగా వచ్చి అనుగ్రహించడం మరో అద్భుతం. పైగా సాధారణంగా ఏ ఆలయంలో అయినా ఊరేగింపు కోసం ప్రతి సంవత్సరం ఒకే రథాన్ని వినియోగిస్తుంటారు. కానీ, పూరీలో మాత్రం జగన్నాథుడి రథ





చక్రాలు మాత్రమే కాదు.. రథం కూడా ఏటా ప్రత్యేకంగా తయారవుతుంది. రథయాత్రకు రెండు నెలల ముందు నుంచే రథ నిర్మాణ క్రతువు మొదలవుతుంది. వైశాఖ బహుళ విదియ రోజు రథ నిర్మాణానికి పూరీ సంస్థానాధీశుడు ఆదేశాలు జారీ చేస్తారు. అందుకు అవసరమైన వృక్షాలు 1072 ముక్కలుగా ఖండించి పూరీకి తరలిస్తారు. అక్షయ తృతీయనాడు రథ నిర్మాణ పని మొదలుపెడతారు. ఆషాఢ శుద్ధ పాడ్యమి నాటికి రథాలను సిద్ధం చేస్తారు. జగన్నాథుడి రథాన్ని నందిఘోష అంటారు. దీని ఎత్తు 45 అడుగులు. పదహారు చక్రాలు ఉన్న జగన్నాథుడి రథాన్ని దర్శించుకున్న మాత్రాన పుణ్యం దక్కుతుందని భక్తుల విశ్వాసం. ఆ రథాన్ని లాగే అవకాశం దొరకడం పూర్వజన్మ సుకృతంగా భావిస్తారు. ఇక బలభద్రుడి రథాన్ని తాళధ్వజం అంటారు. దీని ఎత్తు 44 అడుగులు, పద్నాలుగు చక్రాలు ఉంటాయి. సుభద్రాదేవి రథం పేరు పద్మ ధ్వజం. ఎత్తు 43 అడుగులు. చక్రాలు పన్నెండు. జగన్నాథుడి రథాన్ని పసుపు వస్త్రంతో అలంకరిస్తారు. బలభద్రుడి రథాన్ని ఎర్రటి చారలుండే నీలి వస్త్రంతో కప్పుతారు. పద్మధ్వజాన్ని ఎర్రటి చారలున్న నలుపు వస్త్రంతో అలంకరిస్తారు.

కన్నుల పండుగ పహండీ

విదియ నాడు ముందుగా ఆలయంలో ప్రత్యేక పూజలు చేస్తారు. తర్వాత విగ్రహాలను వారి వారి రథాలపై అధిరోహింపజేస్తారు. ఈ వేడుకను 'పహండీ' అని పిలుస్తారు. తర్వాత పూరీ సంస్థానాధీశులు రథం ఎక్కి స్వామి ముంగిట బంగారు చీపురుతో శుభ్రం చేస్తారు. దీనిని 'చేరా పహారా' వేడుకగా చెబుతారు. తర్వాత పలు సంప్రదాయ క్రతువులు కొనసాగుతాయి. చివరిగా భక్తుల జయజయధ్వానాల మధ్య రథయాత్ర మొదలవుతుంది. 'జై జగన్నాథ.. జైజై జగన్నాథ..' అంటూ తాళ్లను పట్టుకుని రథాన్ని లాగడం మొదలుపెడతారు. దీన్నే ఘోషయాత్ర అంటారు. జగన్నాథ ఆలయం నుంచి మూడుమైళ్ల దూరంలో ఉన్న గుండిచా మందిరానికి రాత్రికి గానీ రథాలు చేరుకోవు. మూలమూర్తులను ఆ పూట రథంలోనే ఉంచుతారు. మర్నాడు మేళతాళాలతో గుడిలోకి తీసుకెళ్తారు. గుండిచా దేవి.. జగన్నాథుడికి పిన్నిగా చెబుతారు. ఆ ఆలయంలో స్వామి వారం రోజులు ఆతిథ్యం స్వీకరిస్తారు. తర్వాత ఆషాఢ శుద్ధ దశమి నాడు పూరీకి తిరుగు ప్రయాణం అవుతారు. దీనిని బహుదాయాత్ర అంటారు. దశమి నాటి మధ్యాహ్నానికి పూరీ ఆలయానికి రథాలు చేరుకుంటాయి. రోజంతా ఆలయం వెలుపలే నిలిచి ఉంటాయి. తొలి ఏకాదశి నాడు స్వామివారిని బంగారు ఆభరణాలతో అలంకరిస్తారు. ప్రత్యేక పూజలు చేస్తారు. ద్వాదశినాడు మళ్లీ విగ్రహాలను గర్భగుడిలోని రత్న సింహాసనంపై ఉంచడంతో పూరీ రథయాత్ర ముగుస్తుంది.

... రామకీర్తన


ప్రేమపూర్వక స్పర్శ.. దివ్యౌషధం

ఇస్లాం బోధ

లుఖ్మాని హకీం సుప్రసిద్ధ వైద్యులు. ఆయన పేరుతో ఖురాన్‌లో ఒక అధ్యాయమే ఉంది. వందల సంవత్సరాలపాటు ఎన్నో రోగాలకు చికిత్స చేశారు. అద్భుతమైన వైద్యుడిగా గుర్తింపు పొందారు. 'మనిషి రోగానికి ప్రేమ, ఆదరణకు మించిన ఔషధం లేదనే విషయం తనకు బోధపడింద'ని ఆయన చెబుతుండే వారు. ఒకసారి లుఖ్మాని హకీంతో 'ఒకవేళ ఈ ఔషధాలు కూడా పనిచేయకపోతేనో?' అని ప్రశ్నించారు. దానికి ఆయన చిన్నగా నవ్వి 'ప్రేమ పాళ్లు పెంచండి' అని బదులిచ్చారు. ప్రేమపూర్వకమైన స్పర్శను మించిన ఔషధం లేదంటారాయన. వైద్యుడు ప్రత్యక్ష దైవం. అందుకే వైద్యులకు, వైద్యానికి ఇస్లామ్ ధర్మం ఎనలేని ప్రాధాన్యాన్ని ఇచ్చింది. ఒక ప్రాణాన్ని కాపాడితే సమస్త మానవాళి ప్రాణాలు కాపాడినంతో సమానమని ఖురాన్ పేర్కొన్నది. 'ఒకసారి దైవ ప్రవక్త ఇబ్రాహీం (అలై) దైవాన్ని 'ప్రభూ వ్యాధి ఎవరి తరఫు నుంచి వస్తుంద'ని అడిగారు. అప్పుడు సృష్టికర్త తరఫు నుంచి అని సెలవిచ్చారు అల్లాహ్. మళ్లీ ఆయన 'మందు ఎవరి తరఫు నుంచి?' అని ప్రశ్నించారు. 'మందు కూడా నా తరఫు నుంచే'' అని సమాధానమిచ్చారు దేవుడు. 'అలాంటప్పుడు వైద్యుని అవసరమేంటి?' అన్నారు ఇబ్రాహీం (అలై). 'వైద్యునితో ఔషధం ఇవ్వడం జరుగుతుంది' అని సెలవిచ్చారు దైవం. వైద్యుడికి గొప్పదనం అంతటిది. రోగులను వైద్యులు నవ్వుతూ పలకరించాలి. రోగి చెప్పింది పూర్తిగా వినాలి. అతనికి ధైర్యాన్ని నూరిపోయాలి. ప్రేమపూర్వక స్పర్శతో ఉపశమనం కలిగించాలి. దీంతో తనకు ఏం కాదన్న నమ్మకం రోగికి ఏర్పడుతుంది. రోగం సగం నయం అవుతుంది.

... ముహమ్మద్ ముజాహిద్
96406 22076





జనార్దనుని కాళియ మర్దనం

శ్రీ శుకముని భూజాని పరీక్షిత్తుతో.. రాజా! గోపికలు యశోదను పట్టుకొని దుఃఖం ఆపుకోలేక, యశోదయూ- అతులిత కీర్తి, కరుణా శోభితుడైన నంద సుతుని ఉద్దేశించి ఇలా అన్నారు..

సీ॥ ఎదురు వచ్చిన జాల నెదురుగా జనుదెంతు,
నెదురు వచ్చిన నేడేల రావు?
చూచిన గృపతోడ జూచుచుందువు నీవు,
చూడగ గనువిచ్చి చూడవేల?
దాచిన సఖులకు దాయంగ వత్తువు,
దాచిన నేటికి దాయవిపుడు?
జీరిన నోయని వెంటేగి పలుకుదు,
విభవమ్ము సేసిన నెలుగ వింటు?
ఆ॥ తలపు సేయు నంత దలపోయు ముందువు
తలపు నేడు నేడు దలచ వేటి!
యనుచు భక్తి విభవ బాదెడి క్రైవడి
వేత ళిల్ల నాడి వివశలైరి'

'బాలగోపాలా! మేము ఎదురొస్తే నీవూ జయంగా మాకు ఎదురొచ్చేవాడివి. కాని ఈనాడు నీవలా రాకుండవేం? మేము తలిస్తే నీవు పులకించి దయతో మమ్ము చూసేవాడివి. ఓ కన్నా! నేడు మేము కన్నార చూచినా, నీవు కనువిచ్చి మమ్ము కనవదేమి? మేము పొంతకు- దగ్గరకు వచ్చిన నీవూ మా చెంతకు చేరే వాడివి. ఇప్పుడు మేము వద్దకు వచ్చినా, ఓ ముద్దుల కృష్ణా! నీవు మా దరికి రావేమి? పిలవగానే 'ఓ' అని పలుకుతూ పలికేవాడివే! నేడు మేము నోరారా పిలుస్తున్నా ఓ చిత్తచోరా! దామోదరా! నీవు పలకవేమి? స్మరించగానే స్ఫురణకు వచ్చే వరించి జనా! ఈ వేళ మేము పలవు మీద తలచినా నీవు మా తలపు (మనసు)లోకి రావ వేల? అకటా!- అయ్యో! ఇదేమి విచిత్రం- విరుద్ధం తండ్రీ!'... అని భక్తితో పరవశించిన వారివలె గోపికలు కదలికలు కోల్పోయి, విస్మయాంగన వలె వెనుదిరిగి పోలేకపోయారు. మూలంలోని 'తత్ప్రాప్యాస్మిత విలోక గిరః స్మరంత్యః' - (గోపికలు నిత్యం, నిరంతరం బాలకృష్ణుని సాహచర్యం- ఉదారమైన చెలిమి, అందమైన మందహాసం, దయతో కూడిన చూపులు, మధురమైన మాటలనే స్మరిస్తుంటారు) అన్న ఈ శ్లోక పాదాన్ని గ్రహించి సుకోవిదుడు పోతన కరుణ, వాత్సల్య రసాలను భక్తితో రంగరించి, సరసోక్తులతో పై సీసాన్ని సింగారించారు.

'మడుగులో పడి మనమూ ప్రాణాలు విడుద్దాం' అంటూ వడిగా అందులో పడబోతున్న యశోదాదులను చూసి బలభద్రుడు 'తల్లిదండ్రులారా! ముందు చూడబోయే కనుమరుగు జాడ (తీరు) తెలియక మీరిలా కుందు (దుఃఖపడు)తున్నారు. సందేహించక ఒక్క మహిమ వేచి చూడండి' అంటూ కరివేలుపు (కృష్ణుని) బలమెరిగిన సీరి- హలధరుడు తనవారినందరిని వారించాడు. వారికన్నెత్తుకు కృష్ణుడు కూడా మానవమాత్రుని వలె ఒక ముహూర్త కాలం మౌనం వహించి ఊరకున్నాడు. నాగారి వాహనుడు సరదాగా అలా కొంతసేపు నాగరాజు చేష్టలను బాగా సాగనిచ్చాడు. అంతలోనే తేరుకున్న వానివలె కన్నయ్య ఉన్నట్టుండి తన మేను ఒక్కసారిగా బాగా పెంచాడు. స్వామి బలానికి తాళలేక కాళియుని ఒడలు (శరీరం) కుములిపోయి, చుట్టలు పట్టు వదలి వీడిపోయాయి. పడగలు వేదిక్కి అవయవాలు సడలిపోయాయి. వాడు కదవడం మాని అలసిపోతూ, నిడుపైన (దీర్ఘ) నిట్టూర్పులు విడుస్తూ తలలు నెమ్మదిగా పైకెత్తాడు. ముక్కు రంధ్రాల నుంచి నెత్తురు చిమ్ముతుండగా పగ (బాధ)తో దిక్కులు చూస్తూ పొగమూరిన కళ్లవలె తుదాకి (తేజస్సు) కోల్పోయి, ఉరగ (సర్ప)రాజు కాళియుడు హరిని వీడి దూరంగా జరిగిపోయాడు. అరవిందాక్షుడు గరుడధ్వజుడు తన చేతితో కాళియుని పడగలపై ఎడాపెడా వడి-వడిగా చరచాడు. ఖగేంద్రు(గరుడు)ని వలె ప్రవేశించి చంద్రుడు కృష్ణుడు దుష్ట నాగేంద్రుని దవడలు మీద గట్టిగా ఒడిసిపట్టి, వానిని పైకెత్తి గిరగిర తిప్పి విసిరికొట్టాడు. ఆ దెబ్బతో కాళియుని కళ్ల నుంచి విషాగ్ని జ్వాలలు వెల్లువలై వెలువడాయి. ఆ ప్రాదుర్భావంలోని దర్పం సర్వం కర్పూరంలా హరించుకుపోయింది. నాగారి (గరుడ) వాహనుడు శౌరి- జగజెట్టి నంద పట్టి రెట్టించిన ఉత్సాహంతో ఉరగరాజు- కాళియునిపై విజృంభించి వీరంగం వేశాడు.

వ్యాస భాగవతంలో 'అఖిల కలాది గురుర్న నర్త' (అన్ని విద్యలకు, కళలకు ఆదిగురువైన శ్రీవరుడు కృష్ణుడు నాట్యమాడాడు) అని దివ్యాత్మకంగా ఉన్న- ''కాళియుని ఉత్తమాంగా (శిరస్సు)ల రంగస్థలంపై అనంగజనకుడు, 'చతుర నటమూర్తి గోపాల చక్రవర్తి' అయిన శ్రీకృష్ణుడు సలిపిన నృత్య విలాసాన్ని'' ఈ సీస పద్యంలో నిత్య నూతనంగా, సాంగ రూపక అలంకారంలో అంగరంగవైభవంగా రసవత్తరంగా ఆవిష్కరించారు మన భక్తకవి పుంగవుడు పోతన!

సీ॥ ఘన యమునా నది కల్లోల ఘోషంబు,
సరస మృదంగ ఘోషంబు గాగ
సాధు బృందావన పవ చంచరీక గా,
నంబు గాయక సుగానంబు గాగ
గగనాంగన సాధన కమనీయ మంజు శ,
బ్దంబులు దాళ శబ్దములు గాగ
దివి నుండి వీక్షించు దివిజ గంధర్వాది,
జనులు సభాసద జనులు గాగ
తే॥ బద్మ రాగాది రత్న ప్రభాసమాన
మహిత కాళియ ఫణిపీఠ మండపమున
సకలలోకైక విఖ్యాత నర్తకుండు
నిత్య నైపుణమున బేర్చి నృత్యమాడె'

శుకుడు.. రాజా! పద్మరాగాది రత్న ప్రభలతో భాసించే కాళియుని పడగలే విశాలమైన మంటపం- వేదిక. ఇంపైన కాళింది నదిలో కదిలే తరంగాల ధ్వనులే వినసొంపైన మృదంగ ధ్వానా (శబ్దా)లుగా అద్వితీయ నాట్యాచార్యునికి వాద్య సహకారం అందిస్తున్నాయి. బృందావనంలో ఆనందంగా సంచరించే చంచరీక (తుమ్మెద) బృందాల మధుర ఝంకార నాదాలే గాయక గంధర్వుల మోహనరీతి గానం కాగా; కలహంసలు, సారసా (బెగ్గురు పక్షు)ల కలకూజితాలే- శ్రావ్యమైన తాళాలే తాళ ధ్వనులై అలరించగా; దివి నుండి వేడుకగా వీక్షిస్తున్న యక్ష గంధర్వాది దేవతలు సభాసదులలో వర్తమానులై ఉన్న ప్రేక్షక సత్తములు కాగా; దర్పి (కపట) బాలకుడు, పద్మాక్షుడు కృష్ణుడు అనే ప్రఖ్యాత నర్తకుడు కాళియ ఫణా(పడగ)లనే విశాల సభా- భవనంలో నిత్యమైన నైపుణ్యంతో నృత్యమాడాడు. అందెలు గజ్జెలు ప్రమోదంగ నందనందనుడు లీలా విలాస గతులతో లయబద్ధంగా కాళియ పడగలపై ఎగిరెగిరి పడిపడిగా చిందులు తొక్కాడు. ప్రళయంకరంగా ప్రచండ నృత్యతాండవ సలిపి 'తాండవ' కృష్ణుడయ్యాడు! 'దిక్పాలకులు- దిగంబరుడు హరుడు నటరాజే, పరవశులగు సురవరులు పీతాంబరుడు నటనరుడు హరి' అని అచ్చెరు మచ్చరుగా నిరూపించాడు కరివేలుపు కృష్ణుడు! ఇది గాంచి పరవశించి సురులు, మునులు తమ భార్యలతో కూడి విరుల వానలు కురిపించారు.

కాళియుడు ముఖాల నుంచి రక్తమాంసాలు వెళ్లగక్కాడు. అతని కళ్ల నుంచి విషం వెల్లువెత్తింది. ప్రాణాలు గొంతు వరకు వెళ్లకుని వచ్చాయి. శక్తి సన్నగిల్లి నీరసించి పోయాడు. తల ప్రాణం తోకకు రాగా విలవిలలాడి పోతూ కాళియుడు తనలో ఇలా తలపోశాడు... 'అహో! ఇది కలా లేక కల్లా?' నా విషమునే పావక (అగ్ని) జ్వాలలు సోకితే చాలు, నాక సదులు (దేవతలు) కూడా చావక మానరే! అయ్యో! ఇదేమి దోషం? ఈ బాలకొని నా శిరస్తకాన్ని (నూరు పడగలను) చితక తొక్కుతూ అతల కుతలం చేస్తున్నాడు. చూడగా ఇతడు సామాన్యుడుగా కానవావడం లేదు. సకల చరాచర ప్రాణి వర్గానికి ప్రభువైన ఆ పరమేశ్వరుడే! హరి సేవాప్రీతుడు- భక్తితో సేవిస్తే ప్రసన్నుడవుతాడు' అని ప్రాణభీతితో అంతఃకరణంలో భరణ- న్యాసం (రక్షణ భారాన్ని ఆ భగవంతునికే వదలి) చేసి తక్షణం శరణాగతుడయ్యాడు.

శుకుడు- రాజా! కాళియుని భార్యలు- నాగకాంతలు దిక్కు తెలియక భ్రాంతికి లోనై తత్తరపడుతూ వచ్చి, డ్రాంతుల్లి- చితికిపోయి, చచ్చినట్లు పడి ఉన్న తమ భర్తను చూసి బిత్తరపోయి, మిక్కిలి నొచ్చుకొని, బాపురుమని ఏడుస్తున్న వేలుర (పలువురు) బిడ్డలను ముందుపెట్టుకొని, కృష్ణ చంద్రునికి వందనాలు అర్పించి, అంజలిగావించి, కృష్ణుడై ఉన్న అనిరుద్ధ భగవానుడు తమ పతికి విధించిన శిక్షను- 'అధోక్షజా! ఇది నీ కష్టపూరితం కాదు' అని ఆమోదిస్తూ, శ్రద్ధా భక్తులతో తమ సౌభాగ్య సమృద్ధిని కాంక్షిస్తూ భక్తితో ఇలా జాలిగా నుతించారు... సుగుణ నిధీ! క్రూరులను దండించడానికి అవనిపై అవతరించిన మహనీయ పురుషుడవు నీవు! క్రూరుడైన ఈ కాళియుని శిక్షించడం నీకు వీరత్వమే కాని క్రూరత్వం కాదు. అజాత శత్రువువైన నీకు దుష్ట శిక్షణం లోక రక్షణమే కదా!



తంగిరాల
రాజేంద్రప్రసాద శర్మ
96668 36006

క॥ నిగ్రహము మము విషాస్యుల
నుగ్రుల శిక్షించుటెల్ల? మూహింప మహా
నుగ్రహము గాక మా కీ
నిగ్రహము విషాస్యభావ నిర్గతి జేసెన్...

'స్వామీ! మేము గళం-కోరలలో ఘోరమైన గరళం (విషం) కలవారం. క్రూరమైన కోపం కల పాప (సర్ప)జాతి వారం. మావంటి వారిని శిక్షించడం మంచిదే (అలంకారమే) కాని దండన అనిపించుకోదు. కారణం? దీనివలన విషం కలవారమని ఎగిరెగిరి పడే మా పొగరు, పగ శాశ్వతంగా అణిగిపోయాయి. దర్ప విగ్రహా! ఈ నీ నిగ్రహం- శిక్ష, దండనం మా యెడల మహా అనుగ్రహమే!'

ఉ॥ ఎట్టి తపంబు సేసెనొకొ? యెట్టి సువర్మము లాచరించెనో?
యెట్టి నిజంబు పల్కెనొకొ? యీ ఫణి పూర్వ భవంబునందు ము
న్నెట్టి మహానుభావులకు నెన్నడు జేకుఱని నీవు వే
డిట్టి వినోద లీల దలకెక్కి నటించెదవీ ఫణీంద్రుపై'

'పురుషోత్తమా! ఈ కాళియుడు పూర్వజన్మల్లో ఎటువంటి తపస్సులు చేశాడో? ఎలాంటి సత్కార్యాలు చేశాడో? ఎన్ని నిజాలు పలికాడో? ఎంతటి మహానుభావులకు కూడా ఏనాడూ దరిచేరని ఓ హరీ! నీవు ఈ భోగిరాజు పడగలపై వినోదంగా నాట్యం చేశావంటే ఇది ఎంతటి భాగ్యమో కదా!'

(సశేషం)

కథాసుధ

పడవ ప్రయాణం

ఓ పండితుడు ఆధ్యాత్మిక ఉపన్యాసం ఇవ్వడానికి బయలుదేరాడు. తను వెళ్లాల్సిన ఊరు చేరాలంటే నది దాటవలసి ఉంటుంది. అందుకని పడవ ఎక్కాడు. పడవను నడిపే వ్యక్తి ఆసక్తిగా 'జీవితం అంటే ఏమిటి?' అని పండితుణ్ని అడిగాడు. 'నదీ ప్రయాణం లాంటిదే జీవితం. బయలుదేరిన పడవలో ఎంతోమంది ఎక్కుతారు. కలుసుకుంటారు. ఒకర్ని ఒకరు చూసుకుంటారు. ఒకరి గురించి ఒకరు తెలుసుకుంటారు. ఎన్నెన్నో మాట్లాడుకుంటారు. వారు దిగాల్సిన ఒడ్డు వచ్చాక దిగి తలో దిక్కుకు వెళ్లిపోతారు. మరో ఒడ్డులో మరికొందరు ఎక్కుతారు. వాళ్లూ పడవలో ప్రయాణం చేస్తారు. వారి గమ్యం వచ్చాక వారు కూడా దిగి వెళ్లిపోతారు. మనం కూడా మన గమ్యం వచ్చేంతవరకు మాత్రమే ప్రయాణం సాగిస్తాం. ఈ పడవ ప్రయాణంలాగే మన జీవితంలో కూడా అదే జరుగుతుంది. ఈ భూమి మీదికి వచ్చాక మన జీవితంలోకి ఎంతోమంది తొంగి



చూస్తారు. మనతోపాటు ప్రయాణం చేస్తారు. వారి గమ్యం వచ్చాక మనల్ని వీడిపోతారు. అలా వెళ్లేటప్పుడు వెళ్లిపోతామని కూడా చెప్పరు, చెప్పడానికి కూడా వారికి కుదరదు. మనం కూడా అంతే. చెప్పాపెట్టకుండా ప్రయాణం ముగిస్తాం. ఇక్కడ మనం గుర్తించాల్సింది ఏమిటంటే ఈ పడవ ప్రయాణం తాత్కాలికమని గ్రహించాలి. ఈ భూమి మీదికి ఒంటరిగా వచ్చాం, ఒంటరిగా ఉంటాం, అలాగే వెళ్లిపోతాం. మన జీవిత ప్రయాణంలో ఎదురయ్యే వారు, వారితో అనుబంధాలు... శాశ్వతమని భావిస్తేనే సమస్య. అంతేకాకుండా ఈ సృష్టిలో అందరూ సమానమే అని గుర్తించాలి. ప్రశాంతంగా ప్రవహించే ఈ నదిలో హఠాత్తుగా సుడిగుండాలు వస్తే అందరం మునిగిపోతాం. చిన్నా పెద్దా, పేదా ధనిక, కులం, మతం తేడా ఉండదు. ఎందుకంటే సృష్టిలో విభజన లేదు. మనిషే విభజనను తయారుచేశాడు. అందరూ మనవాళ్లే అనుకుంటే జీవితం మధురం. విభజన చేసి చూస్తే భయంకరమైన విషం. అందుకే అన్ని జీవరాశులపట్ల ప్రేమను ప్రదర్శించాలి. అది గొంతు నుంచి కాదు, హృదయం నుంచి రావాలి' అని వివరించాడు.

... ఆర్సీ కృష్ణస్వామి రాజు,
93936 62821

ఉపనిషత్ వాక్యం


విభూతి.. అపర సంజీవని

భస్మ పాపం నిర్దహంతియేనోక్షం వదా తీతి భగవాన్ కాలాగ్ని రుద్రః...
(బృహజ్జాబాల ఉపనిషత్తు తృతీయం బ్రాహ్మణం- 38)

విభూతి పాపాన్ని పోగొట్టి మోక్షం ఇస్తుందని కాలాగ్నిరుద్రుడు భుసుండునికి వివరించాడు.

పాపం నాశయతే కృత్స్నమపి జన్మాంతరార్జితం
(చతుర్థం బ్రాహ్మణం- 32)

జన్మజన్మలుగా పేరుకుపోయిన పాపాన్ని సైతం విభూతి పూర్తిగా నశింపజేస్తుందని శ్లోక భావం. అంతే కాకుండా నిర్జీవుల వారికి భస్మం ప్రాణదానం చేసే సంజీవనిలాగాను పనిచేస్తుందని ఈ ఉపనిషత్తు ప్రతిపాదిస్తున్నది. వశిష్ఠుని వంశంలోని ధనంజయుడనే బ్రాహ్మణునికి నూరుగురు భార్యలు. పెద్దభార్య కొడుకు కరుణుడు. అతని భార్య శుచిస్మిత. అతను అన్నదమ్ముల వైరం కారణంగా.. భవానీ తీరంలోని నరసింహుడి దగ్గరికి వెళ్లాడు. అక్కడ ఇంకెవరో నైవేద్యంగా సమర్పించిన నిమ్మపండు వాసన చూశాడు. అక్కడి వారు కోపంతో నూరేండ్లు అడవి ఈగవై పొమ్మని కరుణుణ్ని శపించారు. అతను భార్యతో తనను రక్షించు మన్నాడు. అంతలోనే ఈగగా



మారిపోయాడు. దాయాదులు ఆతణ్ని నూనెలో పారేసి చంపేశారు. శుచిస్మిత భర్త మృతదేహంతో అరుంధతి దగ్గరికి వెళ్లింది. ఆమె మృత్యుంజయ మంత్రంతో అభిమంత్రించి భస్మాన్ని ఈగ మీద చల్లింది. అది బతికింది. తర్వాత వందేండ్లు నిండాక ఒకరు ఆ ఈగను చంపడంతో శాపం తీరింది. మరో సందర్భంలో శ్రీహరి.. శివుడి వక్షస్థలంలోని భస్మాన్ని ప్రణవంతోనూ, గాయత్రితోనూ, పంచాక్షరితోనూ అభిమంత్రించి తన శరీరానికి అలదుకొన్నాడు. శివుణ్ని ధ్యానించాడు. శివుడు దర్శనమిచ్చి విభూతిని భక్షించమని కోరగా హరి అలాగే చేశాడు. క్షణంలో శివుని ప్రతిబింబంలా తెల్లని కాంతితో శ్రీహరి వెలిగిపోయాడు. నాటి నుంచి తెల్లని కాంతి కలవాడుగా మారాడు. 'భస్మ ప్రభావమే ఎరుగను. నీ ప్రభావం ఎలా తెలియగలను?' అని మహావిష్ణువు.. పరమశివుణ్ని కొనియాడాడు. భస్మధారణ ప్రభావం అటువంటిదని పై రెండు ఉదంతాలు తెలియజేస్తున్నాయి. ఇదే బృహజ్జాబాల ఉపనిషత్తులో భస్మధారణ చేసిన వాడు తన భక్తుడు అవుతాడని శివుడు పేర్కొన్నట్టుగా ఉంది.

... డా|| వెలుదండ సత్యనారాయణ